- భారతీయులకు హెచ్-1బీ నిబంధనలు కఠినం
- అమెరికాలో 'హెలెనా' బీభత్సం.. 52 మంది మృతి
- హర్యానా ఎన్నికల్లో ఉచితాలతో ఓట్ల వేట
- సీసీటీవీ నిఘాలో సీబీఎస్ఈ పరీక్షలు
- నన్ను జైలుకు పంపే కుట్ర: కుమారస్వామి

..లోపలి పేజీల్లో

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

ఆదివారం SUNDAY 29.9.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4+32 పేజీల ఆదివారం అనుబంధం Pages: 12+4+32 Pages SUNDAY supplement | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 115 ‖ వెల (Price) రూ.8.00 | ద్వాదశి

ఆదివారం, సూర్యోదయం: 6-06, సూర్యాస్తమయం: 6-06. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం కృష్ణ పక్షం తిథి: ద్వాదశి సాయంత్రం 4-48 వరకు. నక్షత్రం: మఖ పూర్తి. వర్జ్యం: సాయంత్రం 4-59 నుంచి సాయంత్రం 6-45 వరకు. రాహుకాలం: సాయంత్రం 4-35 నుంచి సాయంత్రం 6-05 వరకు. దుర్ముహూర్తం: సాయంత్రం 4-28 నుంచి సాయంత్రం 5-17 వరకు. అమృతకాలం: రాత్రి 3-38 నుంచి తెల్లవారుజామున 5-25 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline



తెలంగాణభవన్‌లో బాధితుల గోడు విని భావోద్వేగానికి గురైన మాజీ మంత్రి హరీశ్‌రావు

తెలంగాణ జనతా గ్యారేజ్



ఇక్కడ బాధితులకు భరోసా.. రక్షణ ఇవ్వబడును

కరుణ లేని కాంగ్రెస్ సర్కారు ఎక్కడ తమ ఇండ్లను కూల్చుతుందోనన్న భయంతో నాలుగైదు రోజులుగా కంటిమీద కునుకులేకుండా.. కంటికి మంటికి ధారగా ఏడుస్తూ వణుకుతున్న మూసీ నిర్వాసిత బాధితులు తెలంగాణ జనతా గ్యారేజ్ అయిన తెలంగాణ భవన్‌కు శనివారం తండోపతండాలుగా తరలివచ్చారు. కంటికి రెప్పయి కాపాడుకునే బీఆర్ఎస్‌తోనే తమకు భరోసా దొరుకుతుందన్న నమ్మకంతో బరువెక్కిన గుండెలపై పిల్లాపాపలను ఎత్తుకొని ఉదయాన్నే పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి ఎదుట తమ గోడు వెళ్లబోసుకుంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. వారి దుఃఖాన్ని చూసి చలించిపోయిన హరీశ్, సబిత సైతం కంటతడి పెట్టుకున్నారు. బాధితుల ఆక్రందన ఆసాంతం విని భరోసా ఇచ్చారు. ఆందోళన చెందవద్దని, బీఆర్ఎస్ అండగా ఉంటుందని, న్యాయం జరిగేదాకా పోరాటం చేస్తామని, బాధితులపై పైసా భారం పడకుండా న్యాయ సాయం అందిస్తామని హామీ ఇచ్చారు.



శనివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలు హరీశ్, సబితలను కలిసి తమ గోడు వెళ్లబోసుకుని కన్నీటి పర్యంతమవుతున్న బాధితులు

మూసీలో పారేవి నీళ్లు కాదు.. పేదల రక్తం

హైడ్రా.. హైడ్రోజన్ బాంబులా ఉంది.. అందరినీ నిద్రకు దూరం చేస్తున్నది

బాధితులకు బీఆర్ఎస్ రక్షణ .. మా తలుపులు తెరిచే ఉంటాయి: హరీశ్

- బరువెక్కిన గుండెలతో బీఆర్ఎస్ ఆఫీసుకు మూసీ, హైడ్రా కూల్చివేతల బాధితులు
- పిల్లలతో సహా తరలివచ్చిన కుటుంబాలు
- గోడు వెళ్లబోసుకుంటూ మహిళల కన్నీళ్లు
- చలించిపోయి హరీశ్, సబిత కంటతడి
- న్యాయ సహాయం చేస్తామని హామీ
- బుల్డోజర్ పాలనపై రాహుల్ ఏం చెప్తరు?
- మూసీపై అఖిలపక్ష భేటీ పెట్టాలి: హరీశ్
- మూసీ ప్రాంతాల్లో నేడు బీఆర్ఎస్ పర్యటన
- ఫోన్‌చేస్తే బుల్డోజర్ల కంటే ముందే మేం వచ్చేస్తం: సబితాఇంద్రారెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): మూసీ సుందరీకరణ పేరుతో అందులో గోదావరి నీళ్లు పారిస్తామని అంటున్నారని, కానీ అందులో పారేది పేద, మధ్య తరగతి ప్రజల రక్తమని మాజీమంత్రి హరీశ్‌రావు ఆక్షేపించారు. హైడ్రా.. హైడ్రోజన్ బాంబులా మారి ఎవరినీ కంటినిండా నిద్రపోనియ్యడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ బాధితులు అధైర్య పడొద్దని, వారికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని, అవసరమైన న్యాయ సహాయం అందిస్తామని ధైర్యం చెప్పారు. మూసీ పరీవాహక ప్రాంతాలకు 2వ పేజీలో

870 కోట్ల ఆర్థిక అక్రమాలు?



రెండోరోజూ కొనసాగిన తనిఖీలు.. రహస్యంగా రెండుచోట్ల ఈడీ సోదాలు

భారీగానే దొరికిన నోట్ల కట్టలు.. డబ్బు ఎక్కడిది? ఎవరికి పంపుతున్నారంటూ విచారణ

రాఘవ ప్రైడ్‌లో తరలింపులపై ఈడీ ఆరా.. నేడు ఈడీ నుంచి అధికారిక ప్రకటన?

ఎలక్ట్రిక్ కంపెనీతో భారీ స్కెచ్?

- ఆ కంపెనీకి 'రాఘవ'కు మధ్య ఆర్థిక లావాదేవీలు
- ఇరు కంపెనీల భాగస్వామ్యంతో మనీలాండరింగ్
- ఆ ఎలక్ట్రిక్ కంపెనీకి 9 దేశాలతో సంబంధాలు
- కస్టమ్స్, ఈడీ దర్యాప్తులో కొత్త కోణాలు

10

రూ.7 కోట్ల వాచీలు ఎవరెవరికి?

- సింగపూర్ నుంచి 12 వాచీల కొనుగోలు
- కంపెనీ డబ్బు హవాలా రూపంలో చెల్లింపు
- స్వయంగా వాచీలు తెచ్చిన ముఖ్య నాయకుడు
- వాచీలు ఎవరెవరికి ఇచ్చారో ఆరా తీస్తున్న ఈడీ?


ఆ కాంట్రాక్ట్ ఎలా దక్కింది?

- నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు దక్కడంపై ఈడీ ఆరా?
- మేఘాతో లోపాయికారి ఒప్పందాలపైనా నజర్

భోగారంలో అక్రమ మైనింగ్!

- రోడ్డు పనుల కోసం యథేచ్ఛగా మట్టిని తోడేస్తున్న పొంగులేటి బినామీలు
- ఉన్నతస్థాయి ఒత్తిడితో వదిలేసిన అధికారులు?

10



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇండ్లు, ఆఫీసుల్లో జరిపిన సోదాల్లో భారీగా నగదును గుర్తించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. లగ్జరీ వాచీల స్మగ్లింగ్, యూరో ఎగ్జిం బ్యాంకు గ్యారెంటీలు, టీడీఎస్ ఎగవేత, అక్రమాస్తులు, రాఘవ కన్‌స్ట్రక్షన్స్, ఎలక్ట్రిక్ కంపెనీల లావాదేవీల వ్యవహారం.. ఇలా సుమారు రూ.870 కోట్ల మేర లావాదేవీలపై ఈడీ అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం.

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): రెండు రోజుల పాటు మంత్రి పొంగులేటి నివాసాలు, ఆఫీసులపై జరిగిన సోదాల్లో అక్రమ లావాదేవీలకు సంబంధించిన పత్రాలు ఈడీ తీసుకెళ్లిందని, వాటిని అధ్యయనం చేయాల్సి ఉంటుందని విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. అనేక కంపెనీలు ఉండటం, అనేక మార్గాల్లో లావాదేవీలు జరగడంతో ఎంతమేర అక్రమాలు జరిగాయనేదానిపై తుది నిర్ధారణకు రాలేకపోతున్నారని చెప్పుకుంటున్నారు. అందుకే ఈడీ నుంచి ఇప్పటివరకు అధికారికంగా నోట్ విడుదల కాలేదని అంటున్నారు. మరోవైపు.. సోదాల్లో భారీగా సొమ్ము పట్టుబడి ఉండొచ్చని ప్రచారం జరుగుతున్నా.. ఇప్పటివరకు నిర్ధారణ కాలేదు. ఎక్కడ రెయిడ్ చేసినా రూ.కోట్ల నగదు దొరికిందని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఓ అధికారి తెలిపారు. ఇంత భారీస్థాయిలో దొరికిన నగదు ఎక్కడిది? మంత్రి ఇంటి వరకూ ఎలా వచ్చింది? ఈ మొత్తాన్ని ఎక్కడికి పంపుతున్నారని నిగ్గు తేల్చే పనిలో ఈడీ అధికారులు ఉన్నారు. కొన్ని రాష్ట్రాలకు ఎన్నికలు జరుగుతున్న వేళ.. కాంగ్రెస్ పార్టీకి ఆర్థిక ఆధారంగా ఉన్న రెవెన్యూ శాఖ మంత్రి ఇంట్లో ఇంత భారీ మొత్తంలో నగదు దొరకడంపై పలు రకాల అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈడీ అధికారులు శుక్రవారం జరిపిన సోదాల్లో కీలక సమాచారం దొరకగా.. శనివారం కూడా అత్యంత రహస్యంగా, ఎలాంటి భద్రత లేకుండా మరో రెండు చోట్ల సోదాలు చేపట్టారు. అయితే, సోదాలు ఎక్కడ జరిగాయన్నది మాత్రం చాలా గోప్యంగా ఉంచారు. సోదాలు ఇటు 10వ పేజీలో

హైడ్రా భయంతోనే ముగ్గురి బలవన్మరణం

- ఇల్లు కూలుస్తరనే బుచ్చమ్మ ప్రాణాలిడిసింది
- పేదలను పొట్టన పెట్టుకుంటున్న కాంగ్రెస్ సర్కార్
- కూల్చివేతకు ముందే ప్రత్యామ్నాయం చూపాలి
- గాంధీ దవాఖాన వద్ద బుచ్చమ్మకు హరీశ్ నివాళులు

2

భగ్గుమన్న పశ్చిమాసియా



- ఇజ్రాయెల్ దాడుల్లో హెజ్బొల్లా చీఫ్ నస్రల్లా హతం
- సురక్షిత ప్రాంతానికి ఇరాన్ అధ్యక్షుడు అలీ ఖమేనీ
- ఇజ్రాయెల్‌పై ఇరాన్‌లో వెల్లువెత్తిన నిరసనలు
- ఇజ్రాయెల్‌లో అదనపు బలగాలు.. స్వదేశానికి బెంజమిన్ నెతన్యాహు

6



విదుషీమణి విజయ భారతి కన్నుమూత

- ప్రముఖులు, సాహితీవేత్తల సంతాపం
- దళితచైతన్య రచనలు, తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా ఎనలేని సేవలు
- మాజీ సీఎం కేసీఆర్ సంతాపం

7

ఎస్‌ఎఫ్‌టీకి 200 ఇస్తేనే అనుమతి!

- ఆ సారే ప్రాపర్ చానల్.. ఆయనను కలవాల్సిందే
- హెచ్‌ఎండీఏలో నిర్మాణాల ఫైళ్లు క్లియర్ చేసేది ఆయనే
- ఎస్‌ఎఫ్‌టీకి కనిష్ఠంగా రూ.40.. గరిష్ఠంగా 200 వసూలు
- అయ్యగారికి సమర్పించుకోలేక చేతులెత్తేస్తున్న బిల్డర్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): 'మీ లేఅవుట్లకు అనుమతులు కావాలా.. అయితే ఫలానా సార్‌ను కలిసి రండి. ఆయనే చూసుకుంటారు. ఫైలు ఇక్కడే ఇవ్వండి.. క్లియరెన్స్ మాత్రం అక్కడ చేసుకొని రండి' ఇదీ ఇటీవల రాష్ట్రంలోని కొందరు రియల్టర్లు హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ)లో ఎదుర్కొంటున్న విచిత్రమైన పరిస్థితి. డైరెక్ట్‌గా లేఅవుట్లు, భవన నిర్మాణ అనుమతుల కోసం ఎవరైనా వెళ్తే పనులు అవ్వడం లేదక్కడ..' త్రూ ప్రాపర్ చానల్' అంటూ అక్కడి ఉన్నతాధికారులే ఓ రియల్‌ఎస్టేట్ వ్యాపారి నంబర్, అడ్రస్ ఇచ్చి పంపుతున్నారు. ఆ సార్ అన్నీ పరిశీలించి అనుమతులు ఇవ్వడానికి ఉండే కండిషన్లు చెప్తారు. ఆ కండిషన్లు ఓకే అయితే.. ఫైలు తీసుకోవాలని హెచ్‌ఎండీఏ/జీహెచ్‌ఎంసీ అధికారులకు ఆదేశాలు ఇస్తారు. గడిచిన పది నెలలుగా 8వ పేజీలో



నిర్మల, నడ్డాపై ఎఫ్ఐఆర్

- కంపెనీలను బెదిరించి ఎన్నికల బాండ్లు కొనిపించారని ఫిర్యాదు
- బీజేపీ నేతలకూ ప్రమేయం..8 వేల కోట్ల దోపిడీ జరిగిందని ఆరోపణ
- మార్చిలోనే ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం..
- కోర్టు ఆదేశాలతో స్పందన

6


తెలంగాణ భవన్ వద్దకు వచ్చిన మూసీ బాధితుల గోడు వింటున్న హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి


తెలంగాణ భవన్‌లో తన కొడుకును ఒళ్లో కూర్చోబెట్టుకొని దీనంగా ఉన్న మహిళ


మాజీ మంత్రి మహమూద్ అలీకి తమ గోడు వెళ్లబోసుకుంటున్న బాధిత ముస్లిం మహిళలు

మూసీలో పారేవి నీళ్లు కాదు.. ప్రజల రక్తం

▸ మొదటిపేజీ తరువాయి...

చెందిన వందలాదిమంది శనివారం తెలంగాణ భవన్‌కు వచ్చారు. హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి వారి బాధలు విని ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ బుల్డోజర్ పాలన నడవదని దేశమంతా తిరుగుతూ చెప్తున్న రాహుల్‌గాంధీ తెలంగాణలో ఏం చెప్తారని ప్రశ్నించారు. మూసీపై ప్రభుత్వం వెంటనే అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూసీ బాధితుల బాధ అనుభవించే వారికే తెలుస్తుందని, రేవంత్‌రెడ్డికి ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. సీఎం తన సోదరుడికి 45 రోజుల సమయం ఇచ్చి, పేదల ఇండ్లను మాత్రం రాత్రికి రాత్రే కూల్చివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి చేస్తున్న గొప్ప పని సుందరీకరణ మాత్రమేనని చెప్పారు. ఏదైనా ఒక పని చేపడితే అది ఎంతోమందికి ఉపయోగకరంగా ఉండాలని పేర్కొన్నారు. కేసీఆర్ మిషన్ భగీరథ ప్రత్యక్షంగా ప్రజలకు ఉపయోగపడిందని, కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల లక్షల ఎకరాలకు నీళ్లు అందాయని గుర్తుచేశారు. కానీ, రేవంత్‌రెడ్డి సుందరీకరణ పేరుతో వేల కుటుంబాల ఉసురు పోసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

పర్మిషన్ ఎందుకిచ్చారు?

మానాన్నది చిన్న కండక్టర్ ఉద్యోగం. మా మావయ్య రైల్వేలో చిన్న ఉద్యోగి. పైసాపైసా కూడబెట్టుకొని కార్పొరేషన్ నుంచి అన్ని అనుమతులు తీసుకొనే ఇల్లు కట్టుకున్నం. బ్యాంకు గూడా లోన్ మంజూరు చేసింది. ఇప్పుడు మూసీ బ్యూటిఫికేషన్ పేరిట రాత్రికిరాత్రే కూల్చేస్తామంటే ఎట్ల. మా బతుకులు ఏమైపోతయ్. అభివృద్ధి అంటే కింది నుంచి పైకి వెళ్లాలి. మరి ప్రభుత్వం మమల్ని పై నుంచి కిందకు తోసేస్తున్నది. ప్రభుత్వం ఆలోచించాలి. మాకు అండగా నిలుస్తున్న బీఆర్‌ఎస్ నాయకులకు పాదాభివందనాలు.

- శిరీష(గండిపేట)



అనుమతులు ఇచ్చి కూల్చేస్తారా?

ఇండ్లు కట్టుకున్న వారికి రిజిస్ట్రేషన్ నుంచి విద్యుత్తు కనెక్షన్ వరకు అన్నింటికీ అనుమతులిచ్చి ఇప్పుడు కూల్చేస్తామంటే ఎలా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే వారికి అనుమతులు ఇచ్చిందని గుర్తుచేశారు. ఇప్పుడు వాటిని కూలుస్తామనడం అన్యాయమని పేర్కొన్నారు. పేదలకు మేలుచేస్తే దీవెనలు ఇస్తారని, వారి ఉసురు తీస్తే శాపనార్థాలు పెడతారనే లాజిక్‌ను రేవంత్‌రెడ్డి మిస్సవుతున్నారని పేర్కొన్నారు. దేవుడు ఇచ్చిన అవకాశాన్ని మంచి పనికి ఉపయోగించాలని సూచించారు. ఈ మూర్ఖుడికి కూల్చడం తప్ప కట్టడం తెలియదన్నట్టుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కూల్చుడు, కేసులు, అక్రమాలు తప్ప పేదలకు పనికొచ్చే ఒక్క పని కూడా ఈ ప్రభుత్వం చేయడం లేదని పేర్కొన్నారు. తాను 2035 వరకు ఈఎంఐ కట్టాల్సి ఉన్నదని ఓ సోదరి చెప్పిందని, ఇల్లు కూలగొడితే ఈఎంఐ ఎలా కట్టాలని, కొత్త ఇంటి కిరాయి, పిల్లల ఫీజులు, ఖర్చులు.. మొత్తంగా ఆ కుటుంబం పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. రూపాయి, రూపాయి జమచేసి ఇల్లు కట్టుకుంటే రాత్రికి రాత్రే దానిని కూలగొడితే ఆ కుటుంబాలు ఏం కావాలని ప్రశ్నించారు.

అఖిలపక్షం సమావేశం ఏర్పాటు చేయాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనాలోచితంగా, తలా తోక లేకుండా నిర్ణయాలు తీసుకుంటున్నారని హరీశ్‌రావు విమర్శించారు. నిజంగానే అభివృద్ధి చేయాలనుకుంటే అందుకు పేదల ఉసురు తీసుకోవాల్సిన పనిలేదని అన్నారు. మూసీపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ముందుకెళ్లాలని ప్రభుత్వానికి సూచించారు. పిల్లలకు కట్టించి ఇచ్చిన ఇండ్లు కూలగొడితే వారి పరిస్థితి ఏంటన్న బాధతోనే బుచ్చవ్వ ఆత్మహత్య చేసుకున్నదని తెలిపారు. ఆమెది రేవంత్ చేసిన హత్య అని ఆరోపించారు.

> “ కేసీఆర్ హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచడంతో ఇక్కడికొచ్చి స్థిరపడితే పిల్లలు బాగుపడతారని ఎంతోమంది ఇక్కడికొచ్చి సెటిలయ్యారు. ఇప్పుడేమో ఎందుకొచ్చామా? అనే పరిస్థితికి రేవంత్‌రెడ్డి తీసుకొచ్చారు. రేవంత్‌రెడ్డి తుగ్లక్ నిర్ణయాల వల్లే ఈ పరిస్థితి వచ్చింది. హైదరాబాద్ పరిస్థితి మసకబారుతున్నది. తమను దొంగల్లా, కబ్జాకోరుల్లా చూపెడుతున్నారని బాధితులు ఆవేదన చెందుతున్నారు. బాధిత కుటుంబాలకు మరక అంటించే ప్రయత్నం చేస్తున్నారు. **-హరీశ్‌రావు**

> “ బుల్డోజర్ రాజ్ అంటూ హర్యానాలో ఎన్నికల ప్రచారం చేస్తున్న రాహుల్‌గాంధీ తెలంగాణలో ఏం నడుస్తున్నదో తెలుసుకోవాలి. తెలంగాణలో నడుస్తున్నది కూడా బుల్డోజర్ రాజ్యమే. ఇక్కడి బుల్డోజర్లను ఆపకుండా మహారాష్ట్ర, ఝార్ఖండ్, హర్యానాలో బుల్డోజర్ రాజ్ నడవదంటే రాహుల్ మాటలను ప్రజలు ఎలా నమ్మాలి. **- హరీశ్‌రావు**

ఆరు గ్యారెంటీలు ఏవి?

వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని బాండ్ పేపర్లు రాసిచ్చారని, ప్రభుత్వం తొలుత దానిపై దృష్టిసారించాలని హరీశ్‌రావు కోరారు. అసరా పింఛనును రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామని చెప్పారని, మహిళలకు 2500, రైతులకు 7500, యువతకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారని, వీటి అమలు సంగతి చూడాలని పేర్కొన్నారు. పేదల ఇండ్లను కూలగొట్టుడు ఎందుకు? బడా కంపెనీలకు ఇచ్చుడు ఎందుకని ప్రశ్నించారు. పేదల ప్రాణాలు తీసి కంపెనీలు కడతావా? రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తావా? అని నిలదీశారు.

న్యాయ సహాయం అందిస్తాం

మూసీలో ఉండే పేదలు అక్కడే చిన్న చిన్న పనులు చేసుకొని బతుకుతారని, వారికి ఎక్కడో డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామంటున్నారని మండిపడ్డారు. తుగ్లక్ పనుల వల్ల ఒక కుటుంబం మొత్తం జీవనాధారం కోల్పోతుందని, ఒకే రోజు వేల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. బాధితులకు హైకోర్టు ద్వారా రక్షణ కల్పించేందుకు బీఆర్‌ఎస్ న్యాయవాదుల బృందం ఉంటుందని, మూసీ బాధితుల తరుపున న్యాయపరంగా పోరాటం చేస్తామని హామీఇచ్చారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల బృందం మూసీ బాధితుల ప్రాంతాల్లో పర్యటిస్తుందని, బాధితులకు భరోసా కల్పిస్తామని, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని చెప్పారు.

కేసీఆర్ అంటే ఒక భరోసా

బాధితులకు న్యాయపరంగా అందుబాటులో ఉంటామని మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి భరోసా ఇచ్చారు. పద్ధతిగా ఉన్నప్పుడు ప్రభుత్వమే ప్రజలపై దౌర్జన్యం చేస్తే చూస్తూ ఎలా ఊరుకుంటామని ప్రశ్నించారు. బాధితులు ఫోన్ చేస్తే బుల్డోజర్ల కంటే మేమే ముందు వస్తామని చెప్పారు. హైదర్‌షాకోటలో గల్లీగల్లీ తనకు తెలుసని, బీఆర్‌ఎస్ హయాంలో అక్కడ అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. తమను ఆక్రమణదారులని అనడంతో బాధితులు బాధపడుతున్నారని పేర్కొన్నారు.

సుందరీకరణపేరిట విధ్వంసం: మహమూద్ అలీ

‘మూసీ సుందరీకరణ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం విధ్వంసం సృష్టిస్తున్నది. ఇష్టారీతిన పేదల ఇండ్లను కూల్చుతూ వారిని రోడ్డున పడేస్తున్నది. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనం’ అని మాజీ డిప్యూటీ సీఎం మహమూద్‌అలీ ధ్వజమెత్తారు. అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. హైడ్రా పేరిట డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

> “ మూసీ బాధితుల పక్షాన ఉంటాం. బాధితులు ధైర్యం కోల్పోవద్దు, ఎక్కువగా టెన్షన్ తీసుకోవద్దు, ఎప్పుడైనా మా తలుపులు తెరిచే ఉంటాయి. ఎప్పుడైనా రావచ్చు, బఫర్ జోన్‌లో ఉన్నవారిని ఇబ్బంది పెట్టకుండా చూస్తాం. **- హరీశ్‌రావు**

జనతా గ్యారేజ్

“ఇక్కడ బాధితులకు భరోసా.. రక్షణ ఇవ్వబడును”

బరువెక్కిన గుండెలతో తెలంగాణ భవన్‌కు మూసీ, హైడ్రా కూల్చివేతల బాధితులు

- పిల్లలతో ఉదయాన్నే తరలివచ్చిన కుటుంబాలు
- బీఆర్‌ఎస్‌తోనే భరోసా దొరుకుతుందన్న నమ్మకం
- గోడు వెళ్లబోసుకుంటూ కన్నీళ్లుపెట్టుకున్న మహిళలు
- చలించిపోయి హరీశ్, సబిత కంటతడి

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రజల ఆకాంక్షల ప్రతిరూప సౌధమది. అన్ని సందర్భాల్లో అభాగ్యులకు అండ అది. స్వరాష్ట్ర సమరంలో ఉద్యమకారులను గుండెల్లో దాచుకున్నట్టే ఇవ్వాళ మూసీ, హైడ్రా బాధితులకు తెలంగాణ భవన్ ఆలవాలమైంది. మొన్న రైతులు.. నిన్న ఉద్యోగార్థులు.. నేడు దయలేని కాంగ్రెస్ చేష్టలతో నిరాశ్రయులవుతున్న బడుగుజీవులకు గొడుగు పట్టింది. ఎండనకా..వాననకా నెత్తురు చెమటగ చేసి కట్టుకున్న ‘గూడు’ను రాత్రికి రాత్రే సర్కారు నేలమట్టం చేస్తే నిరాశ్రయులు తమ కాళ్ల మీద తాము నిలబడే ధైర్యమైంది. గోడువినే నాథుడే లేక దీనంగా ఎదురుచూసే పేదలకు దారిచూపే దీపమైంది. తెలంగాణ భవన్ ఇప్పుడు జనతా గ్యారేజ్ అవతారమెత్తింది.

కటిక చీకటిలో.. గులాబీ వెలుగురేఖ

గొలుసుకట్టుగా సాగుతున్న కూల్చివేతలతో ఆవేదన, ఆందోళన నిండిన తనవులతో వంతుల వారీగా మూసీ పరీవాహక ప్రాంత జనం గస్తీ తిరుగుతున్నారు. కూల్చివేతల్లో సర్వం కోల్పోయిన బాధితులు దిక్కుతోచక ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. గోడు వెళ్లబోసుకుందామన్నా సర్కారు చెవులు మూసుకున్నది. గూడు చెదిరిన గుండెలు బెంగటిల్లుతున్నాయి. ఇలాంటి కష్టకాలంలో బాధితులకు అండగా ఉండాలని బీఆర్‌ఎస్ నిర్ణయించింది. ‘24/7 ఎప్పుడైనా సరే.. బాధితులెవరైనా సరే.. తెలంగాణ భవన్ తలుపు తట్టండి..మీకు అండగా మేము ఉంటాం’ అని ప్రకటించింది. ఆ ప్రకటన కూల్చివేతల బాధితులకు కొండంత భరోసా అయి శనివారం ఉదయం నుంచే తెలంగాణ భవన్ మూసీ బాధితుల కన్నీళ్లతో ఉద్విగ్నం కావటం మొదలైంది. పిల్లాజెల్లా, ముసలీముతకతో గుడ్ల నిండా నీళ్లతో కడుపునిండా దుఃఖంతో బాధితులు రావడం కనిపించింది. సర్కారు తమ బతుకులను ఎట్లా చిత్రవధ చేస్తున్నదో చెప్పుకొనేందుకు ఎవరికివారుగా వందల సంఖ్యలో తరలివచ్చారు. హైదర్‌షాకోట్, చాదర్‌ఘాట్, బండ్లగూడ తదితర ప్రాంతాల నుంచి తండోపతండాలుగా వచ్చారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రెండు రోజులుగా తీవ్రజ్వరంతో బాధపడుతుండడంతో ఆయన మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డికి సమాచారం అందించారు. ఉన్నపళంగా వారు తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు.

బాధితుల్లో ధైర్యం నింపిన మాజీ మంత్రులు

అప్పటికే ఉద్విగ్నంగా మారిన తెలంగాణ భవన్‌కు మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి సహా పలువురు నేతలు చేరుకున్నారు. ఒక్కొక్కరి గాథలను ఓపిగ్గా విన్నారు. పేరుపేరునా.. కాలనీల వారీగా, బస్తీల వారీగా బాధితుల వేదనను నోట్ చేసుకున్నారు. పలు సందర్భాల్లో వారూ భావోద్వేగానికి లోనయ్యారు. బాధితులు కన్నీటి పర్యంతమవుతుంటే తట్టుకోలేకపోయారు. హరీశ్, సబిత కండ్లల్లోనూ నీళ్ల సుడులు తిరిగాయి. వారు మాట్లాతున్నప్పుడూ గద్గద స్వరంతో గొంతులు జీరబోయాయి. అన్నివిధాలా అండగా ఉంటామని అభయం ఇచ్చారు. అవసరమైతే బుల్డోజర్ ముందు తాము ఉంటామని ధైర్యం చెప్పారు.

నేడు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల పర్యటన

ఆదివారం ఉదయం మాజీ మంత్రి హరీశ్ నేతృత్వంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకుల బృందం మూసీ ప్రభావ ప్రాంతం హైదర్‌షా కోట్‌లో పర్యటించనుంది. తెలంగాణ భవన్‌కు వచ్చిన వారికి భరోసా ఇచ్చిన బీఆర్‌ఎస్ నేతలు, నేడు స్వయంగా వెళ్లి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించనున్నారు.

ఒక్కొక్కరిదీ ఒక్కో కన్నీటి వ్యథ..

ఒక్కొక్కరూ ఒక్కో కన్నీటిగాథై కదిలారు. ‘నేను వేరే రాష్ట్రం అమ్మాయిని. కోడలిగా ఇక్కడి (హైదరాబాద్)కి వచ్చినప్పటి నుంచి ఇలాంటి దారుణాన్ని చూడలేదు. ఇప్పుడు నేనే ఆ బాధ అనుభవిస్తానని కలలోకూడా అనుకోలేదు.. మేం ఏం పాపం చేసినం? రెండేండ్లు కిరాయి ఉండి.. పైసా పైసా పోగేసి పదేండ్ల కింద పర్మిషన్ తీసుకునే ఇల్లుకట్టుకున్నం. పన్నులు కడ్తుతున్నం. చెప్పాపెట్టకుండా వచ్చి కూలగొట్టారు. ఇప్పుడు ఎక్కడికి పోవాలి. మీ అత్తగారి ఊళ్లో బతకలేరా? అంటే మావాళ్లకు ఏమని సమాధానం చెప్పాలి?’ అని ఒకరు.. ‘మేం అభివృద్ధికి అడ్డం కాదు. అన్నీ డాక్యుమెంట్లు చూసే కట్టుకున్నం. బ్యాంకులోన్ తీసుకున్నం. సక్రమంగా లేకపోతే లోన్ ఇవ్వరు కదా?. 2035 దాకా ఈఎంఐలు కట్టాలి. పిల్లలు చిన్నవాళ్లు.. ఇప్పుడెక్కడికి పోవాలి?’ అని ఒకరు. ‘ఎఫ్‌టీఎల్‌ను ఆక్రమించారు. బఫర్‌జోన్‌లో కట్టుకున్నారు. ఆక్రమణదారులు.. ఇలా రకరకాల ట్యాగ్‌లు వేస్తున్నారు. ఇండ్లు కూల్చి రోడ్డుమీద పడేశారు. మమ్మల్ని చిత్రవధ చేస్తున్నారు’ అని ఇంకొకరు ఇలా ఎవరిని కదిలించినా కన్నీటి ధారలే కురిశాయి.

కూల్చే హక్కు నీకెక్కడిది?

మూసీ పరీవాహక నివాసితుల నిలదీత

కాంగ్రెస్‌ను గద్దె దించుతామని హెచ్చరిక

రామంతాపూర్, సెప్టెంబర్ 28 : ‘పైసా, పైసా కూడబెట్టుకొని ప్లాట్లు కొన్నం.. మా కాలనీలోకి ఎన్నడూ రాని మూసీ నీళ్లు ఇప్పడెట్ల వస్తయ్? మేము కొన్న ప్లాట్లలో కట్టుకున్న ఇండ్లను కూల్చే హక్కు నీకెక్కడిది?.. నీకు ఓట్లేసి గెలిపించింది మా ఇండ్లు కూల్చేందుకా?’ అంటూ రామంతపూర్ డివిజన్ పరిధిలోని కేసీఆర్‌నగర్, బాలకృష్ణానగర్, సాబేరా కాలనీ, సాయికృష్ణానగర్ నివాసితులు రేవంత్‌రెడ్డి సర్కార్‌ను నిలదీస్తున్నారు. కేసీఆర్‌నగర్, మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఇండ్లు కట్టుకున్నవారు కొన్నిరోజులుగా హైడ్రా చర్యలతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఎప్పుడు తమ ఇండ్లను కూల్చుతారోనని ఆందోళన చెందుతున్నారు. ‘మా ప్రాణాలు పోయినా సరే.. ఇండ్లను కూల్చనివ్వం’ అంటూ తెగేసి చెప్తున్నారు. ఐదు కాలనీలకు చెందినవాళ్లు శనివారం సమావేశానికి యూనిట్‌గా ఏర్పడి ఆందోళనలకు సిద్ధమైనట్టు ప్రకటించారు. కాంగ్రెస్‌ను గద్దె దించేవరకు పోరాటం చేస్తామని హెచ్చరిస్తున్నారు. కాగా మూసీ పరీవాహక ప్రాంతంలో ఉన్న నిర్మాణదారులకు ఎలాంటి నోటీలు ఇవ్వలేదని ఉప్పల్ తహసీల్దార్ వాణీరెడ్డి తెలిపారు.

ఖర్చు మూడింతలెందుకు ?

- **మూసీ సుందరీకరణ పేరిట వేలకోట్లు కొల్లగొట్టేందుకు యత్నం**
- **పాలమూరు - రంగారెడ్డి కన్నా సీఎంకు మూసీయే మక్కువా?: కేటీఆర్**



హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): మూసీ రివర్ ఫ్రంట్ పేరుతో మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తామని పేర్కొనటం వెనుక భారీ బాగోతాలు జరుగుతున్నాయని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ముందు రూ. 50వేల కోట్లు అని చెప్పి తరువాత ప్రాజెక్ట్ అంచనా వ్యయాన్ని మూడింతలు పెంచటం ద్వారా కాంగ్రెస్ ధన దాహం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని విమర్శించారు. తట్టెడు మట్టి తీయకుండా వేల కోట్లు తన్నుకుపోయే కుట్ర జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో కుంభకోణాల కాంగ్రెస్ ఆటలు సాగనివ్వమని తేల్చిచెప్పారు.

మూసీతో మురిసె రైతులెందరు?

మూసీ సుందరీకరణ పేరుతో రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తే ఎంత మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా సాగులోకి వచ్చే ఎకరాలెన్ని? నిల్వ ఉంచే టీఎంసీలెన్ని ? పెరిగే పంటల దిగుబడి ఎంత? తీర్చే పారిశ్రామిక అవసరాలెంత? కొత్తగా నిర్మించే భారీ రిజర్వాయర్లు ఎన్ని అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ రైతుల తలరాతను మార్చిన కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ. 80 వేల కోట్లయితేనే గల్లీ నుంచి ఢిల్లీ దాకా గగ్గోలు పెట్టిన కాంగ్రెస్ ఇప్పుడు ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. లండన్‌లోని థేమ్స్‌లాగా మారుస్తామనే వ్యూహం వెనక థీమ్ ఏంటి ? గేమ్ ప్లాన్ ఏంటి? అని కేటీఆర్ నిలదీశారు.

మూసీయే ముఖ్యమా?

ముఖ్యమంత్రికి కనీసం తను పుట్టిన గడ్డ మీద కూడా మమకారంలేదని కేటీఆర్ ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకన్నా మూసీ ప్రాజెక్టుపైనే ముఖ్యమంత్రి ఎందుకు ఎక్కువ మక్కువ చూపుతున్నారని ప్రశ్నించారు. చివరి దశలో ఉన్న పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును కోల్డ్ స్టోరేజీలోకి నెట్టి మూసీ చుట్టే తిరగటం వెనుక దాగిన ఆంతర్యం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. వేల కోట్లను దోచుకునేందుకే మూసీ పేరుతో డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. మూసీ రివర్ ఫ్రంట్ పేరిట బ్యాక్ డోర్‌లో జరుగుతున్న బాగోతాన్ని తెలంగాణ సమాజం గమనిస్తున్నదని చెప్పారు.


హైడ్రా భయంతోనే ముగ్గురి బలవన్మరణం

- ఇల్లు కూలుస్తరనే బుచ్చమ్మ ఆత్మహత్య
- పేదలను పొట్టన పెట్టుకుంటున్న కాంగ్రెస్
- ముందే ప్రత్యామ్నాయం చూపాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్
- గాంధీ దవాఖాన వద్ద బుచ్చమ్మకు నివాళి


గాంధీ మార్చురీ వద్ద హరీశ్‌రావు, సబిత, కృష్ణారావును అడ్డుకుంటున్న పోలీసులు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ)/బన్సీలాల్‌పేట్: హైడ్రా భయాందోళనతో ఇప్పటి వరకు హైదరాబాద్ నగరంలో ముగ్గురు బలవన్మరణానికి పాల్పడ్డారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. హైడ్రా హెచ్చరికలతో కూకట్‌పల్లి యాదవ బస్తీలో ఆత్మహత్య చేసుకున్న బుచ్చమ్మ మృతదేహానికి నివాళులర్పించేందుకు ఆయన ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, మాధవరం కృష్ణారావు, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో కలిసి శనివారం గాంధీ దవాఖానకు వెళ్లారు. వారిని పోలీసులు ఎక్కడికక్కడే అడ్డుకున్నారు. మధ్యాహ్నం పోస్ట్‌మార్టం పూర్తయ్యాక బుచ్చమ్మ మృతదేహానికి నివాళ్లర్పించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడారు. హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను పొట్టన పెట్టుకుంటుందని ధ్వజమెత్తారు. పేదలపై కనికరం లేకుండా సొంతిండ్లను కూల్చివేస్తుండటంతో భయాందోళనతో గుండెలు ఆగిపోతున్నాయని తెలిపారు. హైడ్రా అధికారులు తమ ఇంటిని కూలుస్తారనే భయంతో కూకట్‌పల్లిలోని నల్లచెరువు వద్ద నివాసముండే బుచ్చమ్మ ఆత్మహత్య చేసుకున్నదని తెలిపారు. పేదలపై విరుచుకుపడుతున్న రేవంత్‌రెడ్డి.. తన సోదరుడు, బడాబాబుల భవంతులను ఎందుకు కూల్చివేయలేదని ప్రశ్నించారు. పేదల ఇండ్లపైకి రాత్రికి రాత్రే బుల్డోజర్లను తీసుకొస్తున్నారని మండిపడ్డారు. పరిహారం ఇచ్చి, ప్రత్యామ్నాయం చూపాకే పేదల ఇండ్లను తొలగించాలని సూచించారు. తక్షణమే అఖిలపక్ష సమావేశం నిర్వహించి అభిప్రాయాలు తీసుకోవాలని చెప్పారు. ప్రజలు భయాందోళనకు గురై ఆత్మహత్యలకు పాల్పడవద్దని, జీవించి ఉండి పోరాడాలని, బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రశాంతంగా ఉన్న హైదరాబాద్‌లో అల్లకల్లోలం సృష్టిస్తున్నారని, బ్రాండ్ ఇమేజ్‌ను డ్యామేజ్ చేస్తున్నారని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆందోళన వ్యక్తం చేశారు.నియోజకవర్గంలోని నిరుపేదలు శని, ఆదివారం వచ్చిందంటే బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారని తెలిపారు. కొద్దిసేపు ఓపీ బ్లాక్ ఎదురుగా ఉన్న మెడికల్ దుకాణాల వద్ద ఉన్న రోగులను హరీశ్ పలుకరించారు. డాక్టర్లు రాసిచ్చిన మందులలో రెండే దవాఖాన ఫార్మసీలో ఇచ్చారని, మిగతావి బయట కొంటున్నామని వారు తెలిపారు.

లోకం పోకడ



ఆ ఒక్క ఇల్లు ఎందుకు కూల్చలేదంటావా?
అది కాంగ్రెస్ నేతది లేవయ్యా?

గుండె తరుక్కుపోతున్నది



నేను చిన్నప్పటి నుంచి హైదరాబాద్‌లో ఉంటున్న. ప్రభుత్వం పర్మిషన్ ఇవ్వడం తోనే ఇక్కడ ఇల్లు కట్టుకున్నం. అన్ని పేపర్లు కరెక్ట్‌గా ఉన్నాయనే బ్యాంకు లోన్ ఇచ్చింది. కానీ ప్రభుత్వం మమ్మల్ని ఆక్రమణ దారులంటూ ట్యాగ్‌లైన్ వేస్తున్నది. ఇప్పుడు ఇల్లు కూలగొడితే మా పరిస్థితేంటి? మా పిల్లలకు మేము ఏం చెప్పుకోవాలి. వాళ్ల చదువులు ఏంగావాలె? గవర్నమెంట్ ఆలోచించి మమ్మల్ని కాపాడాలె. **- సిరిమా (హైదర్‌షాకోట)**

శివారులో డెవలప్ చేయాలె



మేం చట్టబద్ధంగా బండ్లగూడలో ఇల్లు కట్టుకున్నం. కానీ ఇప్పుడు మమ్మల్ని మూసీ ఆక్రమణదారులని ప్రభుత్వం ముద్రవేస్తున్నది. నిజంగా ప్రభుత్వం పర్యాటకంగా అభివృద్ధి చేయాలంటే నగర శివారు ప్రాంతంలో డెవలప్ చేయాలె. వికారాబాద్ దగ్గర కృష్ణా నది వద్ద బ్యూటిఫికేషన్ చేపట్టాలె. గుజరాత్‌లోకూడా ఇట్లనే జేసిన్రు. కానీ ఇక్కడి ప్రభుత్వం హైదరాబాద్ మధ్యలోని జనావాసా ప్రాంతాల్లో మూసీ బ్యూటిఫికేషన్ పేరిట ఆగం చేస్తున్నది. **- మహ్మద్ ఆయూబ్, హైదర్‌షాకోట (బండ్లగూడ)**

కేసీఆర్ పాలనే మంచిగున్నది



మేం మూడు, నాలుగు నెలలుగా భయబ్రాంతులకు గురవుతున్నం. ఈ ప్రభుత్వం మా ఇంటిని కూలగొడతామని భయపెడుతున్నది. కేసీఆర్ పదేండ్ల పాలనలో గిట్ల లేకుండే. ఆయన అందరికీ మంచి జేసిండు. కానీ ఈ ప్రభుత్వం నిర్మించడం బంద్‌పెట్టి హైడ్రా తెచ్చి కూల్చివేతలు మొదలు పెట్టింది. ఎక్కడో లండన్‌లోని థేమ్స్ నదిలెక్క మూసీని చేస్తామని చెబుతున్నది. అక్కడున్న జనాభా ఎంత? ఇక్కడ ఉన్న జనాభా ఎంత? ఇవేవీ పరిగణలోకి తీసుకోకుండా దుర్మార్గంగా ముందుకెళ్తున్నది. **- రాజు, హైదర్‌షాకోట**

రక్షించాల్సిన వారే భక్షిస్తున్నరు



మా అమ్మానాన్న అష్టకష్టాలు పడి ఇక్కడ ఇల్లు కట్టారు. ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైడ్రా తెచ్చి ప్రజలను ఆగం జేస్తున్నడు. రాత్రికిరాత్రే ఇండ్లను కూల్చివేస్తూ పేద, మధ్యతరగతివాళ్లకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నడు. ఆరు గ్యారెంటీలను ఇవ్వకుండా తప్పుదోవపట్టిస్తున్నడు. అంటే ప్రజలను రక్షించాల్సిన ప్రభుత్వ పెద్దలే భక్షిస్తున్నరు. బీఆర్‌ఎస్ నాయకులు మాకు అండగా నిలువాలె. **- తేజస్వి, దత్తాత్రేయకాలనీ(సన్‌సిటీ)**

అప్పు చేసి ఇల్లుకట్టుకున్నం



మేం 27 ఏండ్లుగా ఇక్కడ ఉంటున్నం. పైసా పైసా జమ చేసి, కొంత బ్యాంకుల నుంచి అప్పులు తెచ్చి ఇల్లు కట్టుకున్నం. మొన్ననే మా భర్త ఉద్యోగం నుంచి రిటైర్డ్ అయిండు. ఇగ సంతోషంగా ఉందామనుకున్న టైంలో ప్రభుత్వం ఇలా జేస్తే ఎలా? ఏండ్ల కింద కట్టుకున్న ఇండ్లను కూలగొడుతే మా బతుకులు ఏంగావాలె? గిట్లజేస్తే హైదరాబాద్ అభివృద్ధి జరుగుతదా?.. ఇప్పుడన్న జెర ఆలోచించాలె. **-సరస్వతి(గండిపేట)**

మీ అన్నకు ఓ రూలు..మాకో రూలా?



మేం ఎస్‌బీఐ, ఎల్ఐసీ లాంటి జాతీయ బ్యాంకుల నుంచి లోన్ తెచ్చుకొని ఇల్లు కట్టుకున్నం. వాళ్లు కూడా వెరిఫై చేసే లోన్ సాంక్షన్ చేసిన్రు. టౌన్‌ప్లానింగ్ అధికారులు కూడా ఇల్లు కట్టుకొనేందుకు పర్మిషన్ ఇచ్చిన్రు. ఇప్పుడు మేం తప్పుజేశామంటే వీరంతా తప్పుచేసినట్టే కదా? అయినా బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లో కట్టారంటూ సామాన్యులను ఇబ్బందిపెడుతున్నది. మరీ సీఎం రేవంత్‌రెడ్డి అన్న కూడా చెరువులోనే ఇల్లు కట్టుకున్నడు కదా? ఆయనకేమో నోటీసులు ఇచ్చి సరిపెట్టిన్రు. అంటే సీఎం అన్నకు ఓ రూలు..మాలాంటి వారికి మరో రూలా? **- చైతన్యసూరి (సాయిరాం నగర్)**

ఇల్లు కూల్చితే ఎక్కడికిపోవాలె



మాది ఈ రాష్ట్రం కాదు.. మా ఆయన మిలిటరీల పనిజేత్తడు. చాలా ఎండ్లసంది హైదరాబాద్‌లోనే ఉంటున్నం. కేసీఆర్ ఉన్నప్పుడు మస్తు సంతోషంగా ఉన్నం. మా కాలనీలో అన్ని సౌలత్‌లు చేసిండు..గిప్పుడు రేవంత్‌రెడ్డి మాత్రం ఇష్టమొచ్చినట్లు చేస్తున్నడు. మంచి, చెడూ చూడకుండానే ముందుకుపోతున్నడు. ఎప్పుడో కట్టుకున్న ఇల్లు బఫర్‌జోన్‌లో ఉన్నదంటూ అధికారులు అంటున్నరు. మా ఇంటిని కూల్చితే మేం ఎక్కడికి పోవాలె. **- అనితాభాయ్ (హైదర్‌షాకోట)**

ఎప్పటికైనా కూల్చివేత తప్పదు!

- తరలించేందుకు డెడ్‌లైన్ లేదు
- జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పర్మిషన్లు వ్యాలీడ్
- రెండు నెలల్లో మూసీ పనులు
- మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్



హైదరాబాద్, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ) : 'రెండు నెలల క్రితం డ్రోన్ సర్వే చేయగా మూసీ నది బఫర్‌జోన్‌లో 10,660 నివాసాలున్నట్టు గుర్తించాం.. వీళ్లందర్నీ 14 ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పిస్తున్నాం. డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇస్తామంటే వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే 50 కుటుంబాలను తరలించాం. విద్యార్థులకు స్కూల్ సదుపాయాన్ని కూడా కల్పిస్తున్నాం.. ప్రభుత్వం కూలగొట్టాలనుకుంటే ఎప్పుడో కూలగొట్టేది..కానీ వారి అంగీకారం తర్వాతే కూలగొడుతున్నం. అందర్నీ సమ్మతితో తరలించడమే డెడ్‌లైన్..ఎప్పటికైనా కూల్చివేతలు తప్పవు' అని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి, మూసీ రివర్ డెవలప్‌మెంట్ అథారిటీ ఎండీ దాన కిశోర్ స్పష్టంచేశారు. మూసీ సుందరీకరణ, ప్రజల తరలింపు అంశాలపై సచివాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. మూసీ నదిలో మంచినీళ్లు పారించి.. నగరానికి జీవనదిగా మార్చడమే సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్ష అని, ఇందులో భాగంగానే రూ.10 వేల కోట్లతో రెండు నెలల్లో మూసీ సుందరీకరణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

పునరావాసానికి సరిపడా ఇండ్లు లేవు

మూసీ పరీవాహకం నుంచి తరలించే వారికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇస్తున్నామని చెప్తున్న దాన కిశోర్.. మరోవైపు అవసరమైన ఇండ్లు లేవని తెలిపారు. బాధితులు 10వేలకు పైగా ఉంటే నాలుగైదు వేల ఇండ్లే ఉన్నాయని చెప్పారు. 15వేల ఇండ్ల నిర్మాణానికి అనుమతి తీసుకున్నామని, రూ.700 కోట్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరామని తెలిపారు.

జీహెచ్ఎంసీ,హెచ్ఎండీఏ అనుమతులు..

ఇండ్ల నిర్మాణానికి జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ ఇచ్చిన అనుమతులు కచ్చితంగా వ్యాలిడ్ అవుతాయని దానకిశోర్ స్పష్టం చేశారు. అక్కడక్కడా తప్పులు జరుగుతాయని, అయినా ఆ అనుమతులను గౌరవించాల్సిన బాధ్యత తమపై ఉందని చెప్పారు. కొన్ని తప్పిదాల వల్ల బఫర్, ఎఫ్‌టీఎల్‌లోనూ ఇండ్ల నిర్మాణానికి అనుమతులిచ్చారని, వీటిపై ఏం చేయాలనేది ప్రభుత్వం చర్చిస్తున్నదని తెలిపారు. ఇకపై అనుమతుల్లో తప్పిదాలు జరగకుండా టీజీబీపాస్‌లో కెమెరాతో ఇంటి పరిసర ప్రాంతాలను పరిశీలించే అధునాతన సౌకర్యాన్ని అందుబాటులోకి తెస్తున్నట్టు వివరించారు.

వెబ్‌సైట్లో బఫర్, ఎఫ్‌టీఎల్ వివరాలు

హైడ్రా కూల్చివేతల నేపథ్యంలో అసలు నగరంలోని చెరువుల పరిధిపై స్పష్టత ఉన్నదా? అని విలేకరులు అడిగిన ప్రశ్నపై స్పందించిన దాన కిశోర్.. ఓఆర్ఆర్ లోపల 560 చెరువులు ఉంటే వీటిలో 503 చెరువుల బఫర్, ఎఫ్‌టీఎల్ పరిధి గుర్తిస్తూ ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేశామని తెలిపారు. ఓఆర్ఆర్ బయట 2,693 చెరువులు ఉంటే వీటిలో 2,052 చెరువులకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ ఇచ్చామని చెప్పారు. వీటి వివరాలన్నీ వెబ్‌సైట్లో పొందుపరుస్తామని తెలిపారు.

పట్టా భూములకు డబుల్ పరిహారం..

పట్టా భూములు ఉన్నవారికి మార్కెట్ వాల్యూకు రెట్టింపు పరిహారం ఇస్తామని, బహుళ అంతస్తుల కట్టడాలుంటే ఆ విలువ కూడా చెల్లిస్తామని, ఉమ్మడి కుటుంబాలు ఉన్నవారికి వేర్వేరుగా పరిహారం ఇచ్చే అంశంపై చర్చిస్తున్నామని దానకిశోర్ తెలిపారు. ఎంజీబీఎస్ వద్ద మూసీలోనే ఉన్న మెట్రో దారిపై ఫిర్యాదు వచ్చిందని, దీనిపై ప్రభుత్వం చర్చిస్తున్నన్నట్టు తెలిపారు.



అనుమతులను గౌరవిస్తం.. రద్దు చేసి కూల్చేస్తం

- ఒకే వేదికపై ఇద్దరు అధికారుల విరుద్ధ ప్రకటన

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : హైడ్రా కూల్చివేతలకు సంబంధించి మున్సిపల్ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌లది కీలక పాత్ర! ఈ ఇద్దరు ఒకే అంశంపై విభిన్న అభిప్రాయాలు కలిగి ఉండడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఇద్దరూ ఒకే వేదికపై ఒకే అంశంపై విరుద్ధ ప్రకటనలు చేయడం గందరగోళానికి గురిచేసింది. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో ఇంటి నిర్మాణానికి జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ ఇచ్చిన అనుమతులను గౌరవించాల్సిందేనని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ చెబితే.. కాదు కాదు ఆ అనుమతులను రద్దు చేయించి మరీ కూల్చివేస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెప్పడం గమనార్హం. శనివారం సచివాలయంలో మూసీ సుందరీకరణ కోసం బాధితుల తరలింపు, హైడ్రా కూల్చివేతలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఇంటి నిర్మాణాల అనుమతులు, కూల్చివేతలపై విరుద్ధ ప్రకటనలు చేశారు. తొలుత జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతులు గల ఇండ్లను కూల్చివేయడం లేదని చెప్పిన హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఆ తర్వాత అనుమతులను రద్దు చేయించి మరీ కూల్చివేస్తామని ప్రకటించడం గమనార్హం. ఆ తర్వాత మాట్లాడిన దానకిశోర్.. అక్కడక్కడా తప్పిదాలు జరుగుతాయని ఒప్పుకొంటూనే ఆ అనుమతులను గౌరవించాల్సిందేనని, ఈ అంశంపై ఏం చేయాలనేదానిపై ప్రభుత్వం చర్చిస్తున్నట్టుగా తెలిపారు. ఇలా కీలక అంశంపై కీలక అధికారులు విరుద్ధ ప్రకటనలు చేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హైడ్రా విధివిధానాలపై కీలక అధికారులకే స్పష్టత లేకుంటే కింది స్థాయి అధికారుల పరిస్థితి ఏంటనే ప్రశ్నలు కూడా వస్తున్నాయి. గుడ్డెద్దు చేలో పడ్డట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దెబ్బకు దయ్యం వదిలింది!

- హైడ్రా ఒంటెత్తు పోకడ
- కార్యాలయాలకి వెళ్లిన జర్నలిస్టులకు బెదిరింపులు
- ప్రజాగ్రహం, బుచ్చమ్మ ఆత్మహత్యతో వదిలిన మత్తు
- హడావుడిగా మీడియా సమావేశం
- పాత్రికేయుల ప్రశ్నలకు గంటలపాటు వివరణ



హైదరాబాద్, సెప్టెంబర్28 (నమస్తే తెలంగాణ): చెరువులు, నాలాల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా.. ఎలాంటి చట్టబద్ధత లేకున్నా ప్రభుత్వం దన్నుతో కమిషనర్ రంగనాథ్ నేతృత్వంలో పేదల నివాసాలపై విరుచుకుపడుతున్నది. విక్రయదారులను, రిజిస్ట్రేషన్ చేసిన, నిర్మాణ అనుమతులను మంజూరు చేసిన ఉద్యోగులను విడిచిపెట్టి ఆక్రమణల పేరిట పేదలపై కన్నెర్ర చేస్తూ వస్తున్నది.పెద్దల బంగ్లాలను విడిచిపెడుతూ, పేదల గుడిసెలను కూలగొడుతున్నది. ఈ అంశంపై కమిషనర్ రంగనాథ్ తీరుపై, హైడ్రా చర్యలపై ఆదినుంచీ తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ చర్యలను ప్రశ్నించిన మీడియాను పక్కనపెట్టింది. కేవలం అనుకూల మీడియా ముందు ప్రత్యక్షమవడం, కూల్చివేతలకు సమర్థింపుగా ప్రకటనలు ఇచ్చేందుకే పరిమితమైంది. బాధితుల గోడును మాత్రం పట్టించుకున్న దాఖలాలేదు. వారి తరపున ఇదేమని అడిగిన మీడియాకు హైడ్రా అధికారులు ముఖం చాటేసుకొని తిరిగారు. ఒకానొక సందర్భంలో కార్యాలయానికి వెళ్లిన మీడియా ప్రతినిధులపై బెదిరింపులకు దిగారంటే హైడ్రా పోకడలను అర్థం చేసుకోవచ్చు. అదే దుందుడుకుతనంతో తాజాగా మూసీ పరీవాహక ప్రాంతంలో కూల్చివేతలకు మార్కింగ్ చేయడం, స్థానికుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవడం, ఎక్కడ గూడు చెదిరిపోతుందోనని మనోవేదనతో బుచ్చమ్మ అనే మహిళ ఆత్మహత్య చేసుకోవడంతో ఎట్టకేలకు అధికారగణానికి పట్టిన దయ్యం వదిలింది. ఇంతకాలం దూరం పెట్టిన మీడియా ప్రతినిధులను హుటాహుటినా పిలిచి మరీ హైడ్రా కమిషనర్ రంగనాథ్ సమావేశం నిర్వహించారు. కూల్చివేతలు, జరిగిన ఘటనలను సమర్థించుకునే ప్రయత్నం చేశారు. దాదాపు గంటన్నరకు పైగా పాత్రికేయులతో భేటీ అయి, అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు. మొత్తంగా ప్రజాప్రతిఘటన, బుచ్చమ్మ మరణంతో హైడ్రాకు కనువిప్పు కలిగిందని చర్చించుకుంటున్నారు.

హైడ్రా బూచి కాదు.. భరోసా

- అక్రమ నిర్మాణాలనే కూలగొడుతున్నం
- జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతి ఉన్న, ప్రజలు నివసిస్తున్న ఇండ్లను కూల్చడం లేదు
- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్న నిర్మాణాలకు నోటీసులు కూడా ఇవ్వాల్సిన అవసరం లేదు
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్



హైదరాబాద్/సిటీబ్యూరో సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): 'పేదవాళ్లను, చిన్న వాళ్లను బాధపెట్టే ఉద్దేశం హైడ్రాకు లేదు.. హైడ్రాను బూచిగా చూపుతున్నారు.. హైడ్రా ఒక భరోసా, బాధ్యత' అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టంచేశారు. కూల్చివేతల్లో ఉన్న వారంతా పేదలు కాదని, ఆక్రమణలకు పాల్పడిన వారే ఉన్నారని చెప్పారు. చెరువులో ఇండ్లు కట్టుకోవడం ఎవరికీ హక్కుకాదని.. అర్హతలు లేని వారు పర్మిషన్లిస్తే ఎలా చెల్లుతాయని ప్రశ్నించారు. అక్రమ కట్టడాలను మాత్రమే హైడ్రా కూల్చివేస్తున్నదని, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, పంచాయతీ అనుమతులు ఉన్నవాటిని కూల్చడం లేదని, ప్రజలు నివాసం ఉండే ఇండ్లను కూడా కూల్చడం లేదని తెలిపారు. కూల్చివేతలకు సంబంధించి ముందే సమాచారం ఇస్తున్నామని, ఒకవేళ ఖాళీ చేయకుంటే మరింత సమయం ఇస్తున్నామని చెప్పారు. సచివాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైడ్రాకు సంబంధించిన పలు విషయాలను వివరించారు. హైడ్రాపై జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు.ఇండ్లు, స్థలాలు కొనుగోలు చేసేటప్పుడు ప్రజలు కనీసం ఎంక్వైరీ చేయడం లేదని, రుణాలు ఇచ్చేముందు బ్యాంకులు కూడా విధులు సరిగ్గా నిర్వర్తించడం లేదన్నారు.

వాటి కూల్చివేతకు నోటీసులు అనవసరం

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్న నిర్మాణాలను కూల్చేందుకు నోటీసులు కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని, కానీ, తాము పేదలను దృష్టిలో పెట్టుకొని నోటీసులు జారీ చేస్తున్నామని రంగనాథ్ తెలిపారు. కొందరు నిర్లక్ష్యంగా ఉంటూ ఖాళీ చేయడం లేదని, అలాంటి వారికి మళ్లీ సమయం ఇస్తున్నామని తెలిపారు. కొన్ని సందర్భాల్లో ల్యాండ్ ఓనర్‌కు నోటీసులు ఇస్తున్నామని, కానీ వాళ్లు మాత్రం కిరాయి ఉండే వాళ్లకు సమాచారం ఇవ్వడం లేదని వివరించారు.

పర్మిషన్ క్యాన్సిల్ చేసి కూల్చేస్తాం..

జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, పంచాయతీల నుంచి పర్మిషన్ ఉన్న నిర్మాణాలను కూల్చబోమని చెప్పిన రంగనాథ్.. ఒకవేళ అవి బఫర్, ఎఫ్‌టీఎల్‌లో ఉంటే పర్మిషన్ క్యాన్సిల్ చేయించి కూల్చివేస్తామని తేల్చిచెప్పారు. ఇప్పటి వరకు కూల్చిన కట్టడాలన్నీ పర్మిషన్ లేనివేనని తెలిపారు. ఒకవేళ ఉన్నా అవి సంవత్సరాల క్రితమే కోర్టుల ద్వారా క్యాన్సిల్ అయ్యాయని, కానీ యజమానులు మాత్రం అనుమతి ఉన్నదనే అనుకుంటున్నారని తెలిపారు.

పెద్దవాళ్లే మా ఫస్ట్ టార్గెట్

నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పెద్దవాళ్ల కట్టడాలను కూల్చకుండా పేదలవి కూల్చడం ఏమిటని విలేకరులు ప్రశ్నించగా.. కమిషనర్ రంగనాథ్ స్పందిస్తూ తమ ప్రథమ టార్గెట్ పెద్దవాళ్లేనని, తాము సైలెంట్‌గా లేమని, గ్రౌండ్ వర్క్ చేస్తున్నామని తెలిపారు. ఎప్పుడో ఓసారి కూల్చివేతలు మొదలుపెడతామని చెప్పారు.

జన్వాడ ఫాంహౌస్ మా పరిధిలో లేదు..

జన్వాడ్ ఫాంహౌస్‌ను ఎప్పుడు కూల్చుతున్నారంటూ విలేకరులు అడిగిన ప్రశ్నకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందిస్తూ.. అది తమ పరిధిలో లేదని, జీవో 111 పరిధిలోకి వస్తుందని తెలిపారు.

అకడమిక్ ఇయర్ పూర్తయ్యాక కూల్చివేత

ఓవైసీ, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డి ఇలా చాలా మంది కాలేజీలు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్నాయంటూ తమకు చాలా ఫిర్యాదులు వచ్చినట్టు రంగనాథ్ తెలిపారు. వీటి కూల్చివేతలపై వెనుకంజ వేయలేదని, విద్యా సంవత్సరం మధ్యలో ఉన్నప్పుడు కాలేజీలను కూల్చితే వేలాది మంది విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందని, వాళ్లంతా రోడ్లపైకి వస్తారని అందుకే విద్యా సంవత్సరం పూర్తి కాగానే కూల్చివేస్తామని తెలిపారు.

భయంతోనే బుచ్చమ్మ ఆత్మహత్య..

బుచ్చమ్మ ఆత్మహత్య చాలా బాధ కలిగించిందని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. హైడ్రాపై జరుగుతున్న ప్రచారంతో భయాందోళనకు గురై ఆమె ఆత్మహత్య చేసుకున్నదని తెలిపారు. కూకట్‌పల్లి చెరువు పరిధిలో బుచ్చమ్మకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారని, ఇద్దరు కూతుళ్లకు జీ+1 బిల్డింగ్ ఇవ్వగా మరో కూతురుకు ఓపెన్ ప్లాట్ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కట్టడాలు బఫర్ జోన్‌లో ఉన్నా వాటి జోలికి హైడ్రా పోలేదని చెప్పారు. హైడ్రా కూల్చివేస్తదంటూ ప్రచారం జరగడంతో భయపడిన బుచ్చమ్మ ఆత్మహత్య చేసుకున్నదని, పేదలను భయపెట్టే ఉద్దేశం హైడ్రాకు లేదని పేర్కొన్నారు.

రిపోర్టర్‌పై ఐలాపూర్ వాసుల దాడి

- హైడ్రాపేరుతో బెదిరింపులు
- స్తంభానికి కట్టేసి చితకబాదిన స్థానికులు

అమీన్‌పూర్, సెప్టెంబర్ 28 : సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ఐలాపూర్ తండాలో శనివారం రాత్రి ఓ విలేకరిని చితకబాదారు. స్థానికుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్‌కు చెందిన జనం సాక్షి పత్రిక విలేకరి సంతోష్ ఐలాపూర్‌లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని తెలుసుకొని అక్కడి వెళ్లాడు. అక్కడి నాయకులు ముఖీం, అజీంతోపాటు స్థానికులు సదరు రిపోర్టర్‌ను స్తంభానికి కట్టేసి చితకబాదారు. నిత్యం బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తుండటంతో సహనం కోల్పోయి ఈ చర్యకు పాల్పడినట్టు స్థానికులు తెలిపారు. విలువైన ప్లాట్లతోపాటు లక్షలు ఇచ్చినట్టు వారు చెప్పారు. అయినప్పటికీ హైడ్రా అధికారులతో మాట్లాడి ఇక్కడ నిర్మిస్తున్న ఇండ్లను కూల్చివేయిస్తానని బెదిరించడంతోపాటు తాగిన మైకంలో మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో దాడి చేశామని తెలిపారు. స్థానిక నాయకుడు ముఖీం అమీన్‌పూర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి అతడిని అదుపులోకి తీసుకున్నారు.



విలేకరిని స్తంభానికి కట్టి చితకబాదుతున్న ఐలాపూర్ వాసులు

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

బుల్డోజర్ సంస్కృతే అసలైన ప్రకృతి వైపరీత్యం



తుల్జారాంసింగ్ ఠాకూర్
78930 05313

Oh god! fill my city with people just as you have filled river with fish.

433 సంవత్సరాల క్రితం 1591లో ఒక సుదినాన హైదరాబాద్ నగరానికి పునాది వేస్తూ.. గోల్కొండ ప్రభువు కులీ కుతుబ్ షాహీ చేసిన ప్రార్థనా వాక్యం ఇది. ఆయన ప్రార్థనను భగవంతుడు మన్నించడంతో హైదరాబాద్ శతాబ్దాలుగా విశ్వనగరంగా అభివృద్ధి చెందుతూ వచ్చింది.

ఇందిరాగాంధీ 'గరీబీ హటావో' నినాదం అప్పట్లో దేశ ప్రజలను, వారి హృదయాలను చూరగొన్నది. భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్‌గాంధీ ఎత్తుకున్న 'నఫ్రత్ కీ బజార్ మే మహబ్బత్ కా దుకాణ్' కూడా పీడిత ప్రజలను, దళిత బహుజనులను, ప్రత్యేకించి మైనారిటీలను ఆకట్టుకుంది. బీజేపీ పాలనలో అభద్రతాభావానికి గురవుతున్న ప్రజానీకం మెజారిటీ మతతత్వవాదం పేట్రేగిపోతున్న సందర్భంలో అందుకున్న నినాదం సహజంగానే ప్రజలను ఆకర్షించింది. తత్ఫలితంగానే కాంగ్రెస్ తిరిగి కొంతమేరకు పుంజుకోవడమే కాకుండా అనూహ్యంగా తెలంగాణ రాష్ట్రంలో అధికార పీఠం కైవసం చేసుకున్నది.

> **కానీ, దురదృష్టవశాత్తూ రాష్ట్ర కాంగ్రెస్ సర్కార్ కేవలం తన దూకుడు, కుల సమీకరణాల వల్లనే అధికారంలోకి వచ్చామనే అపోహతో అహంకారపూరితంగా వ్యవహరిస్తూ రాష్ట్రానికి, పేద, మధ్యతరగతి బడుగు జీవులకు ఎనలేని నష్టాన్ని కలిగిస్తున్నది. యూపీ, గుజరాత్, అసోం తదితర బీజేపీ పాలిత బుల్డోజర్ పద్ధతులను అవలంబించి అతి తక్కువ కాలంలోనే సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా ఉండిన దళిత, బహుజన, మైనారిటీ వర్గాల తీవ్ర ఆక్రోషాన్ని ఎదుర్కొంటున్నది.**

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన హైడ్రా ఆపరేషన్లు సంపన్న, సూడో మేధావి వర్గాలకు ఆనందాన్ని కలుగజేస్తుండవచ్చు. కానీ, పేద, మధ్యతరగతి జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. ఎప్పుడో దశాబ్దాల కిందట పేద ప్రజలు కట్టుకున్న నిర్మాణాలు మాత్రమే హైదరాబాద్ నగరంలో అతి వర్షాల వల్ల కలిగే ప్రకృతి వైపరీత్యాల విధ్వంసానికి కారణమన్నట్టుగా ప్రభుత్వం ప్రవర్తిస్తున్న తీరు అత్యంత ప్రమాదకరంగా ఉన్నది.



కులీన సంపన్నవర్గాలు దశాబ్దాలుగా చేస్తున్న పర్యావరణ బీభత్సం, ఔటర్ రింగు రోడ్డు విధ్వంసం, అర్బనైజేషన్ పేరిట పారిశ్రామికీకరణ, ఫార్మా, ఐటీరంగాల వల్ల తెలంగాణ రాష్ట్రానికి హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో జరిగిన విధ్వంసం ఏపాటిదో పాలకులు గుర్తించడం లేదు. చిన్న చిన్న ఉద్యోగాలు, వ్యాపారాలు, ప్రైవేట్ రంగంలో వెట్టిచాకిరీ చేసి జీవితాంతం కష్టపడి సంపాదించుకున్న డబ్బులను వెచ్చించి, తల తాకట్టు పెట్టి తీసుకున్న ప్రైవేట్ రుణాలు, బ్యాంకు రుణాలతో పేదలు కట్టుకున్న గూళ్లను రాత్రికిరాత్రి నేలమట్టం చేయడం ఏ రకంగా 'మహబ్బత్ కీ దుకాణో' రాహుల్ గాంధీ చెప్పాలి.

పది మిలియన్ సంవత్సరాల కిందట ఏర్పడిన రాతి శిలలను, గుట్టలను రేయింబవళ్లు రియల్ ఎస్టేట్ రంగం పిండి పిప్పి చేస్తున్న విధ్వంసం కంటే పేద ప్రజలు కట్టుకున్న ఇరుకు గదుల ప్రకృతి వైపరీత్యం ఎక్కువైందా? మూసీ, ఈసీ, కాగ్నా నదుల జన్మస్థానం వికారాబాద్, దామగుండం అడవుల్లో వెరి లో ఫ్రీక్వెన్సీ రాడార్ కేంద్రం కోసం లక్షలాది చెట్ల నరికివేత ద్వారా జరగనున్న ప్రకృతి విధ్వంసం ముందు పేద ప్రజలు కట్టుకున్న ఇళ్లు చేస్తున్న నష్టం ఏపాటిది? పటాన్‌చెరు, పాశమైలారం, జీడిమెట్ల, బొల్లారం, బొంతపల్లి తదితర ప్రాంతాల్లో వెలసిన కాలుష్య కాసారాల ప్రకృతి హననం ముందు సంపన్నుల ఇళ్లలో బోళ్లు, బొచ్చెలు కడిగి బతుకు వెళ్లదీస్తున్న బడుగుజీవుల ప్రకృతి విధ్వంసం భరించరానిదైందా?

> **తెలిసో, తెలియకో అవసరాల నిమిత్తమో రియల్ ఎస్టేట్ వ్యాపారుల మోసాలకు, మాయలకు బలైపోయిన అమాయక జీవుల జీవనాన్ని విధ్వంసం చేసి ప్రజా ప్రభుత్వం అని చెప్పుకొంటున్న కాంగ్రెస్ సర్కార్ ఏం సాధించాలనుకుంటున్నది? రౌడీ షీటర్లు, నేరస్థులు, సంఘ వ్యతిరేక శక్తులను అణచివేయడానికి యూపీ రాష్ట్రానికి పరిమితమైన బుల్డోజర్ సంస్కృతిని వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీ అదే పంథాను తెలంగాణ రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజల మీద కొనసాగించాలనుకోవడమే అసలై న ప్రకృతి వైపరీత్యం.**

దక్కన్ పీఠభూమి బంగారు తునక తెలంగాణ రాష్ట్రానికి ఆత్మ అనదగిన చెరువులు, వాగులు, నాలాలు, గుట్టల పరిరక్షణ పేరిట హైడ్రా చేపట్టిన చర్యలు అపసవ్య దిశలో ఉండటమే ప్రస్తుత భయానక భీతావహ పరిస్థితులకు కారణమని చెప్పవచ్చు. ఒకవేళ చర్యలు ప్రారంభించాల్సి వస్తే ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో లే అవుట్లు వేసి, ఇండ్లను కట్టి అవసరమైన అనుమతులను సంపాదించి అమాయక ప్రజలకు అమ్ముకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారుల మీద కదా మొదట చర్యలు తీసుకోవాల్సింది. నాలా కన్వర్షన్, బిల్డింగ్ అనుమతులు ఇచ్చి ఆస్తి పన్నులు, కరెంటు బిల్లులు వసూలు చేసిన ప్రభుత్వం బాధితులకు ఆమోదయోగ్యమైన పునరావాసాలు కల్పించిన తదుపరి కదా రంగంలోకి దిగాల్సింది. ఎలాంటి అనుమతులు లేని నాలాల మీద వెలసిన అక్రమ కట్టడాలు తొలగించడానికి ముందు వారికి సమీప ప్రాంతాల్లో ప్రభుత్వమే డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.

భవిష్యత్తులో ఎవ్వరికీ 500 గజాల పైబడి స్థలంలో ఇళ్లు నిర్మించుకోవడానికి అనుమతి ఇవ్వకూడదు. ఎందుకంటే, జనాభా పెరుగుతుంది కానీ, భూమి పెరగదనే ప్రాథమిక సూత్రాన్ని మరచిపోకూడదు. వేలాది అపార్టుమెంట్లు, విల్లాలు కడుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు భవిష్యత్తులో వారి ఇండ్లలో పని చేయాల్సిన పనివారు, డ్రైవర్లు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు నివాసం ఉండటానికి కావాల్సిన మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత కూడా బిల్డర్ల పరిధిలోనే ఉండేలా చట్టం తీసుకురావాలి.

హరప్పా శోధనకు వందేండ్లు



శ్రీరామోజు హరగోపాల్

ప్రపంచ మానవ నాగరికత వికాసాల్లో సింధూ నాగరికత స్థానం విశిష్టమైనది. 1924, సెప్టెంబర్ 20న 'ది ఇల్లస్ట్రేటెడ్ లండన్ న్యూస్'లో ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ జాన్ మార్షల్ రాసిన వ్యాసం ద్వారా సింధూ నాగరికత గురించి ప్రపంచానికి తెలిసింది. జాన్ మార్షల్‌తో పాటు పనిచేసిన రాఖాల్ దాస్ బెనర్జీ, కేఎన్ దీక్షిత్, మాధోసరూప్ వాట్స్ తదితర పరిశోధకులు, లుయిగీ పియో టెస్సిటోరి వంటి ఇతరులు అవిభక్త భారతదేశంలో సింధూ నదీ తీరంలో పలుచోట్ల నాగరికత ఆనవాళ్లను గుర్తించారు.

హరప్పా తవ్వకాల తొలి దశలో లభించిన పురావస్తువుల ఆధారంగా సింధూలోయ నాగరికత కాలాన్ని క్రీ.పూ.3200-క్రీ.పూ.1900ల మధ్యకాలంగా పరిశోధకులు నిర్ణయించారు. ఈ నాగరికతకు మూలాలు బలుచిస్థాన్‌లో ఉన్న మెహర్‌గఢ్‌లో లభించిన క్రీ.పూ.7000 సంవత్సరాల నాగరికతకు కొనసాగింపు అనిపించాయి.

సింధూలోయ తవ్వకాల్లో పెద్ద వీధులతో, రక్షణ ప్రాకారాలతో చక్కని ప్రణాళికతో నిర్మించిన నగరాలు, మూతలతో కూడిన మురికినీటి కాలువల వ్యవస్థ, ధాన్యాగారాలు, గిడ్డంగులు, పడవ రేవులు, వ్యాపారకేంద్రాలు, ఇప్పటికీ చదువని లిపితో, జంతువుల బొమ్మలతో దొరికిన స్టియటైట్‌తో చేసిన 'ముద్రలు' ఆనాటి ప్రజల నాగరిక జీవనం ఎంత చక్కని ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉండేదో చెప్పే సాక్ష్యాలు.

హరప్పా నాగరికతగా తొలుత పేర్కొనబడిన ఈ పురానాగరికతలో వెలుగుచూసిన పెద్ద నగరాల్లో మొహెంజొదారో ఒకటి. 1922లో రాఖాల్‌దాస్ బెనర్జీ దీన్ని కనుగొన్నారు. ప్రణాళికాబద్ధమైన పురాతన నగర వ్యవస్థకు మొహెంజొదారో చక్కటి ఉదాహరణ. ధార్మిక కార్యక్రమాల్లో వాడుకున్న విశాల స్నానవాటిక జాడతో తొలినాటి ప్రజా జలపంపిణీ వ్యవస్థ గురించి తెలిసింది. పెద్దఎత్తున ధాన్యాగారాల ఆనవాళ్లు లభించడం వల్ల తిండి గింజలను వార్షిక వనరుగా భద్రపరిచే భవిష్య ప్రణాళిక అర్థమవుతున్నది. పాలకులకు కోటతో కూడిన నిర్మిత నగరం, సాధారణ ప్రజలకు చిన్న నగరం జాడలు నాటి పాలక వ్యవస్థకు నిదర్శనం. మట్టి ఇటుకలతో కట్టిన ఇళ్లు వసారాలతో, స్నానాల గదులతో బయటపడ్డాయి. మురికి కాలువలకు అనుసంధానం చేసిన వ్యక్తిగత మరుగుదొడ్లు అప్పటి డ్రైనేజీ వ్యవస్థను తెలియజేస్తున్నాయి. ఇండ్లు కట్టడానికి వాడిన ఘనపు ఇటుకలు 1:2:4 నిష్పత్తిలో చక్కని కొలతలతో ఉన్నాయి. ఈ నగరంలో లభించిన ముద్రలు నాటి పటిష్ఠ ఆర్థిక వ్యవస్థకు గుర్తులు. అప్పటి ప్రజలు వాడిన పాత్రలు, పనిముట్లు కంచు, రాగితో చేసినవి. అందువల్లనే నాటి నాగరికతను కాంస్యయుగపు నాగరికతగా పేర్కొన్నారు. నగర వీధులు ఎడ్ల బండ్లు తిరిగేంత పెద్దవిగా ఉండేవి.



> **దక్షిణాసియాలోనే విశిష్టమైన సంక్లిష్ట సమాజ నాగరికతల జాడలు హరప్పా తవ్వకాల్లో దొరికాయి. హరప్పా నాగరితను తొలిదశ (క్రీ.పూ.3300-2600), వికాస దశ (క్రీ.పూ.2600-1900), అనంతర దశ (క్రీ.పూ.1900-1700) అని విభజించారు. ఇటీవలి తవ్వకాల్లో ఘగ్గర్ పరీవాహక ప్రాంతంలో (ఋగ్వేద సరస్వతి నదీ తీరం) భిర్రానా, గిరవద్, ఫర్మానా, రాఖీగఢీల తవ్వకాల వల్ల హరప్పా నాగరికతా కాలం క్రీ.పూ.5500 సంవత్సరాలకు వెళ్లిందని పరిశోధకులు అభిప్రాయపడ్డారు.**

ఈ నాగరికత స్థానిక వ్యవసాయ సమాజాల వల్ల ఏర్పడ్డదనే అభిప్రాయం బలపడుతున్నది. స్థిరజీవన సమాజాలు మిగులుతో చేసిన వ్యాపారాల కోసం నిర్మించుకున్న పటిష్ఠ నగర వ్యవస్థ, వ్యాపార స్థావరాలు, రేవుల అభివృద్ధి, వస్తు సమృద్ధి, ధాన్య సమృద్ధులకు తార్కాణం. లోహ సంగ్రహణం, లోహ కర్మాగారాలు, లోహ వస్తువుల తయారీ నైపుణ్యాలు, ప్రామాణికమైన కొలతల పాటింపు, పింగాణీ ద్రవ్య వాడకం, ఇట్లా పలువిధాలా ఈ నాగరికత ప్రపంచ నాగరికతల్లో విశిష్ట స్థానాన్ని సాధించింది.

హరప్పా నాగరిక నగరాల్లో మొహెంజొదారో, హరప్పా, గన్వేరివాలా, రాఖీగఢీ, ధోలవీర ప్రధానమైనవి. గడిచిన వందేండ్లలో పురాశాస్త్రవేత్తలు కాలీబంగన్, ఫర్మానా, రాఖీగఢీ, సనౌలి వంటి ఎన్నో హరప్పా నగరాల్లో సమాధుల స్థలాలను అన్వేషించారు. ఈ ప్రదేశాల నుంచి సేకరించిన సమాచారం ఇంకా సమగ్రత సంతరించుకోలేదు. 2 వేల చోట్ల ఆర్కియాలాజికల్ సర్వే నిర్వహించారు. సాపేక్షికంగా కొన్ని శ్మశానస్థలాలను పేర్కొన్నారు. పురావేత్తలు, మానవ శాస్త్రవేత్తలు సమాధుల నుంచి సేకరించిన అస్థిపంజర వివరాలు, హరప్పా సమాజాల మానవ సంబంధాల గురించి, లోతట్టు ప్రదేశాల నుంచి ప్రజల వలసల గురించి పరిశోధించారు. ఆహారం, ఔషధాలు వంటివి పరిశీలన చేశారు. వాటిని బట్టి అప్పట్లో అధికార వికేంద్రీకరణ గల సమాజాలుండేవని అనిపిస్తున్నది. కొన్ని అసాధారణ సమాధుల్లో కపాల గాయాలు, తీవ్రమైన గాయాలు, కుష్టు వంటి వాటిని అస్థిపంజరాల్లో స్కగ్ గుర్తించారు. సమాధుల పరిశీలనలో సాంఘిక, సాంస్కృతిక చలనశీలతను తెలియజేశాయి. రాఖీగఢీ పురావస్తు సముదాయాల గురించి భారత పురావస్తు సర్వేక్షణ సంస్థ, పూణే దక్కన్ కాలేజీ పరిశోధనలు నిర్వహించారు. రాఖీగఢీ మంచి వ్యవసాయ భూములతో కూడుకున్నదని తెలుస్తున్నది. హరప్పా నాగరిక నగరాల్లో ఇది తూర్పు ప్రాంత రాజధానిగా ఉండేదని పురా శాస్త్రవేత్తల అభిప్రాయం. ఇక్కడ ఉన్న 11 సమాధులను తవ్వి శాస్త్రవేత్తలు సమాచార సేకరణ చేశారు. వీటిలో సెపల్చరల్ (శవసహిత), నాన్-సెపల్కరల్ (శవరహిత) సమాధులు కనిపించడం విశేషం. వీటిని హరప్పా పురావేత్తలు ప్రాథమిక, గౌణ, సాంకేతిక మొదలైన విభాగాలను, ఉప విభాగాలను విశ్లేషించారు. సమాధుల్లో ఇటుకల వాడకం ఇక్కడి ప్రత్యేకత. అక్కడ దొరికిన కర్బన పదార్థాలకు చేసిన కార్బన్ డేటింగ్‌లో అవి క్రీ.పూ. 2273-38 సంవత్సరాలకు చెందినవిగా తేలింది.

> **సింధూ నాగరికతలో సబ్బురాయి ముద్రలలో ఒంటి కొమ్ము జంతువు, జడల ఎద్దు, మూపురమున్నవి, మూపురం లేని ఎడ్లున్నాయి. ముద్రల మీది బొమ్మలు ఆనాటి ప్రజల ధార్మికతత్వాన్ని తెలియజేసేవే. కులీనుడో, పూజారో అతని బొమ్మ స్టియొటైట్ (సబ్బురాయి)లో చెక్కింది మొహెంజొదారోలో లభించింది (ఇది కరాచీలో ఉన్న పాకిస్థాన్ జాతీయ మ్యూజియంలో ఉంది). నగ్న నాట్యకన్య కంచు శిల్పమొకటి కూడా దొరికింది. శిలల శిల్పాలు అరుదు.**

హరప్పా ముద్రల మీది భాష ఇండో యూరోపియన్ భాషా కుటుంబం, సుమేరియన్, హుర్రియన్, ఎలమైట్ భాషలకు చెందినది కాదు. దాదాపు 2 వేల ముద్రలలో 500 లిపి చిహ్నాలున్నాయి. ఈ లిపిని ఎవరూ చదవలేదు. ఈ భాష ద్రవిడ భాషా కుటుంబానికి చెందినదని కొందరు పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. అంతేకాదు, సిం నాగరికతలో ఒకే రకమైన వస్తు సంస్కృతి ఉన్నది. అది విస్తృతమైన సింధూ సాంస్కృతిక ఏకతను చూపుతున్నది. సింధూ నాగరికత విశేషాలు వెలుగుచూసి ఇటీవల వందేండ్లు పూర్తయ్యాయి. అయినప్పటికీ దానికి సంబంధించిన చాలా అంశాలు అపరిష్కృతంగానే ఉండటం విశేషమే మరి!

(వ్యాసకర్త: కన్వీనర్, కొత్త తెలంగాణ చరిత్ర బృందం)



తమ ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను చూపిస్తున్న హైడ్రా బాధితుడు బొడిగె నర్సింహ కుటుంబీకులు

ఆ ఇంట్లనే సచ్చిపోతం

2024, సెప్టెంబర్ 25 గురువారం నాడు మజ్జాన్నం ఒంటి గంట గొడ్తున్నది. మబ్బుల రెండు గంటలకు లేసి కూరగాయలమ్మవోయిన మేం ఇద్దరాలుమగలం అప్పుడే ఇంటికి చేరుకుంటున్నం. కూడు లేదు, కుంపటి లేదు. కడుపుల పేగులు గుర్.. గుర్రుమని మొత్తుకుంటున్నయి. ఇంత సల్ల వడ్దామని ఆగమాగం ఇంటికి వోతున్నం. మా ఇంటికి ఓ ఇరువై గజాల దూరంల ఉన్నం గావొచ్చు. ఎన్నడూ మా ఇంటిమొకాన రాని పోలీసులు లాఠీలు వట్టుకొని కనవడ్తున్నరు. పోలీసు జీబులు కనవడ్తున్నయి. కండ్లకు అద్దాలు వెట్టుకొని, టిక్కు, టక్కు ఏస్కొని ఉన్న అధికారులు చేతిల ఏవో పేపర్లు వట్టుకొని ఉన్నరు. టేప్ వట్టుకొని మా ఇంటి గోడల్ని కొలుస్తున్నరు. పక్కన్నే ఎర్రకలర్ బ్రెష్ వట్టుకొని ఓ మనిషి నిల్సున్నడు. 'వద్దంకుల్, వద్దంకుల్..' అని నా బిడ్డ నివేదిత, కొడుకు యశ్వంత్ గుక్కపట్టి ఏడుస్తనే ఉన్నరు. మమ్మల్ని జూసిన మా పిల్లలు దగ్గరికి ఉరికచ్చి గట్టిగ అల్మకున్నరు. వాళ్లు ఎగవోసుకుంట చెప్పే మాటలు మాకర్థమైతలేవు.

***

నా పేరు బొడిగె నర్సింహ. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన నాకు అప్పుడే పదిహేనేండ్లు వడ్డయి. నాయిన బొడిగె అంజయ్య తాళ్లెక్కుతడు. 'నాయినా.. నేన్గూడ నీతోని తాళ్లెక్కుడు నేర్సుకుంట' అనడిగిన. 'నేన్ గేసిన కల్లే రోజు నేల పాలైతున్నది, నువ్వు తాళ్లెక్కి ఏం జేస్తవ్‌రా?' అని శెప్పకుండనే ఆ పని వద్దని శెప్పిండు. ఇగ ఇక్కడుంటే ఫాయిదా లేదని పట్నం బాట వట్టిన. పట్నం వచ్చిన కొత్తల రోజుకు పది రూపాల కూలికి కల్లు కాంపౌండ్ల పనికి కుదిరిన. గడియ రికాం లేదు, గవ్వ రాకట లేదన్నట్టు.. ఎన్నేండ్లు పన్జేసినా ఎన్కేసింది మాత్రం ఏం లేదు. అది పోను 'పిలగాడు కల్లు కాంపౌండ్ల పన్జేస్తడటనవ్వా..' అని పిల్లనిచ్చేటందుకు గూడ ఎవ్వలు ముందుకు రాలె. ఇగ లాభం లేదని కుట్టుమిషిన్ పన్నేర్సుకున్న. ఆ పన్జేస్తుండంగనే కొన్నిరోజులకు సువర్ణ నాకు జతయింది. కొన్ని రోజులకు మాకిద్దరు పిల్లలు గూడ వుట్టిర్రు. రెడీమేడ్ బట్టల పుణ్యమాని కుట్టుమిషిన్ పని గూడ కుంటువడ్డది. ఆ రోజుల్ల కడుపున వుట్టిన పోరగాండ్లకు కడుపు నిండా తిండివెట్టలేని పరిస్థితి. ఓ రోజు మేం కిరాయి ఉన్న ఇంటి ఓనర్ అచ్చి 'అచ్చే నెల కిరాయి గట్టకుంటే సామాన్లు బయట వారేస్త' అని బెదిరిచ్చిండు. ఆయన మాటలు మా ఇద్దరాలుమొగల్ని ఎన్టీఆర్‌నగర్‌లోని మార్కెట్ బాట వట్టించినయి. అప్పట్నుంచి ఇప్పటిదాకా దగ్గెర దగ్గెర ఇరువై ఐదేండ్లయితున్నయి గావొచ్చు అటు మిషిన్ కుట్టుకుంటనే, ఇటు కూరగాయలు గూడ అమ్ముతున్నం.

నాటి నుంచి తినో, తినకనో.. పస్తులుండో, పచ్చడి మెతుకులు దినో.. కడుపు మాడ్సుకొనో, కారంతోని దినో.. కట్టవడి, శెమటోడ్చి పైసా పైసా పోగేసుకున్నం. రూపాయి రూపాయి కూడవెట్టుకున్నం. ఇల్లు లేని బతుక్కు ఇల్వలేదని అర్థమైంది. అందుకే ఎట్లనన్న జేసి పట్నంల ఓ గూడు కట్టుకోవాలనుకున్నం. పట్నంల గూడు కట్టుకునుడంటే ఉత్త ముచ్చటనా? ముందుగాళ్లనైతే జాగ కొనుక్కుందాం, ఆ తర్వాత గూడు నిలవెట్టుకుందామని అగ్గువకచ్చే జాగ కోసం ఎన్కులాడినం. మాకు దగ్గట్టే, మేం అనుకున్నట్టే ఓ 117 గజాల భూమి అమ్మకానికొచ్చింది. బ్యారం కుదిరింది. మేం గూడ బయాన వెట్టినం. ఆ భూమి ఎక్కన్నో గాదు, చైతన్యపురిలోని ఫణిగిరికాలనీ, సాయిబాబా గుడెన్క. మూసీ నది కొంచెం దూరాన, ఆ భూమి ముందు నుంచే వోతది. కట్టవడ్డ పైసలు గదా? అమ్మేటోని దగ్గర బోర్లవడద్దని అధికారుల దగ్గరికి గూడ వోయినం. ఆ భూమి కాయిదాలు సూపెట్టి 'ఈ భూమి మంచి దేనా సారు?, ముందు ముందు మాకేమన్న ఇబ్బందైతదా?' అనడిగితే 'ఈ భూమిల కొర్రీలేం లెవ్వు, బాజాప్తా కొనొచ్చ'ని భరోసా ఇచ్చిండు. తతిమా పైసలు గట్టి రిజిస్ట్రేషన్ గూడ చేపిచ్చుకున్నం. ఉన్న పైసలతోని జాగ కొనుక్కున్నమంటే ఇగ ఇల్లు కట్టుకునేటందుకు పైసలెక్కడియి? అందుకే సుట్టూ గోడలు వెట్టుకొని ఉన్నంతల నాలుగు రేకులు ఆల్సుకున్నం. మా ఇంటికి నెంబర్ ఉన్నది. నల్లా కనెక్షన్ ఉన్నది. కరెంటు మీటర్ గూడ ఉన్నది. పద్నాలుగేండ్ల నుంచి ఇదే ఇంట్ల ఉంటున్నం, ఇదే ఇంట్ల తింటున్నం. ఏ ఊరికి వోయినా నాత్రి ఈ ఇంటికి రావాల్సిందే. పుశ్కివొయి అక్కడున్నా నాకు నిద్రవట్టది. మళ్ల నా ఇంట్లకొచ్చి నడుమాలుస్తనే కంటి నిండా నిద్రవడ్తది.



గడ్డం సతీష్
99590 59041


సామాన్యుడి మాట

***

> ***మా పిల్లల ఎగవోతల మజ్జన మా ఇల్లును కూలగొడ్తరనే విషయం మాకర్థమైంది. నేనో దిక్కు, మా ఇంటామె సువర్ణో దిక్కు వొయి 'మీ బాంఛెన్ సార్లు మా ఇంటికి రెడ్ మార్క్ వెట్టకుర్రి, మా ఇల్లు కూలగొట్టకుర్ర'ని బతిలాడినం, ఆఖరికి కాళ్ల మీద గూడ వడ్డం. అయినా వాళ్ల మన్సు కర్గలే. కట్టవడి కట్టుకున్న ఇల్లును కూలగొడ్తమంటే కడుపు మండదా? అందుకే మా సువర్ణ అధికారులకు అడ్డం దిర్గింది. అంతే.. 'అరేయ్ ఈమెను గుంజిపారేయుర్రి, ఎక్వ తక్వ జేస్తే పోలీస్‌స్టేషన్‌కు తీసుకపోర్రి' అని పోలీసాయన దబాయించిండు.***

ఓ దిక్కు మేం వద్దనుడు, ఇంకో దిక్కు వాళ్లు మమ్మల్ని గుంజిపారేసుడు. పేదోళ్లం, పైగా పైసల్లేనోళ్లం కదా? ఆఖరికి పెద్దోళ్లే గెలిసిర్రు. మా ఇంటికి రెడ్ మార్క్ పెట్టనే వెట్టిర్రు. అంటే.. మా ఇంటిని ఇగ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూలగొడ్తడట. ఇంటికి రెడ్ మార్క్ వడ్డ కాన్నుంచి బుక్క నోట్లెకు వోతలేదు, కంటి మీద కునుకు లేదు. మా పిల్లలెక్కన్నో, మేం ఎక్కన్నో మాకే సమజైతలేదు. మార్కెట్‌కు పోవుడు లేదు, మన్ను బుక్కుడు లేదు.

పెళ్లీడుకొచ్చిన ఆడివిల్లతో సహా మమ్మల్ని రోడ్డున పడేయ్యాల్నని సీఎం రేవంత్ కంకణం గట్టుకున్నడు. కనీ, పొట్టోన్ని పొడుగోడు గొడ్తే, పొడుగోన్ని పోశమ్మ గొడ్తదట. మమ్మల్ని నాశనం జేయాల్నని జూస్తే, ఏదో రోజు వాళ్లు గూడ నాశనమైపోతరు. మా ఉసురు తాకుతది. అదే గురువారం పోలీసోళ్లు డీసీఎం వ్యాన్లు తీస్కచ్చిర్రు. 'కట్టుబట్టలతోని సామాన్లు సర్దుకొని ఈ వ్యాన్ల వోర్రి, లేకుంటే బలవంతంగ గుంజిపారేస్తమ'ని బెదిరిచ్చిపోయిండ్రు. అప్పటినుంచి మా ఫణిగిరికాలనీల పోలీసు జీబులు తిర్గుతనే ఉన్నయి. ఎప్పుడు బుల్డోజర్లు వస్తయోనని గుండెలు గుబేల్‌మంటున్నయి. క్షణక్షణం భయపడుకుంట బతుకుతున్నం. సీఎం సార్.. మమల్ని ఇంతగనం భయపెట్టుడెందుకు? ఆ బుల్డోజర్లను జప్పన పిలిపియ్యిర్రి. మేం ఇంట్ల ఉండంగనే కూలగొట్టుర్రి. ఇంటి నల్గురం మా ఇంట్లనే సచ్చిపోతం. మా ఇల్లే కూలినంక మేముంటేంది? లేకుంటేంది?





ఆమె కూడా రాజీనామా చేయాలి!

కోర్టు ఆదేశాల మేరకు నిర్మలా సీతారామన్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఆమె ఎవరు? ఆమె ఒక కేంద్ర మంత్రి. ఇప్పుడు ఆమె పైన కూడా ఎఫ్ఐఆర్ ఉంది. ఎన్నికల బాండ్ల పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడినట్టు ఆరోపణలున్నాయి. ఆ విషయమై కేసు కూడా నమోదైంది. ఇప్పుడు నిర్మల కూడా రాజీనామా చేయాలి. రాజీనామా చేయాలని ఆమెను వాళ్లు (బీజేపీ నేతలు) అడగగలరా?

- సిద్ధరామయ్య, కర్ణాటక ముఖ్యమంత్రి

హైడ్రాతో కాంగ్రెస్‌కు తలనొప్పి

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



హైదరాబాద్, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ): హైడ్రా కూల్చివేతల పేరిట కాంగ్రెస్ సర్కారు తల గోక్కుంటున్నదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. ఆరు గ్యారెంటీలు, సర్పంచుల పెండింగ్ బిల్లులే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీ కొంపముంచనున్నాయని చెప్పారు. హైదరాబాద్‌బండ్లగూడలో మీడియాతో మాట్లాడారు. మూసీ సుందరీకరణ పేరిట కాంగ్రెస్ సర్కార్ నిరుపేద హిందువుల ఇండ్లను కూల్చేందుకు కుట్రలు చేస్తున్నదని మండిపడ్డారు. మలక్‌పేట రేస్‌కోర్సు నుంచి మూసారంబాగ్ వరకు అసదుద్దీన్ ఒవైసీ అనుచరులు కబ్జాలు చేశారని, దమ్ముంటే వాటిని టచ్ చేయాలని సవాల్ విసిరారు. పేదల ఇండ్లను కూల్చివేయడం ఎంతవరకు సమంజసమని, హైడ్రా, మూసీ బాధితుల ఆర్తనాదాలు ఈ ప్రభుత్వానికి వినపడటం లేదా? అని ప్రశ్నించారు. జియాగూడలో దళితులు, చాదర్‌ఘాట్‌లో హిందువుల ఇండ్లను నేలమట్టం చేసిన ప్రభుత్వం, ఒవైసీ అనుచరులు అక్రమంగా కట్టుకున్న ఇండ్లను మాత్రం వదిలేస్తున్నదని ఆరోపించారు.

సీఎంను తిట్టిన వారిపై కేసు

ఎదులాపురం, సెప్టెంబర్ 28: తమ ఇండ్లను కూల్చేస్తారేమోనన్న ఆందోళనలో పలువురు సీఎం రేవంత్‌ని దుర్భాషలాడినందుకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్నది. ఖానాపూర్ చెరువు సమీప గుడిసెల్లో నివాసముంటున్న వారి ఇండ్ల కొలతలు తీసుకుంటున్న అధికారులను శుక్రవారం కాలనీవాసులు అడ్డుకున్నారు. తాము ఎన్నో ఏండ్లుగా గుడిసెలు వేసుకుని, ఇండ్లు కట్టుకుని జీవిస్తున్నామని పేర్కొన్నారు. హైడ్రా పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం తాము కట్టుకున్న ఇండ్లను కూల్చేస్తుందన్న భయంతో ఆందోళనకు గురయ్యారు. దీంతో భావోద్వేగానికి గురైన కాలనీవాసులు కొందరు సీఎం రేవంత్‌రెడ్డిని దుర్భాషలాడారు. ఈ మేరకు గంగన్నతోపాటు మరికొందరిపై కేసులు నమోదు చేసినట్టు ఆదిలాబాద్ వన్‌టౌన్ ఎస్సై ఇసాక్ తెలిపారు.

కూల్చివేతలపై 'సోషల్ వార్'

- నిర్వాసితులకు అండగా నెటిజన్లు
- సర్కారును ప్రశ్నిస్తున్న యువత
- పేదోళ్లపై బుల్డోజర్లు.. పెద్దలకు నోటీసులా అని మండిపాటు
- గళం విప్పుతున్న సోషల్ మీడియా వారియర్స్

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ): 'చెరువును పూడ్చి కట్టిన రెస్టారెంట్లు, పబ్‌లు, బిల్డింగ్‌లు' కనిపిస్తలేవా?..ఇవన్నీ సక్రమ కట్టడాలా? పేద ప్రజల ఇండ్లే అక్రమ కట్టడాలా?.. అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాడో నెటిజన్. 'కూల్చడం నిమిషాలే.. కానీ కట్టడానికి సంవత్సరాలు, పడగొట్టడం కాదు.. నిలబెట్టడం ముఖ్యం'.. అంటూ మరో యువకుడు సర్కారుకు చురకలంటిస్తున్నాడు. ఇలా సోషల్ మీడియా వేదికగా ప్రజాగళం బయటికొస్తున్నది. హైడ్రా పేరిట ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై సామాజిక మాధ్యమాల్లో సర్వత్రా ఆగ్రహావేశాలు పెల్లుబికుతున్నాయి. పెద్దోళ్లకు నోటీసులు ఇస్తూ.. పేదోళ్ల ఇండ్లను ఆగమేఘాల మీద కూల్చివేస్తుండడంపై ప్రశ్నలు సంధిస్తున్నారు. ఇప్పుడు ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాలో హైదరాబాద్, మూసీ నిర్వాసితుల కన్నీళ్లు, బాధితుల ఆర్తనాదాలు, ఆగ్రహావేశాలే వైరల్ అవుతున్నాయి.

సర్కారుపై ప్రశ్నల వర్షం..

పదేండ్ల కిందట మీ ప్రభుత్వమే పట్టా..పర్మిషన్లూ ఇచ్చింది.. ఇప్పుడు మీరే వచ్చి ఇది అక్రమం అంటున్నారు? ఇదెలా అంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏకిపారేశాడో నెటిజన్. ఇందిరమ్మ ఇచ్చిన పట్టా ఇదంటూ ఓ బాధితురాలి ఆక్రందనల వీడియోను ట్యాగ్ చేశాడు మరో నెటిజన్. ప్రపంచ వ్యాప్తంగా హైదరాబాద్‌కు పేరు ప్రతిష్టలున్నాయి. ఆ ఇమేజ్‌ను డ్యామేజ్ చేసేందుకే ఇదంతా చేస్తున్నారా అంటూ మరో నెటిజన్ ప్రశ్నించాడు. పేదల పాలిట యమపాశంలా మారిందీ సర్కారు 'ఎటు పోతున్నదీ రాష్ట్రం.. ఇందుకోసమేనా ఉద్యమాలు చేసి తెలంగాణ తెచ్చుకున్నది' అంటూ ఓ సోషల్ వారియర్ చేసిన పోస్ట్ సర్వత్రా ఆలోచింపజేస్తున్నది. పేదల విషయంలో బుల్డోజర్లతో దూసుకువస్తూ... దుర్గం చెరువు ఆక్రమణలను ఎందుకు కూల్చడం లేదని ప్రశ్నిస్తున్నారు. అన్ని అనుమతులతో నిర్మించుకున్న భవనాలను పేక మేడల్లా కూల్చివేస్తున్న సర్కార్.. పెద్దల విషయంలో అంతే వేగంతో నిర్ణయాలు తీసుకోవడం లేదని నిలదీస్తున్నారు. 'నీ అన్నకు 30రోజుల టైం.. పేదలకు మూడు నిమిషాలు కూడాటైం లేదా?' ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇలాంటి రాక్షస పాలనను చూడలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మూసీ నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బేగంపేటలోని ప్రజాభవన్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

నిర్వాసితుల గొంతుకగా సోషల్ మీడియా..

మూసీ, హైడ్రా నిర్వాసితులకు అండగా సోషల్ మీడియా వారియర్లు నిలుస్తున్నారు. అర్థవంతమైన చర్చలు, సమర్థవంతమైన వివరణలతో నెటిజన్లు కాంగ్రెస్ సర్కారును ఆటాడుకుంటున్నారు. హైడ్రా, మూసీ బాధితుల వీడియోలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ.. బయటి ప్రపంచానికి తెలిసేలా చేయడంలో నెటిజన్లు కృతకృత్యులయ్యారు. నిర్వాసితులకు అండగా నిలుస్తూ మద్దతు కూడగడుతున్నారు.

భయానక నగరమైంది..

రెండేండ్ల కిందట ఆంధ్రా నుంచి ఓ వ్యక్తి కుటుంబంతో సహా హైదరాబాద్ వచ్చి ఉద్యోగం చేస్తూ ఇక్కడే సెటిలైపోవాలని నిర్ణయించుకున్నాడు. అందుకు కారణం.. ఇక్కడ జరిగిన అభివృద్ధి.. హైదరాబాద్‌కు ఉన్న ఇమేజ్.. సర్కారు చర్యలే. కానీ, అదే వ్యక్తి ప్రస్తుతం ఇక్కడ ఉండాలంటేనే భయమేస్తుందంటున్నాడు. ఏ ల్యాండ్ కొనాలనుకోవడం లేదంటూ కాంగ్రెస్ సర్కారు పాలనపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇలా సోషల్ మీడియా వేదికగా గత కేసీఆర్ ప్రభుత్వం, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై తేడాను జనం వివరిస్తున్నారు.



సూర్యాపేటలో సద్దుల చెరువు సమీప కాలనీవాసులకు ధైర్యం చెబుతున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

హైడ్రా పేరుతో సర్కారు విధ్వంసం

ప్రభుత్వ తీరుతో ప్రజలకు నిద్రలేని రాత్రులు: ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

బొడ్రాయిబజార్, సెప్టెంబర్ 28 : కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో విధ్వంసం సృష్టిస్తున్నదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువు సమీపంలోగల 30, 42, 43వ వార్డుల్లో శనివారం ఆయన పర్యటించారు. గత నాలుగు రోజులుగా కూల్చివేతల కలకలంతో నిద్ర లేని రాత్రులు గడుపుతున్న కుటుంబాలకు ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సోయిలేని ప్రభుత్వం, బాధ్యతలేని ముఖ్యమంత్రి, అర్థంపర్థం లేని మంత్రుల పనులతో లక్షలాది మంది ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. పోలీసులను అడ్డం పెట్టుకొని ప్రభుత్వమే కూల్చివేతలకు పాల్పడటం ఆశ్చర్యంగా ఉన్నదన్నారు. చెరువులు, కుంటలను రక్షించాలని, నీళ్లను సంరక్షించాలని అయితే అదే సమయంలో ప్రభుత్వానికి ప్రజలపై బాధ్యత కూడా ఉండాలని సూచించారు. ఈ 70 ఏండ్ల కాలంలో ఎక్కడా చెరువులు, నీటి కుంటలు, నాలాలకు బఫర్‌జోన్లు నిర్ణయించి బోర్డులు పెట్టలేదని అన్నారు. సూర్యాపేట సద్దుల చెరువు కింద ప్రాంతం ఎట్టి పరిస్థితుల్లోనూ ఎఫ్‌టీఎల్ కాదని, తొందరపాటు నిర్ణయం తీసుకుంటే ప్ర భుత్వమే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కలెక్టర్‌ను కలిసి చెప్పనున్నట్టు తెలిపారు.

పంచాయతీ ఎన్నికల తుది ఓటరు జాబితా

ప్రకటించిన రాష్ట్ర ఎన్నికల సంఘం

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : గ్రామపంచాయతీ ఎన్నికల ఓటరు తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం శనివారం ప్రకటించింది. ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ అనంతరం తుది జాబితాను విడుదల చేసింది. దీని ఆధారంగానే రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికలను నిర్వహించనున్నారు. ఈ జాబితాను ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాల వద్ద అందుబాటులో ఉంచారు. దీని ఆధారంగా బీసీ కులగణన చేపట్టనున్నట్టు సమాచారం. దీనిపై ఇప్పటికే బీసీ కమిషన్ కసరత్తు చేసినట్టు తెలిసింది. మూడు నెలల్లోగా బీసీ కులగణన చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే హైకోర్టుకు నివేదించిన నేపథ్యంలో దీనిపై కార్యాచరణ ప్రకటించనున్నట్టు సమాచారం.

కాళ్మొక్తం సారూ.. మా ఇండ్లు కూల్చొద్దు

- చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ కాళ్లు మొక్కిన దళిత మహిళలు
- కాళ్ల మీద పడాలని ప్రోత్సహించిన అగ్రవర్ణ నాయకుడు
- రేవంత్ అన్నకే నోటీసులిచ్చారని చీదరించుకున్న వివేక్



మంచిర్యాల జిల్లా భీమారంలో ఎమ్మెల్యే వివేక్ కాళ్లు మొక్కుతున్న దళిత మహిళలు

భీమారం, సెప్టెంబర్ 28 : 'డెబ్బై ఏండ్లుగా ఇక్కడే ఉంటున్నం. ఇప్పుడొచ్చి చెరువులో మా ఇండ్లున్నయంటున్నరు. గవ్విటిని కూల్చుతమని నోటీసులిచ్చిన్రు. బాంచన్ కాల్మొక్తం. మాకు న్యాయం చేయుండ్రి' అంటూ మంచిర్యాల జిల్లా భీమారం మండలం సుంకరిపల్లి గ్రామస్థులు చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ కాళ్లపై పడ్డారు. శనివారం భీమారంలోని రైతు వేదిక వద్ద వివేక్ అధికారులతో కలిసి సబ్సిడీ గ్యాస్ సిలిండర్ల ప్రొసీడింగ్‌తోపాటు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. భీమారానికి చెందిన 40 మంది చిరువ్యాపారులు కూడా అక్కడికి చేరుకొని తమ గోడువెల్లబోసుకున్నారు. చెరువు శిఖంలో కట్టడాలున్నాయని తమకు నోటీసులిచ్చారని.. న్యాయం చేయాలని ఎమ్మెల్యేను వేడుకున్నారు. ఇంతలోనే అక్కడున్న కాంగ్రెస్ నాయకులు కలుగజేసుకొని పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో.. ఎమ్మెల్యే అసహనం వ్యక్తంచేశారు. ఇలా మిస్‌గైడ్ చేస్తే కలెక్టర్‌కు తానేమి చెప్పాలని అన్నారు. ఇంతలోనే బాధితులు మాట్లాడేందుకు ప్రయత్నించగా.. ఎమ్మెల్యే స్పందిస్తూ స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి వాళ్ల అన్నకే నోటీసులు ఇచ్చారంటూ చీదరించుకున్నారు. ఈ క్రమంలో ఓ అగ్రవర్ణ కాంగ్రెస్ నాయకుడు.. సుంకరపల్లి దళిత మహిళలను వివేక్ కాళ్లు మొక్కాలని ప్రోత్సహించాడు. బాధితులకు న్యాయం చేయాలని పోడెటి రవితో పాటు మాజీ జడ్పీటీసీ జర్పుల రాజ్‌కుమార్ నాయక్ వర్గం ప్రయత్నం చేస్తుండగా, కాంగ్రెస్ జిల్లా నాయకుడు చేకూర్తి సత్యనారాయణరెడ్డి వర్గం మాత్రం చెరువును కబ్జాల నుంచి కాపాడాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం గమనార్హం.

పేదలను రోడ్డున పడేస్తరా?

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): హైడ్రా కూల్చివేతలతో నిరుపేదలను రోడ్డున పడేస్తరా? అని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. పేదలకు భరోసా, భద్రత కల్పించాక వారి ఆమోదంతోనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. అలా చేయని పక్షంలో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని హెచ్చరించారు. హైడ్రా పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అతిని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. దశాబ్దాలుగా నివాసాలు ఉంటున్న వేలాది మందిని నిరాశ్రయులను చేయడం ప్రభుత్వ విధానంగా ఉండొద్దని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మానవీయ కోణం లోపించిందని, ప్రతీ అంశాన్ని రాజకీయ కోణంలోనే చూస్తున్నదని ధ్వజమెత్తారు. ఎఫ్టీఎల్, బఫర్‌జోన్, నాలా పరిధులను నిర్ధారించి, ఆయా ప్రాంతాల్లో ఉన్న నిరుపేదలను గుర్తిం చి వారికి తగిన ప్రత్యామ్నాయాలను చూపించాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బయటకు వస్తే ప్రళయం తప్పదని స్పష్టంచేశారు. ఎప్పుడు ఏం చేయాలి? ఎలా స్పందించాలో కేసీఆర్‌కు సంపూర్ణంగా తెలుసునని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల తెలంగాణకు నష్టం జరిగిందని ప్రజల్లో అభిప్రాయం వ్యక్తం అవుతున్నదని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణ ఆకాంక్షలను నెవరేర్చడంలో ఘోరంగా విఫలమవుతున్నాయని, విభజన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని విమర్శించారు.

మంత్రి పేషీని పెట్రోల్ పోసి తగులబెడతా

- నాలుగు నెలలైనా జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి రాడా?
- జూపల్లి కృష్ణారావుపై ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ఫైర్

కంఠేశ్వర్, సెప్టెంబర్ 28: నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు తీరుపై ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ఫైర్ అయ్యారు. నిజామాబాద్ కలెక్టరేట్‌లో ఎంపీ అర్వింద్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన దిశా సమావేశంలో రాకేశ్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. 4నెలల నుంచి ఇన్‌చార్జి మంత్రి జిల్లాకు రాకపోతే అభివృ ద్ధి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. మంత్రి జిల్లాను పట్టించుకోకపోవడం తో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. ఆయన ఇలాగే వ్యవహరిస్తే సచివాలయంలోని మంత్రి పేషీని పెట్రోల్ పోసి తగులబెడతానని సంచలన వ్యా ఖ్యలు చేశారు. దిశ కమిటీ చైర్మన్ ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ.. బోధన్ ఎమ్మె ల్యే సుదర్శన్‌రెడ్డిపై సెటైర్లు వేశారు. జిల్లా అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన సుదర్శన్‌రెడ్డి మంత్రి పదవి రాలేదని అలిగి కూర్చున్నాడని విమర్శించారు. 'రేవంత్ రెడ్డి.. సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇచ్చేయండి. ఆయన పని ఆయన చేసుకుంటాడు. లేకుంటే అలిగి కూర్చుంటాడు' అని వ్యాఖ్యానించారు.

ఐసీఏక్యూ అధ్యక్షుడిగా ఆశిష్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ): ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రేలియా క్వీన్స్‌లాండ్(ఐసీఏక్యూ) అధ్యక్షుడిగా ఆశిష్‌రెడ్డి కట్టా ఎన్నికయ్యారు. 20 వేల మందికిపైగా భారతీయ సంతతి సభ్యులు గల సంస్థ కార్యవర్గ ఎన్నికలను శనివారం నిర్వహించారు. కోశాధికారిగా శ్రీకర్ ఆండెం, కార్యనిర్వాహక సభ్యుడిగా విరంచిరెడ్డి ఎన్నికయ్యారు. కాగా అధ్యక్షుడిగా ఎన్నికైన ఆశిష్‌రెడ్డి ఆస్ట్రేలియాలో అతిపెద్ద నైపుణ్యాభివృద్ధి సంస్థ ఐ కాలేజ్ లిమిటెడ్‌కు ఎండీగా, సీఈవోగా పనిచేశారు.

పేదలకూ సమాన న్యాయం అందాలి

- యువ న్యాయవాదులు నడుం బిగించాలి
- నల్సార్ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ముర్ము పిలుపు



నల్సార్ వర్సిటీ 21వ స్నాతకోత్సవంలో పాల్గొన్న రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సుప్రీంకోర్టు జస్టిస్ పీఎస్ నర్సింహ, సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): దేశంలో ధనవంతుడికి లభించినట్టుగా పేదవారికి న్యాయం లభించడం లేదని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆవేదన వ్యక్తంచేశారు. ధనవంతులతో సమానంగా పేదలకు కూడా న్యాయం అందేలా మార్పులు రావాలని ఆకాంక్షించారు. ఇందుకు న్యాయ పట్టాలు అందుకున్న యువత కృషి చే యాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం 21వ స్నాతకోత్సవ సభ శనివారం వర్సి టీ ఆవరణలో వైభవంగా జరిగింది. హాజరైన రాష్ట్రపతి ముర్ము ప్రసంగిస్తూ.. న్యాయ పట్టాలతో బయటకు వస్తున్న యువత తమ దృష్టిని అట్టడుగు వర్గాలపైన, సామాజిక న్యాయంపైన కేంద్రీకరించాలని నొక్కి చెప్పారు.

జాతీయస్థాయిలో మహిళా నెట్‌వర్క్

మహిళలపై అఘాయిత్యాల నివారణ కు దేశవ్యాప్తంగా ఉన్న మహిళా న్యాయవాదులు, మహిళా న్యాయవిద్యార్థినుల తో కూడిన జాతీయస్థాయి నెట్‌వర్క్ ఏర్పాటుచేయాలని నల్సార్‌కు రాష్ట్రపతి ముర్ము సూచించారు. పలు రంగాల్లో ముందంజలో ఉన్న నల్సార్, తన పూర్వ విద్యార్థులతో సహా ఇతర వర్గాల మద్దతును కూడగట్టి నెట్‌వర్క్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ స్నాతకోత్సవంలో అసాధారణ ప్రతిభతో బంగారు పతకాలు పొందిన విద్యార్థులను రాష్ట్రపతి అభినందించారు. నల్సార్ చాన్స్‌ల ర్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే స్నాతకోత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించారు. వైస్ చాన్స్‌లర్ కృష్ణదేవరావు స్వాగతం పలికారు. కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నర్సిం హ, సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు.

'ములుగు' బిల్లును ఆమోదించండి

ములుగు గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా మార్చే బిల్లుకు ఆమోదం తెలపాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క వినతిపత్రం అందజేశారు. రాష్ట్రపతి నిలయంలో ద్రౌపదిముర్ముతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అంతకుముందు బేగంపేట విమానాశ్రయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, మేయర్ విజయలక్ష్మి, సీఎస్ శాంతికుమారి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

ఎమ్మెల్యేల పనితీరు సరిగ్గా లేదు

పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్



హైదరాబాద్, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ): కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల పనితీరుపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. వీరి వ్యవహారశైలిపై కార్యకర్తలు ఆగ్రహంగా ఉన్నట్టు తెలిసింది. శనివారం గాంధీ భవన్ లో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించిన ఆయన పలు అంశాలను పంచుకున్నారు. పలువురు ఎమ్మెల్యేల పనితీరు బాగాలేదని తెలిపారు. పనితీరు బాగాలేని ఎమ్మెల్యేల జాబితాను సిద్ధం చేసినట్టుగా చెప్పినట్టు తెలిసింది. ఇక పీసీసీ కార్యవర్గంలో త్వరలోనే సమూలు మార్పులు చేయబోతున్నట్టు స్పష్టంచేశారు. కష్టపడిన వారికి మాత్రమే కార్యవర్గంలో స్థానం కల్పిస్తామని చెప్పారు.

మహిళల పేరుతో డిజిటల్ కార్డులు

- ఒకే కార్డులో రేషన్, ఆరోగ్య, ఇతర పథకాల వివరాలు
- అందుబాటులోని డాటా ఆధారంగా కుటుంబాల నిర్ధారణ
- వచ్చే నెల 3 నుంచి పైలెట్‌గా క్షేత్రస్థాయి పరిశీలన
- సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం అందించబోయే కుటుంబ డిజిటల్ కార్డులో మహిళనే ఇంటి యజమానిగా గుర్తించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇతర కుటుంబసభ్యుల పేర్లు, వారి వివరాలు.. కార్డు వెనుక ఉంచాలని పేర్కొన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డులపై (ఎఫ్‌డీసీ) శనివారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. 25 నుంచి 27వరకు రాజస్థాన్, హర్యానా, కర్ణాటక, మహారాష్ట్రల్లో పర్యటించిన అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మా ట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న రేషన్, రాజీవ్‌ఆరోగ్యశ్రీ, వ్యవసాయ, ఐటీ, ఇతర సంక్షే మ పథకాల్లోని డాటా ఆధారంగా కుటుంబాల నిర్ధారణ చేయాలని సూచించారు. బ్యాంకు ఖాతాలు, పాన్ కార్డుల వంటి అనవసర సమాచారం అవసరంలేదన్నారు.

ప్రతి నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టు

ఎఫ్‌డీసీ సమాచారణ సేకరణ, ఏయే అంశాలు పొందుపరుచాలి వంటి వివరాలతో కూడిన నివేదికను మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనరసింహతో కూడిన మంత్రివర్గ ఉపసంఘానికి అందజేయాలని అధికారులకు సీఎం ఆదేశించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక గ్రామీణ, ఒక పట్టణ ప్రాంతాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయాలని సూచించారు. కుటుంబాల నిర్ధారణ, ఫ్యామిలీ డిజిటల్ కార్డుల వివరాలకు అందుబాటులో ఉన్న డాటా ఆధారంగా అక్టోబర్ 3 నుంచి ఇంటింటికీ తిరిగి పరిశీలించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి నియోజకవర్గానికి ఆర్డీవో స్థాయి అధికారిని, పట్టణ ప్రాంతాల్లో జోనల్ కమిషనర్ స్థాయి అధికారిని పర్యవేక్షణకు నియమించాలని చెప్పారు. ఉమ్మడి జిల్లాకు ఇటీవల వరదల సమయంలో వేసిన సీనియర్ అధికారులను పర్యవేక్షకులుగా నియమించాలని ఆదేశించారు.

నిర్మల, నడ్డాపై ఎఫ్‌ఐఆర్

- కంపెనీలను బెదిరించి ఎన్నికల బాండ్లు కొనిపించారని ఫిర్యాదు
- బీజేపీ నేతలకూ ప్రమేయం..8 వేల కోట్ల దోపిడీ జరిగిందని ఆరోపణ
- మార్చిలోనే ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం..కోర్టు ఆదేశాలతో స్పందన

బెంగళూరు, సెప్టెంబర్ 28: కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, జేపీ నడ్డా సహా కర్ణాటక బీజేపీ నేతలపై సంచలన ఆరోపణలు వెలువడ్డాయి. దీంతో కేంద్ర మంత్రులు, రాష్ట్ర బీజేపీ నాయకులకు వ్యతిరేకంగా శనివారం బెంగళూరులోని తిలక్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్ నమోదైంది. కర్ణాటకలో పలు కార్పొరేట్ కంపెనీలపై ఈడీ దాడులు చేయటం వెనుక కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఉన్నారని, వాటి ఆస్తుల్ని జప్తు, స్వాధీనం చేస్తామని బెదిరింపులకు దిగటంతో..సీఈవోలు, ఎండీలు, టాప్ ఎగ్జిక్యూటివ్స్ బలవంతంగా ఎన్నికల బాండ్స్ కొనుగోలు చేశారని 'జనాధికార సంఘర్ష్ పరిషత్' (జేఎస్‌పీ) సహ అధ్యక్షుడు ఆదర్శ్ ఆర్ అయ్యర్ ఆరోపించారు. బాండ్ల కొనుగోలు ముసుగులో దాదాపు రూ.8 వేల కోట్ల దోపిడీ జరిగిందని అన్నారు. కేంద్ర మంత్రులు, కేంద్ర, రాష్ట్ర బీజేపీ నాయకులకు ఈ కుట్రలో పాత్ర ఉందని తన ఫిర్యాదులో ఆరోపించారు. బాండ్ల ద్వారా సమకూరినదంతా బీజేపీ కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు నగదుగా మార్చుకున్నారని, బాండ్ల కొనుగోలు ముసుగులో ఈ దోపిడీ జరిగిందని అయ్యర్ తెలిపారు. ఇందుకోసం బీజేపీ నాయకులు వివిధ స్థాయిలో కలిసి పని చేశారని చెప్పారు. ఈ ఏడాది మార్చి 30న తిలక్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో అయ్యర్ ఫిర్యాదు చేశారు. అక్కడి డీసీపీ అధికారిని కూడా కలుసుకున్నారు. ఆ ఫిర్యాదుపై పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో దీనిపై ఆయన కోర్టును ఆశ్రయించారు. పోలీసు అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. బెంగళూరులోని స్పెషల్ కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు తాజాగా ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు.



నిర్మలా సీతారామన్ రాజీనామాకు సిద్ధరామయ్య డిమాండ్

నిర్మలా సీతారామన్‌పై కేసు నమోదైనందున ఆమె వెంటనే కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేయాలని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య డిమాండ్ చేశారు. ఆమె రాజీనామాను డిమాండ్ చేస్తూ బీజేపీ నేతలు ఎప్పుడు ఆందోళన చేస్తారని ప్రశ్నించారు. ఎన్నికల బాండ్ల కేసులో నిష్పాక్షిక విచారణ జరిగితే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం రాజీనామా చేయాల్సి వస్తుందన్నారు.

నన్ను జైలుకు పంపేందుకు కాంగ్రెస్ కుట్ర

- నేను పత్రాలు బయటపెడితే ఆరేడుగురు మంత్రులు రాజీనామా చేయాల్సిందే
- కేంద్రమంత్రి కుమారస్వామి వ్యాఖ్యలు



బెంగళూరు, సెప్టెంబర్ 28: తనపై కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని, 12 ఏండ్ల పాత కేసులో జైలుకు పంపించాలని అనుకుంటున్నదని కేంద్రమంత్రి, జేడీఎస్ నేత కుమారస్వామి ఆరోపించారు. అలాంటి పరిస్థితే వస్తే తానే స్వచ్ఛందంగా పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. కాంగ్రెస్‌ను తాను విమర్శించడం ప్రారంభించిన నాటి నుంచి తనపై సిద్ధరామయ్య సర్కారు కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ నేతల అక్రమాలకు సంబంధించి తన వద్ద ఉన్న పత్రాలు బయటపెడితే సిద్ధరామయ్య మంత్రివర్గంలోని ఆరేడుగురు రాజీనామా చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. గత ప్రభుత్వం 40 శాతం కమీషన్లు తీసుకుంటున్నదని ఆరోపించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు అంతకంటే ఎక్కువ శాతం కమీషన్లు తీసుకుంటున్నట్టు కాంగ్రెస్ వారే చెప్పుకుంటున్నారని పేర్కొన్నారు. కాగా, కుమారస్వామి ఆరోపణలు కేవలం అబద్ధాలని సిద్ధరామయ్య పేర్కొన్నారు.

భగ్గుమన్న పశ్చిమాసియా

- ఇజ్రాయెల్ దాడుల్లో హెజ్బొల్లా అధినేత నస్రల్లా హతం
- సురక్షిత ప్రాంతానికి ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేని
- ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఇరాన్‌లో వెల్లువెత్తిన నిరసనలు
- ఇజ్రాయెల్‌లో అదనపు బలగాలు.. స్వదేశానికి నెతన్యాహూ

టెల్ అవీవ్, సెప్టెంబర్ 28: దాడులు, ప్రతి దాడులతో పశ్చిమాసియా అట్టుడుకుతోంది. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని ఆయా దేశాల పౌరులు బిక్కుబిక్కుమంటున్నారు. హెజ్బొల్లా అంతమే లక్ష్యంగా గత కొద్ది రోజులుగా ఇజ్రాయెల్ చేస్తున్న దాడులు లెబనాన్‌లో విధ్వంసం సృష్టిస్తున్నాయి. ఇప్పటికే వందలాది మంది మరణించారు. తాజా దాడుల్లో హెజ్బొల్లా అధినేత నస్రల్లాను హతమార్చి ఆ సంస్థను దారుణమైన దెబ్బ తీసిన ఇజ్రాయెల్ మరో కీలక విజయాన్ని సాధించింది. ఈ దాడిలో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ జనరల్ అబ్బాస్ నిల్ఫోరుషాన్ కూడా మరణించారు. నస్రల్లా మరణంతో అప్రమత్తమైన ఇరాన్ తమ దేశ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీని సురక్షిత ప్రాంతానికి తరలించింది. ఇజ్రాయెల్ దాడిని ఖమేని తీవ్రంగా ఖండించారు. గత ఏడాదిగా గాజాతో జరిగిన యుద్ధం నుంచి పాఠాలు నేర్చుకోని ఇజ్రాయెల్ లెబనాన్‌లోనూ అసంబద్ధ విధానాన్ని అవలంబిస్తున్నదని విమర్శించారు. ఈ సందర్భంగా ముస్లింలంతా లెబనాన్‌కు, హెజ్బొల్లాకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. నస్రల్లా మృతిపై ఇరాన్‌లో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. లెబనాన్ దాడులతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో దేశవ్యాప్తంగా అదనపు బలగాలను మోహరిస్తున్నట్టు ఇజ్రాయెల్ అధికారులు చెప్పారు.



బీరుట్ శివారులో ఇజ్రాయెల్ వైమానిక దాడులతో కూలుతున్న ఓ భవనం

వారసుడెవరు?

గత 32 ఏండ్లుగా హెజ్బొల్లాను విజయవంతంగా నడిపిస్తూ వచ్చిన నస్రల్లా మరణంతో దాని వారసుడెవరన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే నస్రల్లా మృతి చెందినంత మాత్రాన ఆ సంస్థ కుప్పకూలుతుందనో, బలహీన పడుతుందనో భావించడం అత్యాశే. అయితే దాని ఆత్మవిశ్వాసం దెబ్బతినడం ఖాయం. ఈ పరిస్థితుల్లో హాషీమ్ సఫీద్దీన్‌ను వారసునిగా ఎంపిక చేయవచ్చునని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం హెజ్బొల్లా రాజకీయ వ్యవహారాలు చూస్తూ జిహాద్ కౌన్సిల్ గ్రూపుల సభ్యునిగా ఉన్న సఫీద్దీన్.. నస్రల్లా కజిన్ కూడా. 2017లోనే ఇతడిని అమెరికా ఉగ్రవాదిగా ప్రకటించింది. నస్రల్లా కూడా ఇతనికి సంస్థలో వివిధ హోదాలు కట్టబెట్టి అతడిని నేతగా తయారు చేశారు. అతని భౌతిక ఆకారం, ప్రవర్తన కూడా నస్రల్లాను పోలి ఉంటుందని, అతడే కాబోయే నేత అని అంటున్నారు.

లక్ష్యం నెరవేరేదాకా దాడులు ఆగవు

శుక్రవారం ఐరాసలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రసంగించారు. లెబనాన్‌లో తమ లక్ష్యం నెరవేరే వరకు తమ దాడులు ఆగవని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన రెండు మ్యాప్‌లను ప్రదర్శించారు. కుడి చేతిలో నల్లని రంగుతో ఉన్న మ్యాప్‌లో మధ్య ప్రాచ్య దేశాలైన ఇరాన్, ఇరాక్, సిరియా, యెమన్ దేశాలు ఉండగా వాటికి ఆయన 'శాపం'గా పేర్కొన్నారు. అలాగే ఎడమ చేతిలో పచ్చ రంగుతో ఉన్న మ్యాప్‌లో భారత్, ఈజిప్ట్, సూడాన్, సౌదీ అరేబియా దేశాలు ఉండగా, వాటిని ఆయన 'దీవెన'గా తెలిపారు. అయితే రెండు మ్యాపుల్లో పాలస్తీనా ప్రస్తావన లేకపోవడం గమనార్హం. ఈ సందర్భంగా శాపం దేశాల్లో ఇరాన్ ఉండటాన్ని ఆయన ప్రస్తావిస్తూ ప్రస్తుతం పశ్చిమాసియాలోని సంఘర్షణ పరిస్థితులకు ఇరాన్, దాని మిత్ర దేశాలే కారణమని ఆరోపించారు. అదే సమయంలో పచ్చని రంగుతో ఉన్న 'దీవెన' దేశాల గురించి మాట్లాడుతూ అవన్నీ తమ మిత్ర, కాబోయే మిత్ర దేశాలుగా పేర్కొన్నారు. కాగా, నెతన్యాహూ ప్రసంగిస్తుండగా, నిరసనగా అనేక మంది దౌత్యవేత్తలు సమావేశం నుంచి వాకౌట్ చేశారు.

నెతన్యాహూపై క్షిపణి దాడికి యత్నం!

మరోవైపు నస్రల్లా మృతి విషయం తెలుసుకున్న ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ తన అమెరికా పర్యటనను కుదించుకుని ఇజ్రాయెల్‌కు తిరిగి వచ్చారు. ఇజ్రాయెల్ గడ్డపై అడుగుపెట్టిన వెంటనే టెల్ అవీవ్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు సహా సెంట్రల్ ఇజ్రాయెల్ అంతా సైరన్‌లు మోగించి స్వాగతం చెప్పారు. సైరన్‌లు మోగిన కొద్ది క్షణాలకే యెమెన్ నుంచి ఆ దేశ భూభాగంపైకి క్షిపణి దాడి జరిగింది. అయితే దానిని మిలటరీ సమర్థంగా తిప్పికొట్టింది. నెతన్యాహూ లక్ష్యంగా ఆ దాడి జరిగిందా అన్న దానిపై అధికారులు వివరణ ఇవ్వలేదు.

కొనసాగిన దాడులు

శనివారం కూడా ఇజ్రాయెల్ మిలటరీ దక్షిణ బీరుట్, తూర్పు లెబనాన్‌లోని బెకా వ్యాలీపై దాడులు చేసింది. అదే సమయంలో హెజ్బొల్లా ఉత్తర, కేంద్ర ఇజ్రాయెల్‌తో పాటు ఇజ్రాయెల్ ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌పై డజన్ల కొద్దీ రాకెట్లు, క్షిపణులతో దాడులు చేసింది. శుక్రవారం దాడిలో ఆరుగురు పౌరులు మరణించగా, 91 మంది గాయపడినట్టు లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

నస్రల్లా మరణం లెబనాన్‌కు పెద్ద దెబ్బే

శుక్రవారం తాము జరిపిన వైమానిక దాడుల్లో హెజ్బొల్లా అధినేత హసన్ నస్రల్లాను హతమార్చినట్టు ఇజ్రాయెల్ శనివారం ప్రకటించింది. దానిని హెజ్బొల్లా కూడా నిర్ధారించింది. ఈ దాడిలో అతని కుమార్తె జైనబ్ నస్రల్లా కూడా మృతి చెందినట్టు సమాచారం. కొన్ని నెలలుగా జరుగుతున్న యుద్ధంలో లెబనాన్‌కు ఇది దారుణమైన దెబ్బ అని విశ్లేషకులు వ్యాఖ్యానించారు. నస్రల్లా అంతంతో తమ లక్ష్యం పూర్తి కాలేదని, మరిన్ని దాడులు కొనసాగుతాయని ఇజ్రాయెల్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ హెర్జీ హలేవి తెలిపారు.

నస్రల్లా మార్గాన్ని కొనసాగిస్తాం

నస్రల్లా మరణం తమ నిరోధక బలాన్ని మరింత పెంచుతుందని హమాస్ ప్రకటించింది. నస్రల్లా మార్గాన్ని కొనసాగిస్తామని ఇరాన్ ప్రకటించింది. నస్రల్లాను చంపడాన్ని నిరసిస్తూ ఇరాన్‌లో నిరసనలు పెల్లుబికాయి. వేలాది మంది రాజధాని టెహ్రాన్‌తో పాటు దేశవ్యాప్తంగా నస్రల్లా చిత్రాలు, పాలస్తీనా, హెజ్బొల్లా జెండాలు చేతపట్టి ప్రదర్శనలు నిర్వహించారు.

ఎవరీ హసన్ నస్రల్లా?



లెబనాన్-ఇజ్రాయెల్ మధ్య ప్రస్తుతం జరుగుతున్న సంఘర్షణలో హసన్ నస్రల్లా కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా సిరియన్ అంతర్యుద్ధంలో హెజ్బొల్లా తరపున పోరాటం జరిపి అధ్యక్షుడు బషర్ అస్సద్ స్థానాన్ని బలీయం చేయడానికి సహాయం చేశాడు. ఇరాన్‌తో పాటు హమాస్ వంటి సంస్థల నేతలతో మంచి సంబంధాలు ఏర్పాటు చేసుకుని హెజ్బొల్లాను ఇజ్రాయెల్‌కు ప్రధాన ప్రత్యర్థిగా తయారు చేశాడు. బీరుట్‌లోని పేద కుటుంబంలో 1960లో జన్మించిన నస్రల్లా 16 ఏండ్లకే షియా రాజకీయ, పారా మిలటరీ గ్రూప్‌లో చేరారు. ఆ తర్వాత హెజ్బొల్లా తీవ్రవాద సంస్థలో కీలక పాత్ర పోషించారు. 1992లో అప్పటి హెజ్బొల్లా అధ్యక్షుడి హత్య తర్వాత ఆ స్థానాన్ని చేజిక్కించుకున్నాడు. 34 రోజుల పాటు ఇజ్రాయెల్‌తో జరిగిన ఘర్షణ తర్వాత ఆ దేశాన్ని అడ్డుకోవడంలో సఫలీకృతుడు కావడంతో అరబ్ దేశాల్లోనూ అతడి పరపతి మరింత పెరిగింది. 2011లో సిరియాతో జరిగిన అంతర్యుద్ధంలో హెజ్బొల్లా దళాలు బషర్ అల్-అసద్ దళాలతో చేతులు కలిపాయి. ఈ చర్య అరబ్ దేశాల్లో అతడి కీర్తిని తగ్గించినప్పటికీ, ఇరాన్‌తో మాత్రం సంబంధాలు పటిష్టం చేశాయి.

జమ్ము కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్లు

- ఇద్దరు ఉగ్రవాదుల హతం
- ఒక హెడ్ కానిస్టేబుల్ మృతి

శ్రీనగర్, సెప్టెంబర్ 28: జమ్ము కశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో శనివారం భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. అదిగాం అనే గ్రామంలో ఉగ్రవాదులు, భద్రతా బలగాలకు మధ్య భీకర కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. కుల్గాం అడిషనల్ ఎస్పీ, ముగ్గురు రాష్ట్రీయ రైఫిల్స్ సిపాయిలు, ఒక ట్రాఫిక్ పోలీస్ గాయపడ్డారు. కథువా జిల్లాలోని కోగ్-మండ్లి గ్రామంలో జరిగినమరో ఎన్‌కౌంటర్ లో ఒక హెడ్ కానిస్టేబుల్ మరణించగా, మరో ఏఎస్సై గాయపడ్డారు. ఎన్‌కౌంటర్ కొనసాగుతున్నట్టు అధికారులు తెలిపారు.

ముంబైలో హై అలర్ట్

ఉగ్ర దాడులకు అవకాశం ఉందన్న ఐబీ

ముంబై, సెప్టెంబర్ 28: పండుగలు, అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ముంబైలో ఉగ్రవాద దాడులకు అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ బ్యూరో హెచ్చరించింది. దీంతో నగర పోలీసులు అప్రమత్తమయ్యారు. రద్దీ ప్రదేశాలు, ఎక్కువ ప్రజలు వచ్చే ప్రార్థనా స్థలాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. బాంబ్ స్క్వాడ్‌తో నగరాన్ని జల్లెడ పడుతున్నారు. నగరంలోని డీసీపీలు స్వయంగా వారి పరిధుల్లో భద్రతను పర్యవేక్షిస్తున్నారు. క్రాఫోర్డ్ మార్కెట్‌తో పాటు పలు కీలక ప్రాంతాల్లో పోలీసులు సెక్యూరిటీ డ్రిల్ నిర్వహించారు.

అజ్మీర్ దర్గా ఓ శివాలయం!

హిందూ సేన పిటిషన్‌తో రాజస్థాన్‌లో దుమారం

జైపూర్: రాజస్థాన్‌లోని అజ్మీర్ షరీఫ్ దర్గాను శివాలయంగా ప్రకటించాలని హిందూ సేన జాతీయ అధ్యక్షుడు విష్ణు గుప్తా అజ్మీర్ కోర్టులో పిటిషన్ వేశారు. సంకట మోచన శివాలయంపై ఈ దర్గాను నిర్మించారని, ఏఎస్ఐ చేత సర్వే చేయించాలని కోరారు. దర్గా లోపల పూజలు చేసుకోవడానికి హిందువులకు అవకాశం కల్పించాలని కోరారు. కాంగ్రెస్ నేత ప్రతాప్ సింగ్ ఈ పిటిషన్‌పై స్పందిస్తూ, రాజస్థాన్‌లో 11 లోక్ సభ స్థానాలను కోల్పోయిన తర్వాత అజ్మీర్ దర్గాపై బీజేపీ వివాదం సృష్టిస్తున్నదని ఆరోపించారు. ఎంఐఎం అధినేత ఒవైసీ స్పందిస్తూ.. దీనిపై మైనారిటీ శాఖ స్పందన తెలపాలని కేంద్ర మంత్రి రిజుజును కోరారు.

తమిళనాడు డిప్యూటీ సీఎంగా ఉదయనిధి

బాలాజీకి మళ్లీ మంత్రి పదవి

చెన్నై: తమిళనాడు సీఎం స్టాలిన్ తన మంత్రి వర్గంలో మార్పులు, చేర్పులు చేశారు. తన కుమారుడు, క్రీడల శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్‌ను ఉపముఖ్యమంత్రిగా నియమించారు. ఈడీ కేసులో జైలుకు వెళ్లొచ్చిన సెంథిల్ బాలాజీతో పాటు మరో ముగ్గురిని మంత్రి వర్గంలోకి తీసుకొని, మరో ముగ్గురిని తప్పించారు.

ఉగ్రవాద పర్యవసానాలు ఎదుర్కోవాల్సిందే

ఐరాసలో పాక్‌కు భారత్ హెచ్చరిక

న్యూఢిల్లీ: ఐక్యరాజ్య సమితి సాధారణ సభ వేదికగా పాకిస్థాన్‌ను భారత్ హెచ్చరించింది. ఉగ్రవాద పర్యవసానాలను ఎదుర్కోవాల్సిందే నంటూ ఆ దేశానికి చెప్పింది. పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ జమ్ము కశ్మీర్ అంశాన్ని లేవనెత్తిన తర్వాత ఐరాసలోని భారత దేశ ఫస్ట్ సెక్రెటరీ భవిక మంగళనందన్ ఘాటుగా జవాబు చెప్పారు. అంతర్జాతీయ ఉగ్రవాదంలో పాకిస్థాన్ ప్రమేయం ఉందని మండిపడ్డారు. క్రాస్ బోర్డర్ టెర్రరిజంను ప్రభుత్వ విధానంగా చేసుకున్న సుదీర్ఘ చరిత్ర పాక్‌కు ఉందన్నారు.

బాస్మతియేతర బియ్యానికి ఎగుమతి సుంకం మినహాయింపు

న్యూఢిల్లీ: ఎగుమతుల సుంకం నుంచి బాస్మతియేతర తెల్ల బియ్యానికి మినహాయింపు ఇస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. అలాగే పారా బాయిల్డ్ రైస్‌పై లెవీని 10 శాతం తగ్గించింది. బ్రౌన్ రైస్, ధాన్యం ఎగుమతులపైనా ఎగుమతి సుంకాన్ని 10 శాతం తగ్గించింది. ఇప్పటివరకు వివిధ రకాల బియ్యం ఎగుమతులపై ఎగుమతి సుంకం 20 శాతంగా ఉంది.

నిబంధనలకు విరుద్ధంగా ఖర్గే ట్రస్టుకు స్థలం

లోకాయుక్తకు ఫిర్యాదు చేసిన బీజేపీ నేత

బెంగళూరు, సెప్టెంబర్ 28: కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుటుంబానికి చెందిన సిద్ధార్థ విహార్ ట్రస్ట్ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం నుంచి రెండుసార్లు స్థలాలు పొందిందని బీజేపీ నేత ఎన్ఆర్ నరేశ్ ఆరోపించారు. యెడియూరప్ప ముఖ్యమంత్రిగా ఉండగా 2010లో బెంగళూర్ డెవలప్‌మెంట్ అథారిటీ (బీడీఏ) ఆయన ట్రస్ట్‌కు 8,125 చదరపు మీటర్ల స్థలాన్ని కేటాయించిందని, అనంతరం 2024 మేలో కాంగ్రెస్ సర్కారు కర్ణాటక ఇండస్ట్రీస్ ఏరియాస్ డెవలప్‌మెంట్ బోర్డు (కేఐఏడీబీ) నుంచి సివిల్ ఎమినిటీస్ (సీఏ) సైట్ ఐదు ఎకరాలు కేటాయించిందని ఆయన లోకాయుక్తకు దాఖలు చేసిన ఫిర్యాదులో ఆరోపించారు. మొదటిసారి తనకు కేటాయించిన స్థలం సమాచారాన్ని ఆయన దాచిపెట్టారని తెలిపారు. కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఖర్గే తన రాజకీయ బలాన్ని ఉపయోగించి రెండో స్థలాన్ని చేజిక్కించుకున్నారని రమేశ్ తెలిపారు.

మణిపూర్‌లో భారీగా ఆయుధాల స్వాధీనం

ఇంఫాల్: మణిపూర్‌లోని మూడు జిల్లాల్లో భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. పోలీసులు శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం కంగ్‌పోక్పి జిల్లా, లోయిచింగ్ రిడ్జ్‌లో రాష్ట్ర పోలీసులు, అస్సాం రైఫిల్స్ సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో రెండు 303 రైఫిళ్లు, ఒక 9 ఎంఎం పిస్తోలు, మ్యాగజైన్, కార్ట్రిడ్జెస్; నాలుగు గ్రెనేడ్లు, రెండు డిటొనేటర్లు, దేశవాళీ మోర్టార్, లాంగ్ రేంజ్ ఇంప్రొవైజ్డ్ మోర్టార్‌లను స్వాధీనం చేసుకున్నారు. చురచాంద్‌పూర్ జిల్లా, గోథోల్ గ్రామంలో చేసిన తనిఖీల్లో రెండు ఇంప్రొవైజ్డ్ మోర్టార్లను స్వాధీనం చేసుకున్నారు. తౌబాల్ జిల్లాలో జరిగిన సోదాల్లో 4 హెచ్ఈ-36 హ్యాండ్ గ్రెనేడ్లు, 2 పుంపి షెల్స్, 3 డిటొనేటర్లు, ఒక స్టన్ గ్రెనేడ్, స్టింగర్ గ్రెనేడ్, బాష్పవాయు గోళాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎవరినీ అరెస్ట్ చేయలేదు.

రూల్స్ కఠినం.. మనుగడ క్లిష్టం

- భారతీయులకు ఇబ్బందికరంగా హెచ్-1బీ నిబంధనలు
- టెక్ ఇండస్ట్రీ లే ఆఫ్‌ల సమస్యకు తోడైన కొత్త సవాళ్లు



న్యూఢిల్లీ: వీసా నిబంధనలను అమెరికా కఠినతరం చేయడంతో ఆ దేశంపై ఆశలు పెట్టుకున్న భారతీయులకు ఇబ్బందికర వాతావరణం ఏర్పడింది. ఇప్పటికే అమెరికన్ టెక్ ఇండస్ట్రీ లే ఆఫ్‌ల ప్రభంజనంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. ఈ పరిణామాలు ఇండియన్ వర్కర్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా హెచ్-1బీ వీసాలు ఉన్నవారి పరిస్థితి వర్ణనాతీతం. ఈ ధోరణితోపాటు కఠినమైన వీసా నిబంధనలను ప్రవేశపెట్టడం, దరఖాస్తు ధరను విపరీతంగా పెంచేయడం వల్ల అమెరికాలోని భారతీయ వలసదారులు, అంతర్జాతీయ విద్యార్థులు, నైపుణ్యం గల కార్మికులకు ప్రతికూల వాతావరణం ఏర్పడింది. ఇటీవల దాదాపు 438 టెక్ కంపెనీలు సుమారు 1,37,500 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికాయి. దీంతో ఆర్థిక ఒడిదొడుకులను తట్టుకుని నిలిచే కోట అని టెక్ రంగంపై గతంలో ఉన్న భావం చెదిరిపోతున్నది. ఉద్యోగాల కొరత వల్ల హెచ్-1బీ వీసాదారులపై విపరీతమైన ఒత్తిడి ఉంది. వీరు నిర్దిష్ట సమయంలో కొత్త ఉద్యోగాన్ని సంపాదించుకోగలగాలి లేదంటే, అమెరికాను విడిచిపెట్టి వెళ్లిపోవాల్సి ఉంటుంది.

భారీగా పెరిగిన దరఖాస్తు రుసుములు

అమెరికా వీసా విధానాల్లో ఇటీవల వచ్చిన మార్పులు ఇండియన్ వర్కర్ల పరిస్థితిని మరింత సంక్లిష్టం చేశాయి. అమెరికన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ విడుదల చేసిన 2024 అక్టోబర్ వీసా బులెటిన్ రానున్న ఆర్థిక సంవత్సరానికి అందుబాటులో ఉండే ఇమిగ్రెంట్ వీసాల సమాచారాన్ని వెల్లడించింది. ఇది ఈబీ-5 ఇన్వెస్టర్ వీసా ప్రోగ్రామ్ సహా వివిధ వీసా క్యాటగిరీల్లోని దరఖాస్తుదారులకు ఆందోళనను రేకెత్తించింది. కొన్ని రంగాల్లో చెప్పుకోదగ్గ స్థాయిలో పెట్టుబడి పెట్టినవారు రెసిడెన్సీ పొందేందుకు ఇన్వెస్టర్ వీసా అవకాశం కల్పిస్తుంది. కానీ చైనా, భారత్ నుంచి వచ్చే దరఖాస్తులకు ఈ అవకాశాలు అందడంలో విపరీతమైన జాప్యం జరుగుతున్నది. హెచ్-1బీ వీసా దరఖాస్తు రుసుము ఒక లబ్ధిదారుకు 10 డాలర్ల నుంచి 215 డాలర్లకు పెరిగింది. అంటే 2,150 శాతం పెరిగిందన్న మాట! పేపర్ ఫైలింగ్ రుసుము 460 డాలర్ల నుంచి 780 డాలర్లకు పెరిగింది. ఓ వైపు ఉద్యోగాల పరిస్థితి అనిశ్చితంగా ఉండగా, ఇంత భారీగా రుసుములు పెరగడం దరఖాస్తుదారులకు గుదిబండగా మారింది. గ్రీన్‌కార్డ్ దరఖాస్తుదారులకు కూడా నిబంధనలు మారాయి. ఐ-30 పిటిషన్ పేపర్ సబ్‌మిషన్‌కు రుసుము 675 డాలర్లకు, ఆన్‌లైన్‌లో దాఖలు చేస్తే వసూలు చేసే రుసుము 625 డాలర్లకు పెరిగింది, అసైలమ్ పిటిషన్‌లకు కొత్తగా 600 డాలర్ల ఫీజును నిర్ణయించారు. ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ ఎఫ్, ఎం, జే వీసాల కోసం దరఖాస్తు చేస్తే, పాస్‌పోర్టులకు సంబంధించి అదనపు తనిఖీలను ఎదుర్కోవాల్సి వస్తున్నది.

ఉచితాలతో ఓట్ల వేట

- హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ హామీల వర్షం
- కర్ణాటక, తెలంగాణలో అవే తరహా హామీల అమలుకు ఆపసోపాలు..అప్పుల వేటలు

చండీగఢ్: ప్రజలను ఆకర్షించి ఓట్లు వేయించుకోవడమే లక్ష్యంగా హామీలు ఇచ్చే విధానాన్ని కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తున్నది. కర్ణాటకలో ఐదు గ్యారెంటీల పేరుతో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఆరు గ్యారెంటీలు ఇచ్చి విజయం సాధించింది. ఇప్పుడు హర్యానాలో మరో అడుగు ముందుకేసి ఏడు గ్యారెంటీలను ప్రకటించింది. కర్ణాటకలో ఇటీవల లోక్‌సభ ఎన్నికల వేళ ఐదు గ్యారెంటీల అమలు ప్రారంభించిన కాంగ్రెస్ సర్కారు ఇప్పుడు వాటికి నిధులు ఎలా సమీకరించాలో తెలియక నానాపాట్లు పడుతున్నది. గ్యారెంటీలు ఎత్తేయాలని ఆ పార్టీ నేతలే డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఒకటీ రెండు గ్యారెంటీల మినహా మిగతా వాటి ఊసే ఎత్తడం లేదు. ఈ రెండు రాష్ట్రాలకు గ్యారెంటీలు భారంగా మారినా, ఇవి అమలు చేయడం కష్టమని తెలిసినా హర్యానాలో మరిన్ని ఎక్కువ హామీలను ప్రకటించింది. అక్టోబరు 5న జరగనున్న హర్యానా అసెంబ్లీ ఎన్నికల కోసం ఇప్పటికే ఏడు గ్యారెంటీలను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ శనివారం పూర్తి స్థాయి మ్యానిఫెస్టో ప్రకటించింది. ఇందులో భారీగా హామీలు గుప్పించింది.



ప్రధాన హామీలివే..

ఏడు గ్యారెంటీలు, మేనిఫెస్టోలో కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చింది. ప్రతి కుటుంబానికి నెలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్తు, రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం, 18-60 ఏండ్ల మధ్య వయసు మహిళలకు నెలకు రూ.2 వేల ఆర్థిక సాయం, రూ.500కే గ్యాస్ సిలిండర్లు, పేద కుటుంబాలకు 200 గజాల స్థలంలో రెండు గదుల ఇల్లు, యువతకు 2 లక్షల శాశ్వత ఉద్యోగాలు, పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత, కులగణన, పాత పింఛన్ విధానం అమలు వంటివి కాంగ్రెస్ హామీల్లో ప్రధానమైవి.



సీసీటీవీ నిఘాలో సీబీఎస్‌ఈ పరీక్షలు


2025 నుంచి అమలు

న్యూఢిల్లీ: సీబీఎస్‌ఈ నిర్వహించే పదో తరగతి, పన్నెండో తరగతి బోర్డ్ పరీక్షలు సీసీటీవీ నిఘాలో జరగబోతున్నాయి. ఈ పరీక్షా కేంద్రాలన్నిటిలోనూ సీసీటీవీలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, 2025 వార్షిక బోర్డ్ పరీక్షల నుంచే సీసీటీవీ నిఘాలో పరీక్షలు జరపాలని సీబీఎస్‌ఈ ఆదేశించింది. పర్యవేక్షణను పటిష్టపరచడం, పరీక్షలను సజావుగా, స్వేచ్ఛగా నిర్వహించడం, అనుచిత పద్ధతులను నిరోధించడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాదిలో దేశవ్యాప్తంగా, 26 ఇతర దేశాల్లో జరిగే బోర్డు పరీక్షలకు సుమారు 44 లక్షల మంది హాజరవుతారు. ఈ పరీక్షలకు సీసీటీవీ సదుపాయం లేని పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా పరిగణించబోమని సీబీఎస్‌ఈ స్పష్టం చేసింది. సీసీటీవీ ఫుటేజ్ రహస్యంగా ఉంటుందని తెలిపింది.

సీఎంగా సిద్ధూ లేకున్నా సర్కార్ నడుస్తుంది

బీజేపీ ఉద్దేశం కాంగ్రెస్‌ను దెబ్బ తీయడమే: ఖర్గే

బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి పదవిలో సిద్ధరామయ్య ఉన్నా, లేకున్నా కాంగ్రెస్ (ప్రభుత్వం) కొనసాగుతుందని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) కేసులో సిద్ధూ తన పదవికి రాజీనామా చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ కేసులో సిద్ధూపై ఆరోపణలు ఇప్పటి వరకు రుజువు కాలేదన్నారు. గోద్రా సంఘటన జరిగినపుడు గుజరాత్ సీఎం పదవికి నరేంద్ర మోదీ రాజీనామా చేశారా? అని ప్రశ్నించారు. అదే సమయంలో అమిత్ షాపై అనేక కేసులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. పరువు, ప్రతిష్ఠలను దెబ్బ తీయడం కోసం ఓ వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయవద్దని హితవు పలికారు. వారి (బీజేపీ) ఉద్దేశం కాంగ్రెస్‌ను దెబ్బ తీయడమే కానీ, ఓ వ్యక్తి కాదని చెప్పారు. కేవలం కాంగ్రెస్‌ను నాశనం చేయడం కోసం, దాని ఓటు



బ్యాంకును దెబ్బ తీయడం కోసం బీజేపీ కుట్ర పన్నిందని ఆరోపించారు. చట్టాన్ని తన పనిని తాను చేయనివ్వండన్నారు. సమయం వచ్చినపుడు తాము పరిశీలిస్తామన్నారు. ఇప్పటి వరకు సిద్ధరామయ్యకు వ్యతిరేకంగా ఏమీ లేదని చెప్పారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కొందరు పారిశ్రామికవేత్తలు చెల్లించాల్సిన రూ.16 లక్షల కోట్ల రుణాలను రద్దు చేసిందని, దానితో పోల్చితే ముడా కుంభకోణం చాలా చిన్న విషయమని చెప్పారు.సిద్ధరామయ్య పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్నందువల్ల ఆయనకు తాము అండగా ఉంటామని తెలిపారు.

అక్కడ ధర్నా చేస్తున్నది రైతులు కాదు

కేంద్ర మంత్రి ఖట్టర్ వివాదాస్పద వ్యాఖ్యలు

ఢిల్లీ, సెప్టెంబర్ 28: పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన గ్యారెంటీ కల్పించాలని డిమాండ్ చేస్తూ హర్యానా, పంజాబ్, ఢిల్లీ సరిహద్దుల వద్ద ఆందోళన చేస్తున్న రైతులపై కేంద్ర మంత్రి, హర్యానా మాజీ సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వారు రైతులే కాదని, పంజాబ్ నుంచి కొందరు అన్నదాతల ముసుగులో వచ్చి ఆందోళన ప్రారంభించారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంతోపాటు హర్యానా ప్రభుత్వాన్ని కూల్చడమే వారి లక్ష్యమని చెప్పారు. ఈ వ్యాఖ్యలపై పంజాబ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అమరీందర్‌సింగ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. హర్యానా సీఎంగా ఖట్టర్ ఉన్నంత వరకు అక్కడ బీజేపీకి ఒక్క సీటు కూడా రాదని అర్థమైందని, అందుకే ఆయనను సీఎం పదవి నుంచి తొలగించిందని ఎద్దేవా చేశారు.



అమెరికాలో 'హెలెనా' బీభత్సం

52 మంది మృతి

న్యూఢిల్లీ: అత్యంత శక్తిమంతమైన క్యాటగిరీ-4 హరికేన్ 'హెలెనా' అమెరికాలో బీభత్సం సృష్టిస్తున్నది. తుఫాను కారణంగా సౌత్ కరోలినా, జార్జియా, ఫ్లోరిడా, నార్త్ కరోలినా, వర్జీనీయా రాష్ట్రాల్లో 52 మంది ప్రాణాలు కోల్పోయారు. వందలాది మంది వరదల్లో చిక్కుకున్నారు. గంటకు 140 మైళ్ల వేగంతో వీస్తున్న గాలులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. హరికేన్ గురువారం రాత్రి తొలుత ఫ్లోరిడాలోని బిగ్‌బెండ్ ప్రాంతాన్ని తాకింది. ఆ తర్వాత పలు రాష్ట్రాల్లో విధ్వంసం సృష్టించింది. వేలాదిమంది సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లారు. ఐదు రాష్ట్రాల్లోని 3.5 మిలియన్ల మంది ప్రజలు చీకట్లోనే మగ్గుతున్నారు. టెన్నెస్సీలోని ఓ దవాఖానను వరదలు ముంచెత్తడంతో 54 మందిని అధికారులు రక్షించారు.

ఒక్క మ్యాచ్‌కు 7.5 లక్షలు

ఐపీఎల్‌లో ప్లేయర్లపై కాసుల వర్షం!

బెంగళూరు: రానున్న ఐపీఎల్ సీజన్‌లో ప్లేయర్లపై కనకవర్షం కురిసే అవకాశం కనిపిస్తున్నది. ప్రపంచంలోనే అత్యంత ధనిక లీగ్‌గా పేరొందిన ఐపీఎల్‌లో ప్లేయర్లకు మరింత ఆర్థిక లబ్ధి జరిగేలా నిర్వాహకులు ప్రణాళికలు రచిస్తున్నారు. ఆదివారం బీసీసీఐ ఏజీఎమ్‌తో పాటు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ భేటీ జరుగనుంది. ఇందులో పలు కీలకమైన నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా వేలంలో ఒక్కో జట్టు ఎక్కువలో ఎక్కువ ఆరుగురు ప్లేయర్లను అట్టిపెట్టుకోవడంతో పాటు రైట్ టు మ్యాచ్ కార్డ్ ప్రయోగించే చాన్స్ ఇవ్వనున్నారు. దీనికి తోడు లీగ్‌లో ఒక్కో మ్యాచ్‌కు రూ.7.5లక్షలు, మొత్తం మ్యాచ్‌లు ఆడితే 1.05 కోట్లు దక్కుతాయని బీసీసీఐ కార్యదర్శి జై షా ట్వీట్ చేశారు. అదనంగా ఒక్కో ఫ్రాంచైజీ 12.60 కోట్లు మ్యాచ్ ఫీజుగా కేటాయించనున్నారు.



ప్రభాత్ (6/42)

భారీ గెలుపు చేరువలో లంక

గాలె: న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో శ్రీలంక భారీ విజయంపై కన్నేసింది. సమిష్టి ప్రదర్శనతో అదరగొడుతున్న లంక.. కివీస్‌కు చుక్కలు చూపిస్తున్నది. ఓవర్‌నైట్ స్కోరు 22/2 శనివారం తొలి ఇన్నింగ్స్‌కు దిగిన కివీస్..లెఫ్టార్మ్ స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య (6/42) ధాటికి 88 పరుగులకే కుప్పకూలింది. లంకపై టెస్టుల్లో కివీస్‌కు ఇదే అత్యల్ప తొలి ఇన్నింగ్స్‌గా రికార్డయ్యింది. సాంట్నర్ (29) టాప్‌స్కోరర్‌గా నిలువగా, మిగతా బ్యాటర్లు స్వల్ప స్కోర్లకు పరిమితమయ్యారు. ఆ తర్వాత ఫాలోఆన్‌కు దిగిన కివీస్ ఆట ముగిసే సరికి 5 వికెట్లకు 199 పరుగులు చేసింది. కాన్వే (61) అర్ధసెంచరీతో ఆకట్టుకోగా, విలియమ్సన్ (46), బ్లండెల్(47 నాటౌట్) రాణించారు. ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవడానికి 315 పరుగుల దూరంలో ఉంది.

రెండో రోజు రద్దు

- భారత్, బంగ్లా టెస్టుకు వర్షం అడ్డంకి
- ఒక్క బంతీ పడని వైనం
- ఇండోర్ ప్రాక్టీస్‌లో ప్లేయర్లు

కాన్పూర్: భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టును వరుణుడు నీడలా వెంటాడుతున్నది. దాదాపు మూడేండ్ల తర్వాత జరుగుతున్న మ్యాచ్‌ను ఆస్వాదిద్దామనుకున్న ప్రేక్షకుల ఆశలపై నీళ్లు గుమ్మరిస్తున్నాడు. ముందే ఊహించినట్లు, వాతావరణ శాఖ అంచనాల ప్రకారం తొలి రోజే మ్యాచ్‌కు అంతరాయం కల్గిన వర్షం రెండో రోజు ఆటను పూర్తిగా తుడిచిపెట్టింది. రాత్రి నుంచి కురిసిన ఎడతెరిపిలేని వర్షానికి మైదానం మొత్తం చిత్తడిగా మారిపోయింది. ఉదయం 11.15 నిమిషాలకు కొంత తెరిపినిచ్చినా..గ్రౌండ్స్‌మెన్ మూడు సూపర్ సాపర్లతో మైదానాన్ని సిద్ధం చేసేందుకు ప్రయత్నించినా వెలుతురు సరిగ్గా లేకపోవడంతో ఆట సాధ్యపడలేదు. పరిస్థితులు ఆటకు అనుకూలంగా లేకపోవడంతో మైదానాన్ని పరిశీలించిన అంపైర్లు మధ్యాహ్నం 2.15గంటలకు ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. వాతావరణ రిపోర్టుల ప్రకారం ఆదివారం కూడా వర్షం కొనసాలగే అవకాశాలు కనిపిస్తుండగా, సోమ, మంగళవారాలు కొంత తెరిపినిచ్చే చాన్స్ ఉంది. దీంతో మ్యాచ్ దాదాపు డ్రా అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారత్‌కు టాస్ చేజార్చుకున్న బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లు కోల్పోయి 107 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే వర్షం కారణంగా టీమ్‌ఇండియా ప్లేయర్లు ఇండోర్‌లో ప్రాక్టీస్ చేశారు. బ్యాచ్‌లుగా విడిపోయి సరదాగా ఫుట్‌బాల్ ఆడారు.



నితీశ్‌కు చాన్స్

యూపీ పేసర్ మయాంక్‌కు బెర్తు • బంగ్లాతో టీ20 సిరీస్‌కు జట్టు ఎంపిక



భారత జట్టులోకి తెలుగు క్రికెటర్



మయాంక్

న్యూఢిల్లీ: భారత్ టీ20 జట్టులోకి తెలుగు యువ క్రికెటర్ నితీశ్‌కుమార్‌రెడ్డి దూసుకొచ్చాడు. గత ఐపీఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మెరుపులు మెరిపించిన నితీశ్‌కు సీనియర్ సెలెక్టర్లు మరోమారు అవకాశమిచ్చారు. బంగ్లాదేశ్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం శనివారం ఎంపిక చేసిన టీమ్‌ఇండియాలో నితీశ్ చోటు దక్కించుకున్నాడు. వాస్తవానికి టీ20 ప్రపంచకప్ ముగిసిన వెంటనే జరిగిన జింబాబ్వే పర్యటనకు నితీశ్ ఎంపికైనా..గాయం కారణంగా దూరం కావాల్సి వచ్చింది. ఇదిలా ఉంటే సూర్యకుమార్‌యాదవ్ నేతృత్వంలో బరిలోకి దిగనున్న భారత జట్టులోకి ఐపీఎల్ యువ సంచలనం, యూపీ స్పీడ్‌స్టర్ మయాంక్ యాదవ్ బెర్తు దక్కించుకున్నాడు. ఐపీఎల్‌లో లక్నో సూపర్‌జెయింట్స్ తరపున ఆడిన మయాంక్ నిలకడగా గంటకు 150కి.మీల వేగంతో బంతులు వేసి ప్రత్యర్థి బ్యాటర్ల వెన్నులో వణుకు పుట్టించాడు. అయితే లీగ్ మధ్యలోనే మయాంక్‌కు గాయం కావడంతో జాతీయ జట్టుకు ఎంపిక కాలేకపోయాడు. ఇన్ని రోజులు జాతీయ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ)లో పునరావాసం పొందిన మయాంక్ సెలెక్టర్ల నమ్మకాన్ని చూరగొన్నాడు. అభిషేక్‌శర్మ, రింకూ సింగ్, రియాన్ పరాగ్, శివమ్‌దూబే, సుందర్, బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి, జితేశ్‌శర్మ తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గ్వాలియర్, ఢిల్లీ, హైదరాబాద్ వేదికలుగా బంగ్లాతో భారత్ తలపడనుంది.

జట్టు వివరాలు: సూర్యకుమార్‌యాదవ్(కెప్టెన్), అభిషేక్, శాంసన్, రింకూసింగ్, హార్దిక్ పాండ్యా, రియాన్ పరాగ్, నితీశ్‌కుమార్‌రెడ్డి, శివమ్ దూబే, సుందర్, బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి, జితేశ్‌శర్మ, అర్ష్‌దీప్‌సింగ్, హర్షిత్ రానా, మయాంక్ యాదవ్.

బోపన్న జోడీ ఔట్

బీజింగ్: చైనా ఏటీపీ ఓపెన్ టోర్నీలో రోహన్‌బోపన్న, ఇవాన్ డోడిగ్ జోడీ పోరాటం ముగిసింది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న, డోడిగ్ ద్వయం 5-7, 6-7తో ఫ్రాన్సిస్కో సెరున్‌డోలో, నికోలస్ జారీ ద్వయం చేతిలో ఓటమిపాలైంది. గంటన్నర పాటు సాగిన పోరులో బోపన్న, డోడిగ్‌కు అన్‌సీడెడ్ ప్రత్యర్థి నుంచి ఊహించని రీతిలో ఓటమి ఎదురైంది. ఇదిలా ఉంటే 44 ఏండ్ల బోపన్న ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్, మియామి ఓపెన్ గెలిచిన సంగతి తెలిసిందే.

హోరాహోరీగా బాస్కెట్‌బాల్ టోర్నీ

మాదాపూర్, సెప్టెంబర్ 28: జాతీయ బాస్కెట్‌బాల్ టోర్నీ శనివారం ఘనంగా మొదలైంది. స్థానిక చిరెక్ ఇంటర్నేషనల్ స్కూల్ వేదికగా ఈనెల 28 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరుగనున్న టోర్నీలో 60కి పైగా జట్లు పోటీ పడుతున్నాయి. ఇందులో అండర్-14, అండర్-19 బాలబాలికలు బరిలోకి దిగుతున్నారు. పోటీలకు తొలి రోజు వివిధ విభాగాల్లో హోరాహోరీగా సాగాయి. ఎఫ్ఐబీఏ మాజీ కమిషనర్ నార్మన్ ఇసాక్, భారత ప్లేయర్ పుష్పా సెంథిల్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుష్ప మాట్లాడుతూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని యువ ప్లేయర్లకు దిశానిర్దేశం చేశారు. తమ స్కూల్‌లో చదువుతో పాటు క్రీడలకు తగిన ప్రాధాన్యమిస్తామని ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ సంచిత రాహా పేర్కొన్నారు.



ముషీర్‌ఖాన్‌కు ప్రమాదం

రోడ్డు యాక్సిడెంట్‌లో తీవ్ర గాయాలు • మూడు నెలల పాటు క్రికెట్‌కు దూరం



లక్నో: ముంబై యువ ఆల్‌రౌండర్ ముషీర్‌ఖాన్ తృటిలో పెను ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డాడు. శనివారం తన స్వస్థలం అజంఘర్ నుంచి లక్నోకు కారులో బయల్దేరిన ముషీర్ ఘోర రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్ హైవేపై రోడ్డు డివైడర్‌ను వేగంగా ఢీకొట్టిన ముషీర్ ఖాన్ కారు పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో వాహనం పూర్తిగా నుజ్జునుజ్జు కాగా ముషీర్‌తో పాటు తండ్రి నౌషద్‌ఖాన్ తీవ్ర గాయాల పాలయ్యారు. వెంటనే స్పందించిన స్థానికులు దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ముషీర్ ఆరోగ్య పరిస్థితి స్థిమితంగా ఉందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మేదాంత దవాఖాన ఆర్థోపెడిక్ డైరెక్టర్ ధర్మేంద్రసింగ్ పేర్కొన్నారు. ముషీర్ ఆరోగ్య పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నట్లు బీసీసీఐతో పాటు ముంబై క్రికెట్ అసోసియేషన్(ఎమ్‌సీఏ) ఒక ప్రకటనలో పేర్కొంది. అతను కొద్దిగా కుదురుకున్న తర్వాత ముంబైకి తరలించి మెరుగైన వైద్యం అందిస్తామని తెలిపారు. ఇదిలా ఉంటే రోడ్డు ప్రమాదం కారణంగా త్వరలో జరుగనున్న ఇరానీ కప్‌తో పాటు రంజీ ట్రోఫీలో కొన్ని మ్యాచ్‌లకు ముషీర్ దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.



సింగిల్స్ చాంప్ భవేశ్

జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్(జేబీసీ) 8వ ఎడిషన్‌లో భవేశ్‌రెడ్డి సింగిల్స్ విజేతగా నిలిచాడు. శనివారంతో ముగిసిన టోర్నీలో బాలుర అండర్-13 సింగిల్స్ ఫైనల్లో భవేశ్ 15-13, 15-4తో గోయల్ దర్శ్‌పై అలవోక విజయం సాధించాడు. ఆది నుంచే తనదైన జోరు కనబరిచిన భవేశ్..ప్రత్యర్థిని వరుస గేముల్లో చిత్తుచేశాడు. మిగతా విభాగాల్లో శ్రీరామ్, సానియాశర్మ(అండర్-11), దశరి(అండర్-13), శ్రీహర్ష, మాన్య అగర్వాల్ (అండర్-15), అలీ సిద్ధిఖీ, మాన్య అగర్వాల్(అండర్-17) విజేతలుగా నిలిచారు. రైలు నిలయంలో జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమానికి భారత స్టార్ బ్యాడ్మింటన్ ద్వయం సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్‌శెట్టి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దేశంలోని వివిధ నగరాల్లో ఎక్కువ మంది పిల్లలు పోటీపడ్డ టోర్నీగా జేబీసీ వరుసగా మూడోసారి ప్రపంచ రికార్డు సొంతం చేసుకుందని నిర్వహకులు పేర్కొన్నారు.

గాయత్రి, త్రిసా జోడీకి కాంస్యం



మకావు: మకావు ఓపెన్ సూపర్-300 టోర్నీలో భారత యువ ద్వయం గాయత్రి గోపీచంద్, త్రిసాజాలీకి కాంస్య పతకం దక్కింది. శనివారం జరిగిన మహిళల డబుల్స్ సెమీఫైనల్లో గాయత్రి, త్రిసా జోడీ 17-21, 21-16, 10-21తో చైనీస్‌తైపీ జంట హు పీ షాన్, హంగ్ ఎన్‌జు చేతిలో పోరాడి ఓడింది. మూడోసీడ్‌గా బరిలోకి దిగిన గాయత్రి, త్రిసా.. చైనీస్ జోడీకి దీటైన పోటీనివ్వడంలో విఫలమయ్యారు. తొలి గేమ్‌లో ఒకింత ప్రతిఘటన కనబరిచినా..వీరు రెండో గేమ్ గెలిచి పోటీలోకి వచ్చారు. అయితే నిర్ణయాత్మక మూడో గేమ్‌లో ప్రత్యర్థి నుంచి ఊహించని పరాజయం ఎదురైంది. వీరి నిష్క్రమణతో మకావు ఓపెన్‌లో భారత్ పోరాటం ముగిసింది.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.

నమస్తే తెలంగాణ జిందగీ



హీరో అంటే..
ఒడ్డూపొడుగూ ఉండాలి.
ముక్కూమొహం బాగుండాలి.
నిమ్మపండు మేనిఛాయ మస్ట్.

పొడగరి కాకపోయినా, విశాల నేత్రాలు లేకపోయినా.. రంగుంటే చాలు! ఇదీ హీరోల ఎంపికలో సినీజనాల ఈక్వేషన్! కాస్త రంగు తక్కువ ఉన్నోళ్లు.. అవకాశాల కోసం సినిమా ఆఫీసుల తలుపు తడితే.. 'ముఖం ఎప్పడైనా అద్దంలో చూసుకున్నావా?' డైలాగ్ పరిపాటి. కానీ, ఫెయిర్ కలర్ ఫార్ములా వర్కవుట్ కావడంలేదు. రంగు లేకున్నా.. టాలెంట్ ఉంటే చాలంటున్నారు. కలర్ తక్కువున్నా కాలర్ ఎగరేసుకొని.. సక్సెస్ సాధిస్తున్న నటులు ఎందరో ఉన్నారు.

కలర్ కాదన్నయ్యా.. కటౌట్ చూడు!

యస్.. మడిషన్నాక కాసింత కళాపోషణ ఉండాలి.. లేపోతే.. మనిషికీ గొడ్డుకూ తేడా ఏటుంటాదీ! ఈ డైలాగ్ దశాబ్దాల కాలం ముందు రాసిందే. కానీ, ఇప్పుడు ఇదో ట్రెండింగ్ ఫార్ములాగా నేటి మన తెలుగు సినీ రంగానికి అన్వయించుకోవచ్చు. తమిళనాడులో తలైవా రజనీ ఈ ఫార్ములా ఎప్పుడో ప్రూవ్ చేసి చూపించాడు. తర్వాత ధనుష్ గురించి అయితే ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. నేటి జనరేషన్‌కి ఓ ప్రేరణ. వీరితోపాటు కోలీవుడ్‌లో మరెందరో మాణిక్ బాషాని ఫాలో అయ్యారు. మంచి మాస్ ఫాలోయింగ్‌తో స్టార్‌లుగా ఎదిగారు. ఇప్పుడీ ట్రెండ్ మన టాలీవుడ్‌లోనూ పీక్స్‌కి చేరింది. ఎందుకంటే.. మన కథల్లో ఇప్పుడిప్పుడే రజనీలా నల్ల బంగారాలు మెరుస్తున్నారు. హీరో పక్కన ఫ్రెండ్ క్యారెక్టర్ గానో... మెయిన్ విలన్ పక్కన కామెడీ విలన్ గానో.. పక్కింటి అంకుల్‌ని ఏడిపించే జులాయిగానో.. అయితే పెద్ద విశేషం ఏం ఉంటుంది. హీరోలుగానే మెప్పిస్తున్నారు. హీరోయిన్‌తో డ్యూయెట్ పాడుతున్నారు. అంతేకాదు.. ఈ కుర్రోడు హీరో ఏంట్రా అని మాట్లాడే వాళ్లకి స్ట్రాంగ్ గానే సమాధానాలు ఇస్తున్నాడు. ఇంకొందరు.. సోషల్ మీడియా స్టార్‌లుగా ఎదుగుతున్నారు. వెబ్ సిరీస్‌లు చేస్తూ మిలియన్ల వ్యూస్‌తో ఫ్యాన్ బేస్ పెంచుకుంటున్నారు. ఒకరిని హీరోని చేసేవి ఒడ్డు, పొడుగు, రంగు, రూపం కాదు.. హార్డ్‌వర్క్, సిన్సియారిటీ, టాలెంట్, డిసిప్లిన్ మాత్రమే అని నిరూపిస్తున్నారు.



సునీల్ నుంచి సత్య వరకు..

కామెడీ టైమింగ్ అంటే సునీలే. సౌండ్ చేసినా, చిత్రమైన ఎక్స్‌ప్రెషన్ ఇచ్చినా.. నవ్వులే నవ్వులు. హీరో దోస్తుగా పంచ్‌లు వేసిందీ, మర్యాదరామన్నలా ఫ్యామిలీ ఆడియన్స్‌ని మెప్పించిందీ.. సిక్స్ ప్యాక్స్‌తో ఔరా అనిపించుకుందీ, పుష్పలో ఫైర్ అయిందీ సునీల్ వర్మే. ఇంత నల్లగా ఉన్నాడు.. ఇతణ్ని ఎవరు చూస్తారని అవమానించిన తెలుగు సినీ పరిశ్రమలోనే చెరగని ముద్ర వేశాడు. ఇక ఇప్పుడు అదే బాటలో హీరోగా ఎదుగుతున్నాడు సత్య. జూనియర్ సునీల్ అనిపించుకున్నాడో లేదో.. నాన్ స్టాప్‌గా సినిమా ఆఫర్లు పట్టేస్తున్నాడు. హీరోకి సమానంగా సీన్లు. ఈ బ్లాక్ హార్స్ టైమింగ్‌ని అందుకోవడానికి హీరోలే కష్టపడే పరిస్థితి. అందుకు సాక్ష్యమే 'రంగబలి'. దీంట్లో హీరో నాగశౌర్యతో కలిసి కామెడీ పండించిన విధానం చూస్తే సత్య టైమింగ్ స్టామినా అర్థం అవుతుంది. టీవీ కామెడీషోతో మొదలైన సత్య జర్నీ అసిస్టెంట్ డైరెక్టర్‌గా.. ఆ తర్వాత కమెడియన్‌గా.. ఇప్పుడు హీరోగా కొనసాగుతున్నది. థియేటర్లలో సందడి చేస్తున్న 'మత్తు వదలరా2'లో తన విశ్వరూపం చూపించాడు. అందంతోనో.. ఆహార్యంతోనో కాదు.. తన హావభావాలతో ప్రేక్షకులకు 'చిల్'పిల్ వేశాడు. పంచ్‌లోనే కాకుండా.. తన డ్యాన్స్ మూమెంట్.. ఫైట్‌లు.. సినిమాకి లైఫ్‌గా మార్చేశాడు. ఇంతకంటే ఏం కావాలి.. ఓ నటుణ్ని నియంత్రించేది రంగు కాదని చెప్పడానికి!

హీరో ఫ్రెండు కాదిప్పుడు

అతణ్ని చూస్తే మన పక్కవీధిలో కుర్రాడిలా కనిపిస్తాడు. అతనే సుహాస్. యూట్యూబ్‌తో కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత సిల్వర్ స్క్రీన్ నటుడిగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నాడు. హీరోకి ఫ్రెండుగా.. వీడు మన దోస్తులానే ఉన్నాడే అనిపించుకున్నాడు. పెద్ద ఆలస్యం చేయకుండానే ఓ వైపు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా రాణిస్తూనే మరోవైపు హీరోగా నటించి విజయాలను అందుకున్నాడు. అతని నేచురల్ నటనకు ఆడియెన్స్ బాగా కనెక్ట్ అవుతున్నారు. 'అంబాజీపేట మ్యారేజీ బ్యాండు', 'జనక అయితే కనక' చిత్రాలతో ప్రేక్షకుల మదిని దోచేశాడు. ఇప్పుడు గొర్రెని హీరోగా చేసి భిన్నమైన పాత్రతో థియేటర్లతో సందడి చేస్తున్నాడు. అయినా.. దేవుడిచ్చిన రంగుపై సుహాస్‌కు కామెంట్స్ తప్పలేదు. కానీ.. తనకి తెలిసింది నటించడం. 'కలర్ ఫొటో'తో హీరోగా మారిన సుహాస్ ఇప్పుడు చిన్నసినిమాల బాక్సాఫీస్ ఈక్వేషన్స్‌ను సరిచేసే స్థాయికి ఎదిగాడు.

అప్పట్లో 'ప్రియదర్శి'కీ తప్పలేదు

'నా చావు నేను చస్తా' అనే ఒక్క డైలాగ్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటుడు ప్రియదర్శి. వరుస విజయాలు వరిస్తున్నా.. తన నటనకు రంగు అవరోధంగా మారిందని పలు సందర్భాల్లో చెప్పాడు. మొదట్లో ఇలాంటి అవమానాలెన్నో అనుభవించానని తెలిపాడు. 'ఆడిషన్స్‌కు వెళ్లినప్పుడు నల్లగా, సన్నగా ఉన్నాడు, మొటిమలు ఎక్కువ ఉన్నాయి. హీరో కంటే పొడుగ్గా ఉన్నాడు అనే వాళ్లు. అలా అన్నప్పుడల్లా నన్ను నేను ప్రోత్సహించుకునే వాడిని...' అని ఓ ఇంటర్వ్యూలో గుర్తు చేసుకున్నాడు దర్శి. పెద్ద హీరోలతోనూ కలిసి నవ్వుల్ని పంచుతూ.. ఆరోగ్యకరమైన కామెడీని ఇస్తూ అందరి మనసులో మంచి స్థానాన్ని సంపాదించుకున్నాడు. 'మల్లేశం' సినిమాలో తన అభినయంతో అందరినీ ఆకట్టుకున్నాడు. ఇక బలగం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. షార్ట్ ఫిల్మ్‌లతో మొదలైన తన కెరీర్.. ఇప్పుడు జోష్‌పుల్‌గా సాగుతున్నది.

సుమ కొడుకుకీ తప్పలేదు!!

'కర్రెగా ఉన్నాడా? తెల్లగా ఉన్నాడా' అనేది మ్యాటర్ కాదు. ఇక్కడ టాలెంట్ ముఖ్యం. 'అరే వీడు హీరోనా? వీడేంటి మస్త్ కర్రెగా ఉన్నాడు? హీరో ముఖం కాదు.. వేస్ట్ మెటీరియల్' అని చాలా అన్నారు. నేను ఇలానే పుట్టాను. ఇలానే ఉంటా. ఒక మనిషి సక్సెస్ డిసైడ్ చేసేది నలుపు, తెలుపు, అందం కాదు బ్రదర్. ఆ మనిషి హార్డ్‌వర్క్, టాలెంట్. వాటినే ఇండస్ట్రీ నమ్మేది' ఈ మాటలు అన్నది ఎవరో కాదు. ప్రముఖ యాంకర్ సుమ కనకాల కొడుకు రోషన్. తనపై వచ్చిన కామెంట్స్‌కి చాలా బోల్డుగా స్పందించాడు. 'బబుల్ గమ్' సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన రోషన్ యాక్టర్‌గా మంచి క్రేజ్ సంపాదించుకున్నాడు. తన రెండో సినిమా 'మోగ్లీ'తో ముందుకు వచ్చేస్తున్నాడు. ఎంత పెద్ద సెలెబ్రిటీల పిల్లలకైనా రంగు దెబ్బ తప్పడం లేదు. రోషన్ చెప్పినట్టు టాలెంట్ ఒక్కటే కొలమానం అని అంగీకరించకతప్పదు.


తమిళ్ హీరోలే ప్రేరణ!!

"విజయ్ సేతుపతి సౌత్ ఇండియా విలక్షణ నటులలో ఒకరు. ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా సినిమా ఇండస్ట్రీలోకి వచ్చి సక్సెస్ అయ్యాడు. హీరో అంటే ఇలానే ఉండాలి అనే బౌండరీలు చెరిపేసి.. ఎవరైనా హీరో కావచ్చని రుజువు చేశాడు. విశాల్ సంగతి సరేసరి! కలర్ తక్కువున్నా.. మనోడి కటౌట్ పెద్దదే!! తమిళ సినిమాల్లో కమెడియన్ యోగిబాబు ఇంకా అదుర్స్. రోజుకి రెండు వేలు రెమ్యునరేషన్ తీసుకున్న యోగి కాల్షీట్ కాస్టు ఇప్పుడు రూ.10 లక్షల పైమాటే. ఈ స్టార్ కమెడియన్ సోలో హీరోగా కూడా సినిమాలు చేస్తున్నాడు. యోగిబాబు సినిమాల్లోకి వచ్చి ఎంతో కాలం కాలేదు. ఒకప్పుడు అతని లుక్ చూసి చాలామంది నవ్వేవారట. 'నీ అవతారం అంటూ.. బాడీ షేమింగ్ చేశారు. అయితే దీని గురించి పెద్దగా ఆలోచించలేదు. కామెడీకి బాడీ లాంగ్వేజ్ చాలా ముఖ్యం. నేను దాన్ని వాడుకున్నాను. అంతేకాదు.. నన్ను ప్రోత్సహించిన వారూ ఉన్నారు' అని యోగిబాబు ఓ ఇంటర్వ్యూలో చెప్పాడు. అన్నట్టూ.. ఇంకో విషయం, ప్రభాస్ 'రాజాసాబ్' సినిమాతో యోగిబాబు టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. ఇలా చెబుతూ పోతే తమిళంలో నల్ల బంగారాల లిస్ట్ పెద్దదే!!"

... రాజేశ్ యడ్ల

అమ్మతనాన్ని ఆస్వాదిస్తూ..

సృష్టిలో అందరికన్నా గొప్పది 'అమ్మ'! సాధారణ మహిళలు మొదలుకొని.. సెలెబ్రిటీల వరకూ అమ్మతనాన్ని వరంగా భావించే వాళ్లే! ప్రస్తుతం బాలీవుడ్ బ్యూటీ దీపిక పదుకొణె కూడా.. మాతృత్వపు మధురిమల్లో మునిగితేలుతున్నది. ఈ నెల 8న పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిన దీపికా.. తాజాగా, పిల్లల ఆహారపు అలవాట్లపై ఓ ఫన్నీ వీడియోను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పంచుకున్నది.



'పెద్దలు కూడా చిన్నపిల్లల్లా తింటే!?' అనే శీర్షికతో దీపిక చేసిన పోస్ట్.. నవ్వు తెప్పిస్తున్నది. సోఫాలో పడుకున్న ఒక మహిళ నిద్రలేచి.. భోజనం చేయడానికి వంటగదికి వెళ్లడం.. ప్లేట్ వైపు చూస్తూ, డైనింగ్ టేబుల్ వద్ద గజిబిజిగా తినడానికి ప్రయత్నించడం ఈ వీడియోలో కనిపిస్తుంది. సదరు మహిళ చిన్నపిల్లలా నోరు తెరిచి, తలను ఆడిస్తూ.. చేతిలోని సాండ్‌విచ్‌ను ఒక్కసారి కొరికి వెంటనే నిద్రలోకి జారుకోవడం కాస్త ఫన్నీగా ఉంది. బాలీవుడ్ బ్యూటిఫుల్ కపుల్ దీపిక పదుకొణె – రణవీర్ సింగ్.. ఇటీవల పండంటి ఆడపిల్లకు జన్మనిచ్చారు. సోషల్‌మీడియా వేదికగా తమ సంతోషాన్ని అభిమానులతో పంచుకున్నారు. అప్పటినుంచి ఎలాంటి అప్‌డేట్ ఇవ్వకపోయినా.. దీపిక మాత్రం తన ఇన్‌స్టా బయోను 'ఫీడ్ బర్ప్ స్లీప్ రిపీట్'గా మార్చుకున్నది. అయితే, ప్రస్తుతం సినీ సెలెబ్రిటీల ఇండ్లలో 'నానీ'ల సంస్కృతే నడుస్తున్నది. తమ పిల్లల సంరక్షణ కోసం 'ఖరీదైన నానీ'లను నియమించుకోవడం ఇప్పుడు స్టేటస్ సింబల్‌గానూ మారింది. అయితే, దీపిక మాత్రం తన బిడ్డ కోసం 'నానీ'ని నియమించడం లేదని బీటౌన్‌లో టాక్. తన గారాలపట్టికి కావాల్సిన అన్ని సేవలనూ తానే స్వయంగా అందిస్తుందట. ఈ విషయంలో మరో అందాలతార ఐశ్వర్య రాయ్ బచ్చన్‌ను ఆదర్శంగా తీసుకున్నదట దీపిక.

సెలబ్రిటీలు చేస్తే సెన్సేషనే!

తల్లిదండ్రులు ఎక్కడికి వెళ్లినా పిల్లల్ని వెంటతీసుకెళ్లడం మామూలే! అయితే, ఇదంతా సామాన్యుల విషయంలోనే! సెలెబ్రిటీల దగ్గరికి వచ్చేసరికి మాత్రం.. అది ఓ సెన్సేషన్ అవుతుంది. తాజాగా, అందాల తార ఐశ్వర్యరాయ్, ఆమె కూతురు ఆరాధ్యను పలు వేడుకలకు తీసుకెళ్లడం.. సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. అబుదాబి వేదికగా ఇటీవల జరిగిన ఐఫా–2024 వేడుకలకు ఐశ్వర్య తన కూతురు ఆరాధ్యను వెంట తీసుకెళ్లింది. రెడ్ కార్పెట్‌పై కూతురితో కలిసి ఫొటోలకు ఫోజులిచ్చింది. ఈ సందర్భంగా ఓ విలేకరి 'మీ కూతురు ఆరాధ్య మీవెంటే ఉంటూ ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నది..' అని ఇంకా ఏదో అడగబోతుండగా.. ఐశ్వర్య అసహనం వ్యక్తం చేసింది. 'తను నా కూతురు. ఎప్పుడూ నాతోనే ఉంటుంది!' అంటూ అక్కణ్నుంచి వెళ్లిపోయింది. అయితే.. ఐశ్వర్య చేసిన ఈ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కొందరు నెటిజన్లు వీటిని నెగెటివ్‌గా తీసుకుంటున్నారు. అభిషేక్‌తో ఆమె విడాకులు తీసుకోబోతున్నదనీ.. అందుకే, తన బిడ్డ ఎప్పుడూ తనతోనే ఉంటుందని చెప్పుకొచ్చిందంటూ తెగ ట్వీటుతున్నారు. బచ్చన్ అభిమానులు మాత్రం.. ఆ పోస్టులను పట్టించుకోవాల్సిన అవసరం లేదంటున్నారు. ఇటీవల పారిస్‌లో జరిగిన ఓ ఫ్యాషన్ వేడుకకు సైతం ఐశ్వర్య తన కూతురిని వెంట తీసుకెళ్లిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. దాదాపు నాలుగేండ్ల తర్వాత 'పొన్నియన్ సెల్వన్'తో తెరపై మెరిసింది ఈ అందాల తార. కీలక పాత్రలో నటించి.. అభిమానులను అలరించింది. పార్ట్–2లో అద్భుతమైన పెర్ఫార్మన్స్ ఇచ్చి.. ఉత్తమ నటిగా 2024 ఐఫా అవార్డును అందుకున్నది. కాగా, ప్రేమించి పెళ్లి చేసుకున్న ఐశ్వర్య రాయ్–అభిషేక్ బచ్చన్.. విడాకులు తీసుకోబోతున్నారంటూ కొద్దికాలంగా బీటౌన్‌లో వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ వార్తలపై బచ్చన్ దంపతులు అధికారికంగా స్పందించకపోవడం, తన కూతురు తనతోనే ఉంటుందని ఐశ్వర్య కామెంట్స్ చేయడం బాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.



యానిమల్ మాత్రమే కాదు..



తొలి చిత్రంతోనే తెలుగువారికి చేరువైంది మృణాల్ ఠాకూర్! 'సీతారామం'తో వెండితెరపై మెరిసి.. 'సీత'గా అభిమానుల గుండెల్లో చెరగని ముద్రవేసింది. అందంతోపాటు అద్భుతమైన నటనతో కట్టిపడేసే ఈ మరాఠీ ముద్దుగుమ్మ.. తక్కువ సమయంలోనే ఎక్కువ క్రేజ్‌ను సంపాదించుకున్నది. తాజాగా అబుదాబీలో జరిగిన ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ అవార్డ్స్ (ఐఫా) ఉత్సవ్‌లో పాల్గొన్నది. ఈ సందర్భంగా బాలీవుడ్ స్టార్ రణ్‌బీర్ కపూర్ గురించి మృణాల్ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఇంతకూ మృణాల్ ఏమన్నదంటే.. 'అందరూ యానిమల్ సినిమాలో రణ్‌బీర్ పాత్ర గురించే మాట్లాడుతున్నారు. ఆ పాత్ర ఎంతో క్రూరంగా ఉన్నదని విమర్శిస్తున్నారు. అయితే, 2012లో ఇదే రణ్‌బీర్ 'బర్ఫీ'లో చెవిటి–మూగ వ్యక్తిగా నటించిన విషయాన్ని ఎవరూ మర్చిపోవద్దు. అప్పుడు అమాయకుడిగా.. ఇప్పుడు యానిమల్‌గా రెండు విభిన్న పాత్రలను అద్భుతంగా పండించాడు రణ్‌బీర్..' అంటూ కపూర్‌ల వారసుణ్ని ఆకాశానికి ఎత్తేసింది. బర్ఫీ, యానిమల్ చిత్రాల్లో అద్భుతమైన నటనా కౌశలాన్ని పండించిన రణ్‌బీర్.. రెండు చిత్రాలకూ ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకోవడం విశేషం!

మోక్షం దొరికేనా!?


ద మిస్టరీ ఆఫ్ మోక్ష ఐలాండ్
డిస్నీ+ హాట్ స్టార్ : సెప్టెంబర్ 20
తారాగణం: ఆశుతోష్ రాణా, భాను చందర్, నందు, తేజస్వి తదితరులు
దర్శకత్వం : అనీశ్ కురువిల్లా

టాలీవుడ్ హిస్టరీ తెరిస్తే.. మిస్టరీ సినిమాలు చాలానే కనిపిస్తాయి. అప్పుడెప్పుడో వచ్చిన 'అవే కళ్లు'తో మొదలుపెడితే.. ఈ లిస్ట్‌కు ఎక్కిన 'హిట్' చిత్రాలు ఎన్నో ఉన్నాయి. కొన్ని ఫట్ మనిపించినా.. సగటు ప్రేక్షకుడికి థ్రిల్‌ను మాత్రం పంచాయి. అందుకే, 'థ్రిల్లర్ జానర్' అంటేనే.. 'ఎవర్‌గ్రీన్' అన్నట్టుగా మారింది. ప్రస్తుతం 'డిస్నీ+ హాట్ స్టార్' వేదికగా వచ్చిన 'ద మిస్టరీ ఆఫ్ మోక్ష ఐలాండ్' కూడా అదేబాటలో నడుస్తున్నది. ఎనిమిది ఎపిసోడ్స్‌తో ఈనెల 20న విడుదలై.. రికార్డ్ స్ట్రీమింగ్ సొంతం చేసుకుంటున్నది. కథలోకి వెళ్తే.. విశ్వక్‌సేన్ (ఆశుతోష్ రాణా) ఓ శాస్త్రవేత్త. జనజీవనానికి దూరంగా 'మోక్ష ఐలాండ్'లో ఉంటూ.. పరిశోధనలు చేస్తుంటాడు. రూ. 24వేల కోట్ల ఆస్తిని కూడబెట్టి చనిపోతాడు. తాము విశ్వక్‌సేన్ వారసులమని ఉత్తరాల ద్వారా తెలుసుకున్న కొందరు.. మోక్ష ఐలాండ్‌కు చేరుకుంటారు. వారిలో ఒకరితో ఒకరికి ఎలాంటి సంబంధమూ ఉండదు. అయితే, ఎవరైతే ఆ ఐలాండ్‌లో వారం రోజులు గడుపుతారో.. వారికే తన ఆస్తిని ఇవ్వాలని విశ్వక్‌సేన్ తన వీలునామాలో రాస్తాడు. కానీ, ఐలాండ్ వచ్చినవారిలో ఒక్కొక్కరూ మాయమవుతూ.. ఆ చుట్టుపక్కల శవాలుగా కనిపిస్తుంటారు. ఆ మిస్టరీ హత్యలను చూసి.. మిగిలిన వాళ్లంతా భయపడిపోతారు. అయినా.. ఆస్తి కోసం అక్కడే ఉంటారు. ఇంతకూ ఆ హత్యలు చేస్తున్నది ఎవరు? అందరూ విశ్వక్‌సేన్ వారసులే అయితే, ఒకరి గురించి మరొకరికి ఎందుకు తెలియదు? చివరికి ఆ ద్వీపం నుంచి ఎవరైనా ప్రాణాలతో బయటపడ్డారా? అనేది మిగతా కథ. దర్శకుడు ఓ ఆసక్తికరమైన సబ్జెక్ట్‌ను ఎంచుకొని, అద్భుతంగా తీర్చిదిద్దాడు. ఎంతో స్టడీ చేసి.. మిస్టరీని పకడ్బందీగా మలిచాడు. సిరీస్ మొదటి ఎపిసోడ్ నుంచే ప్రేక్షకులను కథలో లీనం చేస్తుంది. ల్యాగ్‌లు, డ్రామాలు లేకుండా సాగుతూ.. ప్రతి ఒక్కరికీ థ్రిల్‌ను పంచుతుంది.



7 కోట్ల వాచీలు ఎవరెవరికి?

- సింగపూర్ నుంచి 12 వాచీల కొనుగోలు
- కంపెనీ డబ్బు హవాలా రూపంలో చెల్లింపు
- సింగపూర్ నుంచి స్వయంగా వాచీలు తెచ్చిన ముఖ్యనేత
- వాచీలు ఎవరెవరికి ఇచ్చారో ఆరా తీస్తున్న ఈడీ?



ఢిల్లీ, సెప్టెంబర్ 28: పొంగులేటి ఇండ్లు, కార్యాలయాలపై ఈడీ దాడులకు సంబంధించి కొత్త విషయాలు బయటికి వస్తున్నాయి. మొత్తం 12 వాచీలు కొనుగోలు చేసినట్టు ఈడీ గుర్తించిందని ఢిల్లీ వర్గాలు తెలిపాయి. ఒక్కొక్కటి రూ.7 కోట్లు చొప్పున వీటి విలువ రూ.84 కోట్లు. ఈ డబ్బు రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఖాతా నుంచి విజయవాడలోని ఓ వ్యక్తికి బదిలీ చేశారని, అక్కడి నుంచి ఒక హవాలా వ్యాపారి ద్వారా విదేశాలకు చేరాయని ఈడీ గుర్తించినట్టు పేర్కొన్నాయి. ముఖ్యనేత సింగపూర్‌కు వెళ్లినప్పుడు స్వయంగా విమానాశ్రయంలో 12 వాచీలను తీసుకొని తిరిగి వచ్చారని తేలినట్టు వెల్లడించాయి. అయితే ఆ వాచీలను ఎవరికి ఇచ్చారన్నది పెద్ద ప్రశ్నగా మారింది. ఒక వాచీని రాష్ట్రంలో మీడియా హౌస్ ఓనర్‌గా మారిన ఒక జర్నలిస్టుకు ఆఫర్ చేయగా తిరస్కరించారని, దీంతో ఇతరులకు పంపారని గుసగుసలు వినిపిస్తున్నాయి. పన్ను ఎగవేత ద్వారా, హవాలా మార్గంలో తరలించిన డబ్బుతో వాచీలు తేవడం పెద్ద నేరమని చెప్తున్నారు. దీంతో వాటిని ఎవరెవరు తీసుకున్నారనే కోణంలో దర్యాప్తు జరుగుతున్నట్టు ఢిల్లీ వర్గాలు పేర్కొన్నాయి. కంపెనీ నుంచి డబ్బులు బదిలీ చేయడం, హవాలాకు మళ్లించడం వంటివన్నీ ఓ ఆడిటర్ పర్యవేక్షణలో జరిగాయని, అందుకే ఆయనను ఈడీ అధికారులు పిలిపించి, చాలాసేపు ప్రశ్నించినట్టు పేర్కొన్నారు. వాచీలు ఎలా వచ్చాయి? ఎవరికి ఇచ్చారు అనే సమాచారాన్ని ఆ ఆడిటర్ ఈడీ అధికారులకు ఇచ్చినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో వాచీలు అందుకున్న ప్రముఖుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని చెప్తున్నారు.

భోగారంలో అక్రమ మైనింగ్!

- రోడ్డు పనుల కోసం యథేచ్ఛగా మట్టిని తోడేస్తున్న పొంగులేటి బినామీలు
- స్థానికుల ఆరోపణ.. లారీల అడ్డగింత
- ఉన్నతస్థాయి ఒత్తిడితో వదిలేసిన అధికారులు?



లారీల్లో మట్టిని తరలిస్తున్న అక్రమార్కులు

కీసర, సెప్టెంబర్ 28: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండలం భోగారంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బినామీలు అక్రమంగా మైనింగ్‌కు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపించారు. పోలీస్, రెవెన్యూ అధికారుల అండదండలతోనే ఈ వ్యవహారం సాగుతున్నదని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కీసర మండలంలోని భోగారం నుంచి చర్లపల్లి వరకు రోడ్డు పనులను పొంగులేటి కుటుంబ సభ్యులకు చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు అప్పగించినట్టు తెలిసింది. రోడ్డు పనులకు అవసరమైన మట్టిని భోగారంలోని తిరుమల ఇంజినీరింగ్ కళాశాల వెనుక భాగంలోని గుట్టల నుంచి నిబంధనలకు విరుద్ధంగా రాత్రి వేళ లారీల్లో తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మట్టిని తరలించడమే కాకుండా గ్రామంలోని చెరువులు, కుంటలు, కాలనీలోని రోడ్లను ధ్వంసం చేస్తున్నారని మండిపడుతున్నారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న నాలుగు లారీలను ఇదే ప్రాంతంలోని ఎన్ఎఫ్‌సీ ఎంప్లాయిస్ కో-ఆపరేటింగ్ హౌసింగ్ సొసైటీ వారు, కాలనీవాసులు కలిసి అడ్డుకున్నారు. మట్టి అక్రమ తరలింపుపై సొసైటీ అధ్యక్షుడు రూప్‌సింగ్, సెక్రటరీ లక్ష్మణ్‌నాయక్, కోశాధికారి వసంత్‌రావు కీసర సీఐ వెంకటయ్య, తహసీల్దార్ అశోక్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు నాలుగు లారీలు, హిటాచీ, జేసీబీలను స్వాధీనం చేసుకున్నారని, అయితే ఉన్నతాధికారులు, మంత్రుల నుంచి ఫోన్లు రావడంతో వాటిని వదిలేశారని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

లగ్జరీ వాచీ టు మనీ లాండరింగ్!

- పొరుగు రాష్ట్రంలోని ఎలక్ట్రిక్ లిస్టెడ్ కంపెనీ, రాఘవ కన్‌స్ట్రక్షన్స్ మధ్య ఆర్థిక లావాదేవీలు
- ఇరు కంపెనీల భాగస్వామ్యంతో మనీలాండరింగ్
- ఆ ఎలక్ట్రికల్ కంపెనీకి 9 దేశాలతో సంబంధాలు
- ఈడీ దర్యాప్తులో కొత్త కోణాలు



హైదరాబాద్,సెప్టెంబర్28(నమస్తే తెలంగాణ): పొరుగు రాష్ట్రం ప్రధాన కేంద్రంగా ఎలక్ట్రిక్ పవర్ పరికరాల డిజైన్, ట్రాన్స్‌ఫార్మర్లు తయారు చేసే ఒక లిస్టెడ్ కంపెనీకీ, రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు మధ్య జరిగిన లావాదేవీల మీదనే ఈడీ ఫోకస్ చేసినట్టు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. ముందుగా లగ్జరీ చేతి గడియారాల స్మగ్లింగ్ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టగా, భారీ ఎత్తున ఆర్థిక అక్రమ లావాదేవీలు జరిగినట్టు కూడా చెన్నై కస్టమ్స్ అధికారులు గుర్తించారని సమాచారం. పొరుగు రాష్ట్రానికి చెందిన లిస్టెడ్ కంపెనీ, రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కలిసి భారీ ఎత్తున మనీ లాండరింగ్‌కు పాల్పడినట్టు దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. పొంగులేటి హర్షారెడ్డి 2022 నుంచి లగ్జరీ వాచీల స్మగ్లింగ్ చేస్తున్నారని, ఇప్పటివరకు ఆయన కనీసం 60 నుంచి 70 చేతి గడియారాలు విక్రయించి ఉండవచ్చని దర్యాప్తు అధికారులు అంచనాకు వచ్చినట్టు తెలిసింది. విదేశాల్లో ఒక్కొక్క వాచీని రూ.కోటి చొప్పున కొనుగోలు చేసి, ఇండియాలో సంపన్న వర్గాల వారికి రూ.మూడు కోట్ల నుంచి రూ.ఏడు కోట్లకు విక్రయించినట్టు సమాచారం. స్మగ్లింగ్‌కు పాల్పడటం ద్వారా ఎగ్గొట్టిన వ్యాట్, జీఎస్టీ, కస్టమ్స్ ఇతర పన్నుల పన్నుల విలువ ఎంత ఉంటుంది? ఎవరెవరి మధ్య లావాదేవీలు సాగాయి? అనే కోణంలో దర్యాప్తు చేయగా, డొంక కదిలినట్టు తెలిసింది.

35 కోట్ల నుంచి 500 కోట్లకు..

పొరుగు రాష్ట్రంలో ప్రధాన కేంద్రం కలిగిన సదరు ఎలక్ట్రిక్ కంపెనీకి హైదరాబాద్‌లోనూ కార్యాలయం ఉన్నది. దీనిని 2010లో స్థాపించారు. దీని అధీకృత వాటా మూలధనం రూ.35 కోట్లుగా ఉన్నట్టు తెలుస్తున్నది. సదరు కంపెనీ ఉన్నట్టు 2019 వరకు ఎవరికీ పెద్దగా తెలియదు. ఆ తరువాత అనూహ్యంగా పుంజుకున్నది. 2023 ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి రూ.500 కోట్ల ఆదాయాన్ని ప్రకటించింది. ఆ కంపెనీకి, రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు మధ్య 2020 నుంచి సన్నిహిత సంబంధాలు కొనసాగుతున్నట్టు తెలిసింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో కీలకంగా ఉన్న నేతకు, కడప జిల్లాకు చెందిన సదరు కంపెనీ డైరెక్టర్‌కు మధ్య ముందుగా పరిచయం ఏర్పడ్డట్టు తెలిసింది. అక్కడి నుంచి డైరెక్టర్ల పరిచయాలు, ఆర్థిక సర్దుబాటు, ఇచ్చిపుచ్చుకోవడం వరకు సాన్నిహిత్యం పెరిగినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఎలక్ట్రిక్ కంపెనీకి అనుబంధ కంపెనీగా ఉన్న సోలార్ ప్లాంటు డైరెక్టర్‌కు నవీన్‌కుమార్ ద్వారా లగ్జరీ వాచీ ఒకటి చేరినట్టు చైన్నై కస్టమ్స్ అధికారులు గుర్తించారు. వాచీకి సంబంధించిన క్రయ, విక్రయాల్లో డబ్బు ఎవరికి, ఎలా చేరింది? అనే అంశంపై లావాదేవీలను పరిశీలించినప్పుడు పెద్ద ఎత్తున మనీ లాండరింగ్ అంశం దృష్టికి వచ్చినట్టు సమాచారం. దీంతో కస్టమ్స్ అధికారులు ఈడీకి సమాచారం ఇచ్చారు. అప్పటివరకు కస్టమ్స్ అధికారులు చేసిన దర్యాప్తు ఆధారంగా నివేదిక రూపొందించి ఈడీకి సమర్పించారు. పూర్తి స్థాయి వివరాలు రాబట్టడం కోసం ఈడీ ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్‌ను రంగంలోకి దించింది. దేశ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే రెండు ప్రధాన అంశాలతో ముడిపడి ఉన్న కేసు కాబట్టి సమగ్ర క్యాష్ ట్రాన్సాక్షన్ రిపోర్ట్ తెప్పించినట్టు తెలిసింది.

తొమ్మిది దేశాలతో సంబంధాలు

2018 వరకు జాతీయంగానే ఎలక్ట్రిక్ పవర్ పరికరాలను విక్రయించే సదరు సంస్థకు ప్రస్తుతం తొమ్మిది దేశాలతో సంబంధం ఉన్నట్టు కస్టమ్స్ దర్యాప్తులో తేలింది. ఇందులో లగ్జరీ వాచీలను దిగుమతి చేసినట్టు నిర్ధారించిన హంకాంగ్ దేశంతోపాటు మయన్మార్, యూఎస్ లాంటి దేశాలతో కంపెనీకి సంబంధం ఉన్నట్టు తేలింది. రెండు కంపెనీల మధ్య 33 బోగస్ స్టార్టప్ కంపెనీలున్నాయని గుర్తించినట్టు సమాచారం. వాటి ద్వారానే పేరు మీద క్రిప్టో టెతర్ కరెన్సీ, క్రిప్టో బిట్‌కాయిన్ రూపంలో లావాదేవీలు జరిగినట్టు తేలిసింది. గత ఏడాది డిసెంబర్‌లో ఎలక్ట్రిక్ లిస్డెడ్ కంపెనీకి చెందిన కడప, హైదరాబాద్ కార్యాలయాల్లో ఐటీ రైడ్స్ జరిగాయి. ఆ తరువాత ఈ ఏడాది మార్చిలో మరోసారి ఐటీ రైడ్స్ జరిగాయి. ఆయా నివేదికలు ఇవ్వాలని ఐటీ అధికారులను ఈడీ కోరినట్టు తెలిసింది. దీని ద్వారా ఈడీకి మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు.

ఆ కాంట్రాక్ట్ ఎలా దక్కింది?

- నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు దక్కడంపై ఈడీ ఆరా?
- మేఘాతో లోపాయికారి ఒప్పందాలపైనా నజర్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి చెందిన నివాసాలు, ఆఫీసుల్లో ఈడీ అధికారులు ఏ కేసుకు సంబంధించిన సోదాలు నిర్వహించారన్న చర్చ కొనసాగుతున్నది. లగ్జరీ వాచీల కేసు, యూరో ఎగ్జిమ్ బ్యాంక్ గ్యారెంటీలు, రూ.650 కోట్ల టీడీఎస్ కేసు, కుమారుడు పొంగులేటి హర్షారెడ్డికి చెందిన రూ.1,300 కోట్ల పైచిలుకు ఆస్తులకు సంబంధించిన వివరాలపై ఈడీ ఆరా తీసినట్టు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. అయితే, నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం కాంట్రాక్ట్ పొంగులేటి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ దక్కించుకోవడంపై కూడా ఈడీ ప్రత్యేకంగా సమాచారం సేకరించినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. మొత్తం రూ.4,350 కోట్ల ప్రతిపాదిత అంచనా వ్యయంతో చేపడుతున్న ఈ ఎత్తిపోతల్లో తొలి ప్యాకేజీ పనులు పొంగులేటి కంపెనీ దక్కించుకోవడంతో కంపెనీ ముఖవిలువ, టెండర్ ప్రక్రియ జరిగిన తీరు తదితర అంశాలపై ఈడీ అధికారులు ప్రశ్నించినట్టు సమాచారం.

మేఘాతో రాఘవ

నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తోపాటు మేఘా ఇంజినీరింగ్ కంపెనీ దక్కించుకున్నది. ఎన్‌కేఎల్ఐఎస్ ప్యాకేజీ పనులను దక్కించుకున్న రాఘవ కన్‌స్ట్రక్షన్స్, మేఘా కంపెనీలు ముందే కూడబలుక్కుని, లోపాయికారి ఒప్పందం చేసుకున్నాయనే ఆరోపణలొచ్చాయి. రూ.1,134.62 కోట్లతో చేపట్టాల్సిన ప్యాకేజీ-1 పనులకు రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ అంచనా వ్యయం కంటే 3.95% అధికంగా కోట్ చేసింది. అదే పనులకు మేఘా ఇంజినీరింగ్ కంపెనీ 4.85% అధికంగా కోట్ చేసింది. దీంతో ఎల్1గా నిలిచిన రాఘవ కంపెనీకి ప్యాకేజీ-1 టెండర్ దక్కింది. రూ.1,126.85 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ప్యాకేజీ-2 పనులకు మేఘా ఇంజినీరింగ్ 3.95% అధికంగా కోట్ చేయగా, రాఘవ కంపెనీ 4.8% అధికంగా కోట్ చేసింది. దీంతో ఎల్-1గా నిలిచిన మేఘా ఇంజనీరింగ్ కంపెనీకి ప్యాకేజీ-2 టెండర్ దక్కింది. మేఘా కంపెనీ అధికంగా కోట్ చేసిన చోట రాఘవ కంపనీ తక్కువగా కొటేషన్ దాఖలు చేయడం, మేఘా కంపెనీ తక్కువ కోట్ చేసిన చోట రాఘవ కంపెనీ అధికంగా కొటేషన్ దాఖలు చేయడం లోపాయికారి ఒప్పందంలో భాగమేనని ఆరోపణలు వచ్చాయి. ఇక, ఈ ప్రాజెక్టు పనుల కోసం ఎల్అండ్‌టీ, ఎన్‌సీసీ (నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ) సైతం బిడ్లను దాఖలు చేశాయి. చివరకు మేఘా, రాఘవ కంపెనీలే అర్హత సాధించాయి. దీంతో టెండర్‌కు ముందే ఈ ఇరు కంపెనీలు కూడబలుక్కున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు ఆయా కంపెనీలు దాఖలు చేసిన కొటేషన్లే నిదర్శనమని పలువురు ఆరోపిస్తున్నారు.

870 కోట్ల ఆర్థిక అక్రమాలు?

మొదటిపేజీ తరువాయి...

హైదరాబాద్‌తోపాటు మరొకటి ఖమ్మంలోని రాఘవ కన్‌స్ట్రక్షన్ ఆఫీసులో జరిగినట్టు విశ్వసనీయంగా తెలిసింది. అయితే, శుక్రవారం జరిపిన సోదాల సందర్భంగా మూడు నగదు లెక్కింపు యంత్రాలను తీసుకెళ్లిన అధికారులు.. దొరికిన డబ్బుపై పంచనామా పూర్తిచేసి, సంతకాలు చేయించుకున్నారని తెలిసింది.

'రాఘవ ప్రైడ్ తరలింపులపై' ఈడీ ఆరా..

బంజారాహిల్స్‌లోని రోడ్ నంబర్ 10లో ఉన్న రాఘవ ప్రైడ్ ఆఫీసు నుంచి జరిగిన తరలింపులపై ఈడీ దృష్టి సారించినట్టు తెలిసింది. రాఘవ ప్రైడ్‌లోని కీలకమైన డాక్యుమెంట్లు, నగదు, ఇతర ఎలక్ట్రానిక్, డిజిటల్ సామగ్రిని కార్లలో తరలించిన విషయం శనివారం పలు దినపత్రికల్లో రావడంతో హైదరాబాద్ ఈడీ అధికారులు ఆరా తీశారు. ఆ సమాచారాన్ని పత్రికల్లో వచ్చిన క్లిప్పింగ్స్‌ను ఢిల్లీ నుంచి వచ్చిన ఈడీ అధికారులకు పంపినట్టు తెలిసింది. హైదరాబాద్‌లోని జాతీయ మీడియా ప్రతినిధుల ద్వారా కూడా పలు వివరాలు సేకరించినట్టు సమాచారం. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సంబంధించిన ఏ సోదాలైనా 'రాఘవ ప్రైడ్' అత్యంత కీలకమనే అంశాన్ని ఆలస్యంగా తెలుసుకున్నామని.. ఈడీ అధికారులు జాతీయ మీడియా ప్రతినిధులకు చెప్పినట్టు తెలిసింది. అయితే, రెండ్రోజుల ఈడీ సోదాలపై అధికారులు ఆదివారం అధికారికంగా ప్రకటించనున్నట్టు తెలిసింది.

ఇంటి వైపు కన్నెత్తి చూడని మంత్రి..

ఈడీ సోదాలు శనివారం కూడా కొనసాగుతాయని తెలుసుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. అర్ధరాత్రి వరకూ జూబ్లీహిల్స్‌లోని ఇంటికి గాని, అటు హిమాయత్‌సాగర్‌లోని ఫామ్‌హౌజ్‌కు వెళ్లలేదని తెలిసింది. మినిస్టర్ క్వార్టర్స్‌కు, సచివాలయానికి తప్ప.. మంత్రి పొంగులేటి ఎక్కడికీ వెళ్లలేదని అధికారులు పేర్కొన్నారు. సచివాలయంలో శనివారం జరిగిన పలు సమావేశాల్లో మంత్రి పొంగులేటి ముభావంగా కనిపించారని చెప్తున్నారు. సోదాలు జరిగిన ప్రతిసారి, అదే రోజు మీడియా ముందుకు వచ్చి ఏం జరిగిందో పొంగులేటి చెప్పేవారు. రెండ్రోజుల తనిఖీలు పూర్తయినా కూడా ఆయన మీడియా ముందుకు రాకపోవటం మరిన్ని అనుమానాలకు తావిస్తున్నదని కాంగ్రెస్‌లోని ఆయన వ్యతిరేక వర్గం వ్యాఖ్యానించింది. ఈడీ సోదాలపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, అద్దంకి దయాకర్ మినహా ఏ ఒక్కరూ స్పందించలేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం ఈ దాడులపై పెదవి విప్పలేదు.

టీజీఐఐసీ నిర్లక్ష్యంతో అమాయకులు బలి!

- పరిశ్రమలకు సేకరించిన భూములను విక్రయిస్తున్న పట్టాదార్లు
- పరిహారం చెల్లించినా తమపేర రిజిస్ట్రేషన్ చేయించుకోని టీజీఐఐసీ
- రికార్డుల్లో ఇంకా పట్టాదార్ల పేర్లు.. మోసపోతున్న ప్రజలు

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీజీఐఐసీ) నిర్లక్ష్యం కొందరు అమాయకులకు శాపంగా మారుతున్నది. ఏండ్ల క్రితం పరిశ్రమల కోసం సేకరించిన భూములను కూడా టీజీఐఐసీ తన పేర మ్యుటేషన్ చేయించుకోకపోవటంతో నష్టపరిహారం తీసుకున్న పట్టాదార్లు తమ భూములను అమాయకులకు అంటగడుతున్నారు. భూములు కొనుగోలు చేసినవారు వాస్తవం తెలిసిన తర్వాత లబోదిబోమంటున్నారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో ఈ తరహా ఘటనలు లెక్కలేనన్ని ఉండొచ్చని అధికారులే అంగీకరిస్తున్నారు. పారిశ్రామిక అవసరాల కోసం రైతుల నుంచి భూములు సేకరించి, మౌలిక సదుపాయాలు కల్పించిన అనంతరం పరిశ్రమలకు విక్రయించడం టీజీఐఐసీ బాధ్యత. రైతుల నుంచి సేకరించిన భూములను నష్టపరిహారం చెల్లించిన వెంటనే టీజీఐఐసీ పేర రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఇలా చేయడంవల్ల పట్టాదార్లు ఇతరులకు విక్రయించే అవకాశం ఉండదు. అయితే టీజీఐఐసీకి చెందిన అధికారుల నిర్లక్ష్యం వల్ల చాలా ప్రాంతాల్లో సేకరించిన భూములు ఇంకా పట్టాదార్ల పేర్లతోనే కొనసాగుతుండటంతో వారు క్రయవిక్రయాలు జరుపుతున్నారు. దీనివల్ల కొనుగోలు చేస్తున్న అమాయకులు మోసపోతున్నారు. ఉదాహరణకు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలో వివిధ సర్వే నంబర్లలో దాదాపు 20 ఏండ్ల క్రితం అప్పటి ఏపీఐఐసీ సుమారు 200 ఎకరాల భూములు సేకరించింది. అందులో పావువంతు భూముల్లోనే పరిశ్రమలు ఏర్పాటు కాగా, మిగిలిన భూములు ఖాళీగానే ఉన్నాయి. భూములు సేకరించినా వాటిని పరిశ్రమల పేరుతో గానీ, ఏపీఐఐసీ పేరుతోగానీ రిజిస్ట్రేషన్ చేయించలేదు. దీంతో ఇంకా ఆ భూములు పట్టాదార్ల పేరు మీదే ఉన్నట్టు రికార్డులు చెప్తున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకొని కొందరు వాటిని మళ్లీ ఇతరులకు విక్రయించారు.

చేతులెత్తేసిన టీజీఐఐసీ

సర్వే నంబరు 81 పరిధిలో ఇటువంటి ఘటన ఒకటి తాజాగా వెలుగుచూసింది. 20 ఏండ్ల క్రితం ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో ఆరు ఎకరాల భూమి ఇప్పటికే నలుగురు చేతులు మారింది. తీరా ఐదో వ్యక్తి దాన్ని కొనుగోలు చేసేందుకు ప్రయత్నించగా, టీజీఐఐసీ పేర రిజిస్టర్ అయినట్టు రికార్డులు చూపుతున్నాయి. దీంతో విక్రయానికి ఉంచిన ఆ నాలుగో వ్యక్తి తాను మోసపోయానని లబోదిబోమంటున్నాడు. తాను పట్టాదారు వద్ద భూమి కొనుగోలు చేసినట్టు, తన భూమిని విక్రయించేందుకు ఎన్వోసీ ఇవ్వాలని బాధితుడు టీజీఐఐసీని వేడుకొంటున్నాడు. అధికారులు మాత్రం ఎన్వోసీ ఇచ్చే ఆస్కారం లేదని చేతులెత్తేశారు. ఆ 200 ఎకరాల భూముల్లో ఇలాంటి ఇంకా ఎన్ని ఉన్నాయో తేలాల్సి ఉన్నది.

స్థానికంగా విచారించుకొని కొనుగోలు చేయాలి: టీజీఐఐసీ

పారిశ్రామిక ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేయాలనుకొనేవారు సమగ్రంగా విచారించుకొని, స్థానికులతో మాట్లాడిన తర్వాతే భూములు కొనుగోలు చేయాలని టీజీఐఐసీ అధికారులు సూచిస్తున్నారు. సిబ్బంది కొరత వల్ల తాము సేకరిస్తున్న భూములను వెంటనే టీజీఐఐసీ పేర రిజిస్ట్రేషన్ చేయించుకోలేకపోతున్నామని, దీన్ని ఆసరాగా చేసుకొని పట్టాదార్లు నష్టపరిహారం తీసుకొని కూడా ఇతరులకు విక్రయించుకొంటున్నట్టు తెలిసిందని చెప్తున్నారు. సేకరించిన భూములను టీజీఐఐసీ పేర మ్యూటేషన్ చేయాల్సిన బాధ్యత రెవెన్యూశాఖపై ఉంటుందని, వాళ్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తాము చేసేదేమీ లేదని స్పష్టంచేస్తున్నారు. మొత్తంగా అధికారుల నిర్లక్ష్యం వల్ల అమాయకులు ఎంతోమంది మోసపోతున్నారు.



అమూల్ టర్నోవర్ 59,445 కోట్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: అమూల్ పేరుతో పాల ఉత్పత్తులను విక్రయిస్తున్న గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్(జీసీఎంఎంఎఫ్) అంచనాలకు మించి రాణిస్తున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.59,445 కోట్ల(7 బిలియన్ డాలర్లు) ఆదాయాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది వచ్చిన ఆదాయంతో పోలిస్తే ఎనిమిది శాతం వృద్ధిని నమోదు చేసుకున్నట్లు 50వ వార్షిక సాధారణ సర్వసభ్య సమావేశం అనంతరం వెల్లడించింది. అలాగే గ్రూపు టర్నోవర్ రూ.80 వేల కోట్లు(10 బిలియన్ డాలర్లు)గా నమోదైందని తెలిపింది. 2022-23 ఏడాదికిగాను 72 వేల కోట్లు(9 బిలియన్ డాలర్లు) ఆర్జించింది. ప్రపంచంలో అత్యంత బలమైన ఆహార బ్రాండ్, బలమైన పాల ఉత్పత్తుల బ్రాండ్‌గా అమూల్ ఎదిగింది. రైతులే యజమానిగా ఎదిగిన అమూల్ కో-ఆపరేటివ్ సొసైటీలో 36 లక్షల మంది రైతుల నుంచి రోజుకు 300 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నది. ఈ సందర్భంగా జీసీఎంఎంఎఫ్ చైర్మన్ శామల్‌భాయ్ పటేల్ మాట్లాడుతూ..జీసీఎంఎంఎఫ్ మరో చారిత్రక మైలురాయికి చేరుకున్నదని, ప్రపంచంలో అత్యంత బలమైన ఆహార పదార్థాల బ్రాండ్‌గా అవతరించిందన్నారు.

బీఎస్ఎన్ఎల్ సరికొత్త ప్లాన్

60 రోజుల వ్యాలిడిటీతో రూ.345 ప్రీపెయిడ్ ప్లాన్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: ప్రభుత్వరంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ మరో ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 60 రోజుల కాలపరిమితితో రూ.345 ప్రీపెయిడ్ ప్లాన్‌ను తెచ్చింది. ఈ ప్లాన్ కింద రోజుకు 1జీబీ డాటాతోపాటు అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌ను అందిస్తున్నట్లు తెలిపింది. 4జీ సేవలు అందించడానికి సిద్ధమతున్న సంస్థకు ఈ నూతన ప్లాన్‌తో కస్టమర్లకు అధిక ప్రయోజనాలు లభించనున్నాయని తెలిపింది. ఇతర టెలికం సంస్థల కంటే బీఎస్ఎన్ఎల్ టారిఫ్‌లు చాలా తక్కువ స్థాయిలో ఉన్నాయి.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో ఐడీఎఫ్‌సీ విలీనం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో ఐడీఎఫ్‌సీ విలీనానికి ఇరు సంస్థల బోర్డులు ఆమోదం తెలిపాయి. ఈ విలీనం అక్టోబర్ 1 నుంచి అమలులోకి రానున్నది. ఈ విలీనానికి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, చెన్నై బెంచ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఐడీఎఫ్‌సీ లిమిటెడ్ వాటాదారులకు రూ.10 ముఖ విలువ కలిగిన 100 ఈక్విటీ షేర్లకుగాను ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌నకు చెందిన 155 ఈక్విటీ షేర్లు లభించనున్నాయి.



నూతన కార్ల సందడే..సందడి

వచ్చే నెలలో విడుదలకానున్న ఐదు మాడళ్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: ప్రస్తుత పండుగ సీజన్‌లో కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి ఆటోమొబైల్ సంస్థలు సరికొత్త మాడళ్లను అందుబాటులోకి తీసుకురాబోతున్నాయి. ఇప్పటికే ప్రతి నెలలో అర డజన్‌కు పైగా మాడళ్లను విడుదల చేస్తున్న సంస్థలు..వచ్చే నెలలోనూ ఇదే ట్రెండ్‌ను కొనసాగిస్తూ ఐదు మాడళ్లను విడుదల చేయడానికి సిద్ధమవుతున్నాయి. వీటిలో కియా, నిస్సాన్, బీవైడీ, మెర్సిడెజ్ బెంజ్‌లు ఉన్నాయి. ఈ వివరాలు..

కియా నుంచి రెండు మాడళ్లు

కొరియాకు చెందిన వాహన సంస్థ కియా.. దేశీయ మార్కెట్లోకి నయా కార్నివాల్‌ను విడుదల చేయబోతున్నది. వచ్చే నెల 3న మార్కెట్లోకి విడుదల చేస్తున్న ఈ కారు ధర రూ.50 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. 2.2 లీటర్ 4-సిలిండర్ డీజిల్ ఇంజిన్‌తో తయారైన ఈ కారు 193 బీహెచ్‌పీల శక్తినివ్వనున్నది. దీంతోపాటు మరో ఈవీ మాడల్‌ను కూడా అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 99.8 కిలోవాట్ల బ్యాటరీతో తయారు చేసిన ఈవీ 9లో ఆరుగురు కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసింది. సింగిల్ చార్జింగ్‌తో 561 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. కేవలం 24 నిమిషాల్లోనే 10 శాతం నుంచి 80 శాతం వరకు చార్జింగ్‌కానున్నది.

నిస్సాన్ మ్యాగ్నైట్ ఫెసిలిఫ్ట్

వచ్చే నెల 4న మ్యాగ్నైట్ ఫెసిలిఫ్ట్ మాడల్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నది నిస్సాన్ ఇండియా. దేశీయ మార్కెట్‌తోపాటు ఇతర దేశాలకు అనుగుణంగా లెఫ్ట్-హ్యాండ్ డ్రైవ్ వెర్షన్ కూడా తీసుకురాబోతున్నది.

బీవైడీ ఈమ్యాక్స్ 7

చైనాకు చెందిన ఈవీల తయారీ సంస్థ బీవైడీ మరో మాడల్‌ను దేశీయ మార్కెట్లోకి విడుదల చేయబోతున్నది. వచ్చే నెల 8న ఈమ్యాక్స్ 7 మాడల్‌ను అందుబాటులోకి తెస్తున్నది. అడాస్ సూట్, ప్రీమియం స్విచ్ గేర్, సాఫ్ట్-టచ్ మెటీరియల్స్, లగ్జరీ లుక్‌తో తీర్చిదిద్దింది. రెండు రకాల్లో లభించనున్న ఈ కారులో 55.4 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 420 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనుండగా, 71.8 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 530 కిలోమీటర్లు ఇవ్వనున్నది.

మెర్సిడెజ్ బెంజ్ ఈ-క్లాస్



జర్మనీకి చెందిన విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్ ఈ-క్లాస్ ఎల్‌డబ్ల్యూబీ మాడల్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 14.4 ఇంచుల సెంట్రల్ టచ్‌స్క్రీన్‌తోపాటు 12.3 ఇంచుల ప్యాసింజర్ టచ్‌స్క్రీన్, 4డీ సరౌండింగ్ సౌండ్ సిస్టమ్ కలిగిన ఈ మాడల్‌ను 2.0 లీటర్ల పెట్రోల్ ఇంజిన్‌తో తయారు చేసింది.

ఐఫోన్ 16పై ఐసీఐసీఐ బ్యాంక్ ఆఫర్లు

ముంబై, సెప్టెంబర్ 28: ఇటీవల మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చిన ఐఫోన్ 16పై ఐసీఐసీఐ బ్యాంక్ కూడా ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నది. ఐఫోన్ 16ని కొనుగోలు చేసినవారికి రూ.5 వేల ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్ అందుకోవచ్చునని తెలిపింది. అలాగే ఈఎంఐ ఆప్షన్‌లో నెలకు రూ.2,497 చెల్లించి ఈ ఫోన్‌ను కొనుగోలు చేయవచ్చునని సూచించింది. ఈ ఆఫర్లు డిసెంబర్ 31 వరకు మాత్రమే అందుబాటులో ఉండనున్నాయని పేర్కొంది. పాత ఐఫోన్ కలిగివున్నవారు అప్‌గ్రేడ్‌తో ఐఫోన్ 16ని కొనుగోలు చేసిన వారికి క్యాష్‌బ్యాక్‌తోపాటు వడ్డీ రహిత ఈఎంఐని ఎంచుకోవచ్చునని సూచించింది. ఈ ఆఫర్ కేవలం ఐఫోన్ 16 ప్రొ మ్యాక్స్, ఐఫోన్ 16 ప్రొ, ఐఫోన్ 16 ప్లస్, ఐఫోన్ 16 మాడళ్లకు వర్తించనున్నది. ఈ-కామర్స్ సంస్థలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లతోపాటు ఆఫ్‌లైన్ స్టోర్లు అప్‌ట్రానిక్స్, యూనికార్న్, క్రోమా, రిలయన్స్, విజయ సేల్స్, సంగీత మొబైల్స్‌లో లభించనున్నది.



రియల్టీ సంస్థలపై రెరా కొరడా

వెయ్యికిపైగా ప్రాజెక్టులపై రూ.35 కోట్ల జరిమానా

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): నిబంధనలు ఉల్లంఘించిన రియల్ ఎస్టేట్ సంస్థలపై రెరా కొరడా ఝులిపించింది. మార్కెటింగ్ కార్యకలాపాలు, ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో జరుగుతున్న మోసాలపై ఉక్కుపాదం మోపడానికి రెరా పలు కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. పూర్తిస్థాయిలో రెరా ఏర్పాటైన గడిచిన ఏడేండ్లలో ఏకంగా వెయ్యికి పైగా ప్రాజెక్టులపై రూ.36 కోట్ల వరకు జరిమానా విధించింది. వీటిలో ఇప్పటికే రూ.15 కోట్లను ఆయా సంస్థలు చెల్లించాయి కూడా. ఎనిమిది కంటే ఎక్కువ ప్లాట్లను విక్రయించిన, 600 గజాలు అంతకంటే ఎక్కువ స్థలంలో నిర్మించి విక్రయాలు చేసినా ప్రాజెక్టులు రెరా పరిధిలోకి వస్తాయి. ఇలాంటి సంస్థలు తప్పకుండా రెరా వద్ద నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ రెరా వద్ద నమోదు చేసుకోకుండానే విక్రయాలు జరిపితే ఆయా ప్రాజెక్టులు చేపట్టిన సంస్థలపై ఈ మండలి భారీస్థాయిలో జరిమానా విధిస్తున్నది.

రెరా ఏర్పాటైన తరువాత వివిధ ప్రాజెక్టులకు విధించిన జరిమానాలు

సంవత్సరం	ఫైన్ వేసిన ప్రాజెక్టులు	జరిమానా మొత్తం (రూ.కోట్లలో)
2018-19	335	3.06
2019-20	49	0.79
2020-21	04	0.29
2021-22	03	0.23
2022-23	180	1.70
2023-24	311	26.69
2024-25	131	2.96
మొత్తం	1013	35.72

రెరా నంబర్ లేకుండానే ప్రకటనలు..

రెరా నంబర్ లేకుండానే రియల్ ఎస్టేట్ సంస్థలు భారీ స్థాయిలో వాణిజ్య ప్రకటనలు జారీ చేసిన సంస్థలపై ఫిర్యాదులు అందడంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వాణిజ్య ప్రకటనలపై ఖచ్చితంగా రెరా నంబర్ ఉండాల్సిందేనని షరతు విధించింది. దీంతో తమ ప్రకటనల పక్కన రెరా నంబర్‌ను ఖచ్చితంగా ముద్రిస్తున్నాయి. ప్రీలాంచ్ ఆఫర్లు, ముందస్తుగా ఒప్పందం చేసుకున్న మేరకు ప్లాట్లను అప్పగించకపోవడం, వాటిలో సరైన వసతులు కల్పించకపోయిన ప్రాజెక్టులపై కూడా చర్యలు తీసుకున్నది. ఒక దగ్గర ప్రాజెక్టు నమోదు చేసుకొని..అదే అనుమతితో మరి కొన్ని చోట్ల విక్రయాలు చేస్తున్న ప్రాజెక్టులను గుర్తించడానికి ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది.



సిరిసిల్ల నేత కార్మికుడు నల్ల విజయ్ తయారు చేసిన బంగారు పోగుల చీర

ఈ చీర బంగారం..

- 200 గ్రాములతో జరీ పోగులు చేసి నేసిన చీర
- సిరిసిల్ల చేనేత కళాకారుడి మరో అద్భుత ఆవిష్కరణ

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 28 : సిరిసిల్ల చేనేత కళాకారుడు నల్ల విజయ్ మరో అద్భుతాన్ని ఆవిష్కరించాడు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారవేత్త తన కూతురి వివాహం కోసం ఇచ్చిన ఆర్డర్ మేరకు 200 గ్రాముల బంగారాన్ని జరీ పోగులుగా తయారు చేసి 12 రోజుల వ్యవధిలో చీరను రూపొందించాడు. నూలు పోగులకు బంగారం జత చేసి నేసిన ఈ చీర 49 ఇంచుల వెడల్పు, ఐదున్నర మీటర్ల పొడవు, దాదాపు 900 గ్రాముల బరువు ఉంటుందని నేత కళాకారుడు తెలిపాడు. విజయ్ నూతన ఆవిష్కరణను పలువురు ప్రశంసించారు.

సైబర్ బాధితులకు 26.2 కోట్ల రీఫండ్

సీఎస్‌బీ డీజీ శిఖాగోయెల్ వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో నుంచి వివిధ సైబర్ నేరాల్లో ఫ్రీజ్ చేసిన రూ.26.2 కోట్లను బాధితుల ఖాతాల్లోకి బదిలీ చేసినట్లు సీఎస్‌బీ డీజీ శిఖాగోయెల్ వెల్లడించారు. శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌ల ద్వారా 5,245 మంది సైబర్ బాధితులకు రూ. 26.2 కోట్ల నగదును రీఫండ్ చేసినట్టు తెలిపారు. ఈ ఏడాది జూన్ 9 నుంచి సెప్టెంబర్ 28 మధ్యలో జరిగిన సైబర్ మోసాల్లో.. తక్షణం స్పందించి ఫ్రీజ్ చేసిన అమౌంట్‌ను బాధితులకు అందించి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అరుదైన ఘనతను సాధించిందని ఆమె పేర్కొన్నారు. ఈ ఏడాది మొదట్లో 4,800 మంది బాధితులకు 21.6 కోట్లు రీఫండ్ చేసినట్టు గుర్తుచేశారు. ఈ సందర్భంగా సీఎస్‌బీ అధికారులు, తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, జిల్లా న్యాయమూర్తులు, మెజిస్ట్రేట్‌లు, డీఎల్ఎస్‌ఏలు, సీపీలు, ఎస్పీల సమన్వయంతో ఓ బెంచ్ మార్క్‌ను సెట్ చేశామని చెప్పారు. అపరిచితులను నమ్మి డబ్బులు చెల్లించవద్దని, ఒకవేళ మోసానికి గురయ్యామని తెలిసిన గంట(గోల్డెన్ అవర్)లో 1930కి కాల్ చేయాలని సూచించారు.

అయోధ్య-కాశీ పుణ్యక్షేత్ర భారత్ గౌరవ్ యాత్ర రైలు ప్రారంభం

హైదరాబాద్, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో భారత్ గౌరవ్ యాత్ర రైళ్ల ఏర్పాటు కొనసాగుతున్నది. ఇప్పటి వరకు 23 భారత్ గౌరవ్ యాత్ర రైళ్లు నడిపిన రైల్వే అధికారులు శనివారం 28వ భారత్ గౌరవ్ యాత్ర సికింద్రాబాద్ నుంచి ఎస్‌సీఆర్ చీఫ్ ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ పద్మజ ప్రారంభించారు. ఈ రైలును 'అయోధ్య-కాశీ-పుణ్య క్షేత్ర యాత్ర' అని పేరుతో ప్రారంభించినట్టు అధికారులు పేర్కొన్నారు. ఈ యాత్ర 9 రోజులు సాగనుందని చెప్పారు. తెలంగాణ, ఏపీకి చెందిన ప్రయాణికుల కోసం రామజన్మభూమి (అయోధ్య)తో పాటు జ్యోతిర్లింగ (కాశీ విశ్వనాథ టెంపుల్) వంటి దేవాలయాల9/28/2024 8:55:35 PM9/28/2024 8:55:36 PMను సందర్శించే విధంగా ఏర్పాట్లు చేసినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు.

ఎస్ఎఫ్‌టీకి 200 ఇస్తేనే అనుమతి!

› మొదటిపేజీ తరువాయి...

హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీల పరిధిలో ఇదే వ్యవహారం నడుస్తున్నది. దీనిని ఎవరూ ప్రశ్నించే సాహసమే చేయడంలేదు.

చదరపు అడుగుకు రూ.40 వసూలు..

ఏదైనా అపార్ట్‌మెంట్ లేదా కమర్షియల్ కాంప్లెక్స్‌కు అనుమతులు రావాలంటే ఆ ప్రైవేటు రియల్టర్ (సార్)కు మొక్కు చెల్లించుకోవాలి. ఆ వ్యక్తి రాష్ట్రంలోని ముఖ్యనేతకు దగ్గరి బంధువు అని తెలిసింది. ఆ ముఖ్యనేతకు రియల్‌ఎస్టేట్‌లో కూడా భాగస్వామిగా ఉన్న ఆయనే ఎవరెవరికి ఎంతెంత ఇవ్వాలన్నది నిర్ణయించి, ఎక్కడ ఇవ్వాలో కూడా చెప్తారట. అంతా పూర్తయ్యాక ఆటోమెటిగ్గా అధికారుల నుంచి 'మీ ఫైల్‌పై సంతకాలు పూర్తయ్యాయి' అంటూ ఫోన్లు వస్తాయి. భవనం, అది ఉన్న లొకేషన్ ఆధారంగా కనిష్ఠంగా చదరపు అడుగుకు రూ.40 వసూలు చేస్తున్నట్టు బిల్డర్లు చెప్తున్నారు. 50వేల చదరపు అడుగుల భవనానికి అయితే ఒక ధర.. లక్ష చదరపు అడుగులు దాటితే మరో ధర అడుగుతున్నారు. అయిదు లక్షల చదరపు అడుగుల భవనాలకైతే ఏకంగా ల్యాండ్‌షేర్ లేదా తమ వారికి కొంతభాగం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. చదరపు అడుగుకు రూ.40 నుంచి మొదలయ్యే బేరం రూ.100 వరకు వెళ్తున్నది. ఇది కేవలం కొత్తగా నిర్మించే భవనాలకు మాత్రమే వర్తిస్తుంది. ఇక ఫ్లాట్ (అపార్ట్‌మెంట్లు)కు ఒక ధర, విల్లా ప్రాజెక్టులకు మరో ధర పెట్టారు. విల్లా ప్రాజెక్టులు అయితే చదరపు అడుగుకు కనీసం రూ.60 నుంచి మొదలవుతుంది. అదే లేఅవుట్ అయితే ధర మారుతుంది. ఆ ప్రాంతంలో ఉన్న అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ధర నిర్ణయిస్తున్నారు. కనీసం రూ.200 తగ్గకుండా చదరపు గజానికి వసూళ్లు చేస్తున్నారు.



కంగుతింటున్న రియల్టర్లు

కొత్త సర్కారు వచ్చిన తర్వాత రియల్‌ఎస్టేట్ రంగం పూర్తిగా దెబ్బతిన్న నేపథ్యంలో ఇప్పటికే ఉన్నవారిని ప్రోత్సహించాల్సింది పోయి వసూళ్ల దందా మొదలుపెట్టడం ఏమిటని రియల్టర్లు వాపోతున్నారు. ఎమ్మెల్యేల కొనుగోళ్ల అంశంలో కీలక పాత్ర పోషించిన మరో ముఖ్యమైన నాయకుడు కూడా ఇప్పుడు అనుమతుల ప్రక్రియలో క్రియాశీలకంగా ఉన్నారు. ఆయనతోపాటు మరో యువ కిషోరం కూడా వసూళ్ల పనిలో నిమగ్నమయ్యాడని వినికిడి. వీరి నుంచి ఫోన్ వచ్చిన తర్వాతనే ఫైళ్లు కదులుతున్నాయని వినికిడి. గత ప్రభుత్వ హయాంలో ఎక్కడా ఇలాంటి పోకడలు చూడలేదని, ఇప్పుడేమో ముక్కుపట్టి వసూళ్లు చేస్తున్నారని చెప్తున్నారు. ఈ వసూళ్లను భరించలేక చాలా మంది బిల్డర్లు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు తమ కార్యకలాపాలను తాత్కాలికంగా వాయిదా వేసుకుంటున్నారు. కొందరు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతున్నారు.

'జాబ్ ఇస్తానని.. లైంగికదాడి'

ఇన్‌స్టాలో పరిచయమైన యువతిపై అఘాయిత్యం

వెంగళరావునగర్, సెప్టెంబర్ 28: ఇన్‌స్టాలో పరిచయమైన యువతిపై లైంగికదాడికి పాల్పడిన ఘటన మధురానగర్‌లో చోటు చేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం..ఏపీ పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన యువతి (30) భర్త నుంచి విడాకులు తీసుకొని రహ్మత్‌నగర్‌లో ఉంటూ సినిమాల్లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసేది. ఇటీవల ఆమెకు ఇన్‌స్టాలో శశికిరణ్ రెడ్డి అనే వ్యక్తి పరిచయం కాగా, మధురానగర్‌లోని తన మూవీ ఆఫీస్‌లో జాబ్ ఖాళీగా ఉన్నదని.. ఓసారి రావాలని పిలిచాడు. శుక్రవారం రాత్రి 9గంటలకు ఆఫీసుకు వెళ్లేసరికి అక్కడ శశికిరణ్ తప్ప ఎవరూ లేరు. తిరిగి వెళ్లేందుకు యత్నించగా తలుపునకు గడియ బిగించి ఆమెపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. తెల్లవారుజాము 5గంటలకు ఆ యువతి తప్పించుకొని ఇంటికి చేరుకున్నది. కాగా, రూంలోనే ఉండిపోయిన వస్తువుల కోసం మళ్లీ వెళ్లగా గదికి తాళం ఉండడంతో పగులగొట్టేందుకు ప్రయత్నించింది. గమనించిన వాచ్‌మన్లు ఆరా తీసి డయల్ 100కు సమాచారం అందించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణకు 'ఎఫ్‌టీఎల్' ఫోబియా

- చెరువులు, నాలాల పేర్లు వింటేనే జనాల్లో హడల్
- చెరువుల మ్యాప్‌ల కోసం ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు
- హైదరాబాద్‌లో పడిపోయిన రియల్ ఎస్టేట్ అమ్మకాలు
- కొనుగోళ్లు లేక పెరిగిపోతున్న 'అన్‌సోల్డ్' ప్రాపర్టీస్

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : హైడ్రో ఫోబియా.. ఈ మానసిక వ్యాధి ఉన్నవాళ్లు నీళ్లంటే భయపడతారు. ఇదే తరహాలో ఇప్పుడు తెలంగాణలో రెండు రకాల ఫోబియాలు నడుస్తున్నాయి. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 'హైడ్రా' ఫోబియా హడలెత్తిస్తుంటే, రాష్ట్రం మొత్తం 'ఎఫ్‌టీఎల్ ఫోబియా' కమ్మేస్తున్నది. ఇన్నాళ్లూ హైదరాబాద్‌లో లేక్ వ్యూ అంటే చాలు హాట్‌కేకుల్లా అమ్ముడైన ప్లాట్లు, ఫ్లాట్లు, విల్లాలు, ఇండ్లు ఇప్పుడు వెలవెలబోతున్నాయి. ఇప్పటికే కొనుగోలు చేసిన యజమానులు బిక్కుబిక్కుమంటున్నారు. ఔటర్ దాటి న తర్వాత పట్టణాలు, గ్రామాల్లో 'ఎఫ్‌టీఎల్' ఫోబియా స్పష్టంగా కనిపిస్తున్నది. 'సిద్దిపేట జిల్లాకు చెందిన ఓ వ్యక్తి రెండేండ్ల కిందట ఒక ప్లాట్ కొన్నారు. వెంచర్‌కు రెవెన్యూ, ఇరిగేషన్ తదితర శాఖల అనుమతులు ఉండటంతో ధైర్యంగా దాదాపు రూ.10 లక్షలు పెట్టుబడి పెట్టారు. భవిష్యత్తులో తన కొడుకులకు పనికొస్తుందని భరోసాగా ఉన్నారు. హైడ్రా హడావుడి మొదలైన తర్వాత తన ప్లాట్ కూడా చెరువుకు సమీపంలో ఉన్న విషయం గుర్తుకొచ్చింది. వెంటనే రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలకు వెళ్లి పాత మ్యాప్‌లు తీసుకొని పరిశీలించారు. కొత్త డాక్యుమెంట్లలో వెంచర్ చెరువుకు దూరంగా కనిపిస్తుంటే, పాత మ్యాపుల్లో మాత్రం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్టు తేలింది. అప్పటి నుంచి ఆయనకు నిద్ర లేదు'.. ఇది ఉదాహరణ మాత్రమే. రాష్ట్రవ్యాప్తంగా చెరువులు, కుంటలు, వాగులకు దగ్గర్లోని వెంచర్లలో ప్లాట్లు తీసుకున్నవారు, ఇండ్లు కట్టుకున్నవారు ఆందోళన చెందుతున్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నామో లేదో తెలుసుకునేందుకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

రియల్‌ఎస్టేట్ నేలచూపులు..

హైడ్రా, మూసీ పరీవాహకంలో కూల్చివేతలతో రియల్ ఎస్టేట్ రంగం రోజురోజుకు నేలచూపులు చూస్తున్నది. ప్రతి నెలా రూ.వేల కోట్ల లావాదేవీలు జరిగే రియల్ ఎస్టేట్ రంగం క్రమంగా కుదేలవుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన మొదలై పది నెలలు కావస్తున్నా రియల్ ఎస్టేట్ రంగం వృద్ధికి దోహదం చేసే భరోసా ప్రభుత్వం నుంచి లేకపోగా, హైడ్రా వంటి కార్యకలాపాలు కొనుగోలుదారులను మరింత భయాందోళనకు గురి చేస్తున్నాయి. వెంచర్‌లో ప్లాట్, అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కొనాలన్నా, విల్లాలు తీసుకోవాలన్నా కొనుగోలుదారులు అడుగుతున్న మొదటి ప్రశ్న.. 'మీ ప్రాజెక్టు చెరువు, నాలాకు ఎంత దూరంలో ఉంది?' అని. బిల్డర్లు దీనికి స్పష్టమైన సమాధానాలు చెప్పలేని పరిస్థితి నెలకొన్నది. పైగా కాంగ్రెస్ ప్రభుత్వం భవన నిర్మాణ అనుమతుల విషయంలోనూ నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తుండగా.. హైదరాబాద్ పరిధిలో కొత్త ప్రాజెక్టులు సైతం మొదలు కావడం లేదు.

పెరిగిపోతున్న అన్‌సోల్డ్ ప్రాపర్టీస్..

హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం కరోనా సమయంలో పెద్ద ప్రభావానికి గురికాలేదని, క్రమంగా వృద్ధిరేటు పెరిగిందే తప్ప, ఏమాత్రం తగ్గలేదని రియల్ రంగ నిపుణులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రావడంతో ఒక్కసారిగా కొనుగోళ్లు తగ్గుతున్నాయే తప్ప ఏమాత్రం పెరగడం లేదు. ఇటీవలే ఓ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ వెల్లడించిన ఓ సర్వేలో ఇదే విషయాన్ని పేర్కొంది. ఒకేసారి 42 శాతం కొనుగోళ్లు తగ్గాయని వెల్లడించింది. గత 2-3 నెలలుగా హైడ్రా దూకుడు రియల్ రంగాన్ని ఒక్కసారిగా కుదిపేసింది. ఫార్మాసిటీ, ఎయిర్‌పోర్టు మెట్రో రద్దుతోనే మొదలైన పతనం మరింత నేలచూపులు చూస్తుండడంతో భారీ ప్రాజెక్టులు మొదలుకొని స్టాండ్ అలోన్ అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్లను కొనేవారు కరువయ్యారు. రియల్ ఎస్టేట్ సంస్థ లెక్కల ప్రకారం హైదరాబాద్ నగరంలో లక్షకు పైగా అమ్ముడుపోని ఫ్లాట్లు ఉండగా, నిర్మాణంలో, అనుమతులు వచ్చిన ప్రాజెక్టుల్లో కలుపుకుంటే మరో 2 లక్షల దాకా ఉంటాయని పేర్కొంటున్నారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, రెరా అనుమతులు ఉన్న ప్రాజెక్టుల్లోని అపార్ట్‌మెంట్లను, విల్లాలను హైడ్రా కూల్చివేయడంతో కొనుగోలుదారులు వెనకడుగు వేడయమే దీనికి ప్రధాన కారణమని భావిస్తున్నారు. రియల్ ఎస్టే ట్ రంగం ఎప్పుడు పుంజుకుంటుందో చెప్పలేమన్న అభిప్రాయాన్ని బిల్డర్లు వ్యక్తం చేస్తున్నారు.

కట్టుకున్నోడినే కడతేర్చింది

- భర్తను రోకలిబండతో కొట్టి చంపిన భార్య
- మానకొండూర్‌లో విషాదం

మానకొండూర్, సెప్టెంబర్ 28: క్షణికావేశంలో ఓ మహిళ కట్టుకున్న భర్తనే రోకలిబండతో విచక్షణారహితంగా దాడిచేసి కడతేర్చింది. ఈ ఘటన కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లో శనివారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ మండల కేంద్రంలోని బేడబుడగ జంగం కాలనీకి చెందిన మోటం పోచయ్య(45), సమ్మక్క దంపతులు. వీరికి ఓ కూతురు ఉండగా వివాహమైంది. శుక్రవారం రాత్రి భార్యాభర్తల మధ్య ఇంట్లో గొడవ జరిగింది. క్షణికావేశంతో సమ్మక్క భర్తపై రోకలిబండతో దాడి చేసింది. కాళ్లు, చేతులు, కడుపుపై కొట్టడంతో తీవ్రంగా గాయపడిన పోచయ్య అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. హత్య జరిగిన వెంటనే సమ్మక్క పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌చార్జి సీఐ స్వామి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో 13 గోవుల మృతి

- పశువుల అక్రమ రవాణా వాహనం బోల్తా
- 25 ఆవులను గోశాలకు తరలించిన పోలీసులు

పాలకుర్తి రూరల్, సెప్టెంబర్ 28: రోడ్డు ప్రమాదంలో 13 గోవులు మృతి చెందాయి. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి జనగామ జిల్లా పాలకుర్తి మండలం వావిలాలలో జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి హైదరాబాద్‌లోని కబేలాల కోసం డీసీఎంలో 51 పశువులను తరలిస్తున్నారు. పాలకుర్తి మండలం వావిలాల మూల మలుపు వద్దకు రాగానే డ్రైవర్ నిర్లక్ష్యంతో డీసీఎం అదుపు తప్పి బోల్తాపడింది. అందులో ఉన్న 13 గోవులు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో 13 గాయపడ్డాయి. పశు వైద్యాధికారి అశోక్‌రెడ్డి వాటికి వైద్య పరీక్షలు చేశారు. మిగిలిన 25 ఆవులను పోలీసులు గోశాలకు తరలించారు. డీసీఎం డ్రైవర్ పరారైనట్టు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. డ్రైవర్‌పై కేసు న మోదు చేసి వాహనాన్ని సీజ్ చేశామని సీఐ వివరించారు. ఘటనా స్థలాన్ని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య పరిశీలించారు.

విదుషీమణి విజయభారతి కన్నుమూత

- ప్రముఖులు, సాహితీవేత్తల సంతాపం
- దళితచైతన్య రచనలు, తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా ఎనలేని సేవలు
- సంతాపం తెలిపిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): ప్రముఖ రచయిత్రి, విదుషీమణి డాక్టర్ విజయభారతి అనారోగ్యంతో శనివారం కన్నుమూశారు. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను కుటుంబీకులు శుక్రవారం ఉదయం సనత్‌నగర్‌లోని రెనోవా హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. విజయభారతి తండ్రి ప్రముఖ కవి, రచయిత బోయి భీమన్న. కాగా ఆమె న్యాయవాది, దివంతగత మానవ హక్కుల నేత బొజ్జా తారకంకు భార్య. విజయభారతి కుమారుడు రాహుల్ బొజ్జా ప్రస్తుతం సాగునీటి పారుదలశాఖ కారదర్శిగా ఉన్నారు. విజయభారతి కోరికమేరకు ఆమె భౌతికదేహాన్ని కుటుంబసభ్యులు ఆదివారం గాంధీ మెడికల్ కళాశాలకు అప్పగించనున్నారు. బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ సహా పలువురు ప్రముఖులు విజయభారతి మృతి పట్ల సంతాపం తెలిపారు.

దళిత చైతన్య స్ఫూర్తి..

విజయభారతి రచయిత్రిగా, అనువాదకురాలిగా, తెలుగు సాహిత్య అకాడమీ డైరెక్టర్‌గా సామాజిక, సాహిత్యరంగాలకు ఎనలేని కృషి చేశారు. అంబేద్కర్ , జ్యోతిబా పూలేను అధ్యయనం చేశారు. ఆ ప్రభావంతోనే భారతీయ కుల వ్యవస్థ, స్వరూప స్వభావాల గురించి పురాణాలు, ఇతిహాసాల ఆధారంగా విశ్లేషణలు చేస్తూ అనేక రచనలు చేశారు. నర మేధాలు నియోగాలు.. పురాణాలు మరో చూపు వాటిలో ప్రసిద్ధమైనవి. అంబేద్కర్, పూలే జీవిత చరిత్రలను మొట్టమొదటిసారిగా తెలుగు సమాజానికి అందించిన ఘనత కూడా ఆమెకే దక్కుతుంది. వాటన్నింటినీ హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఆమెను పలు సాహిత్య అవార్డులు స్వీకరించారు. డాక్టర్ విజయభారతి 2013–2015 మధ్య సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ అధ్యక్షురాలిగా కొనసాగారు. దళితుల హక్కుల కోసం కీలకంగా పనిచేశారు. పురణాల్లో దళిత స్త్రీల పాత్రలపై కూడా అనేక రచనలు చేశారు. ఇటీవలనే ఆమె రాసిన వ్యాస సంకలనం '75ఏళ్ల



స్వతంత్ర భారతం స్త్రీలకు గుప్పెడు ధూళినే మిగిల్చిందా' అనే శీర్షికతో వెలువడింది. ఆత్మకథను కూడా రాసి ప్రచురణకు సిద్ధం చేసి ఉంచారు.

ప్రముఖులు, సాహితీవేత్తల సంతాపం..

డాక్టర్ విజయభారతి మృతిపై ప్రముఖులు, సాహితీవేత్తలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సామాజిక రంగాలకు ఆమె చేసిన సేవలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్మరించుకున్నారు. విదుషీమణి, మానవీయ కవయిత్రి, తెలుగునాట దళితచైతన్య జ్యోతికి చమురుపోసి వెలిగించారని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ కొనియాడారు. అంబేద్కరిస్టు, పరిశోధకురాలు విజయభారతి మృతి సాహిత్యానికి తీరని లోటని, దళిత దృక్పథంలో నుంచి ప్రాచీన సాహిత్యాన్ని పునర్మూల్యాంకనం చేస్తూ విజయభారతి రాసిన విలువైన గ్రంథాలు అస్తిత్వ ఉద్యమాలకు కొత్త చూపును అందించాయని ప్రముఖ కవి, విమర్శకుడు డాక్టర్ కోయి కోటేశ్వరరావు శ్లాఘించారు. డాక్టర్ విజయభారతి సమాజసేవ, చేసిన కృషి, త్యాగం, రచనలు, తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ చైర్మన్ మల్లెపల్లి లక్ష్మయ్య, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కృష్ణ కొనియాడారు. విజయభారతి మరణం సాహిత్యరంగానికి తీరనిలోటని తెలంగాణ సాహిత్య పరిషత్ మాజీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ పేర్కొన్నారు. ఆమె రచనలు అస్తిత్వ పోరాటానికి దిక్సూచిలా నిలిచాయని పేర్కొన్నారు.

విజయభారతి మృతికి కేసీఆర్ నివాళి

డాక్టర్ విజయభారతి మరణం పట్ల మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం ప్రకటించారు. సాహిత్య, సామాజిక అధ్యయనశీలిగా విశ్లేషకులుగా డాక్టర్ విజయభారతి చేసిన కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా సేవలందించిన విజయభారతి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచనలు, ప్రసంగాల సంపుటాలకు సంపాదకురాలుగా, మహాత్మా జోతిరావు పూలే జీవిత చరిత్రను తెలుగు సమాజానికి మొట్టమొదటిసారి అందించిన రచయిత్రిగా ఆమె కృషి అమోఘమని ఆయన కొనియాడారు. శోక తప్తులైన వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఏఈవోల పెన్‌డౌన్?

- డిజిటల్ క్రాప్ బుకింగ్ సర్వే చేయలేమని స్పష్టీకరణ
- సహాయకులు, ఇతర మార్గాలను చూడాలని విజ్ఞప్తి
- యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సర్కారు ఒత్తిడి
- రాష్ట్రంలోని 2,601మంది ఏఈవోల్లో ఆందోళన



వరి పంటను పరిశీలిస్తున్న ఏఈవోలు (ఫైల్)

కరీంనగర్,సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): డిజిటల్ క్రాప్ సర్వేపై రేవంత్ సర్కారు అనుసరిస్తున్న వైఖరిపై వ్యవసాయ విస్తరణాధికారులు భగ్గుమంటున్నారు. ఇప్పటికే 49రకాల విధులు నిర్వహిస్తూ.. అష్టకష్టాలు పడుతుండగా.. తాజాగా క్రాప్ సర్వే భారాన్ని మోపడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో 2,601 ఏఈవోలు ఉంటే అందులో 60శాతం మహిళలే ఉన్నారని పేర్కొన్నారు. క్రాప్ సర్వే యాప్‌ను వ్యక్తిగత సెల్‌ఫోన్‌లో అప్‌లోడ్ చేయమంటున్నారని, తద్వారా తమ వ్యక్తిగత సమాచారం యాప్ కంపెనీలకు వెళ్తుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. మంత్రులు, అధికారులకు మొరపెట్టుకోగా.. స్పందన కరవైంది. దీంతో పెన్‌డౌన్ సమ్మెవైపు వారు కార్యచరణ రూపొందిస్తున్నారు.

సర్వే..ఓ ప్రహసనం

దేశవ్యాప్తంగా పంటల బీమా, ఆహార భద్రత, పంటల వివరాల సేకరణ, ప్రకృతి వైపరీత్యాల పంట నష్టాలు, పంటల ఉత్పత్తులకు అనుగుణంగా ఎగుమతులు, దిగుమతులు, మార్కెటింగ్‌పై దృష్టి వంటి అంశాలను పరిగణిలోకి తీసుకొని.. కేంద్ర ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వేకు రెండేండ్ల క్రితం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం.. వ్యవసాయ రంగంలో డీపీఐని రూపొందించే లక్ష్యంతో 'డిజిటల్ అగ్రి మిషన్' పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. దీనికోసం రూ.2,817 కోట్లు వెచ్చిస్తోంది. ఈ సర్వేను ఈ నెల 27 నుంచి చేయాలని రాష్ట్రప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గతంలో ఈ సర్వేకు రాష్ట్రంలో 18 మండలాలను ఎంపిక చేశారు. ఇందులో కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం ఒకటి. ఇక్కడ పనిచేసే నలుగురు ఏఈవోలతో సర్వే కాదని గుర్తించి.. మరో 23 మంది ఏఈవోలను డిప్యూటేషన్ చేశారు. ఒక్క మండలం సర్వే చేయడానికి రెండున్నర నెలలు పట్టింది. 18 మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉన్నది. ప్రస్తుతం రాష్ట్రంలో 2,601 మంది ఏఈవోలు ఉన్నారు. రాష్ట్రం మొత్తం డిజిటల్ క్రాప్ సర్వే చేయాలంటే.. ఒక్కో ఏఈవో సగటున ఒక సీజన్‌లో 32 వేల ఫారమ్స్‌లో సర్వే నిర్వహించాల్సి ఉంటుంది. 20 మీటర్ల దూరం నుంచి మాత్రమే సదరు సర్వేనంబర్‌లోని పంటల ఫొటోలను క్యాప్చర్ చేసి అప్‌లోడ్ చేయవచ్చు. నెట్ పనిచేయకపోయినా, సాంకేతిక ఇబ్బందులున్నా... ఏమీ చేయలేని దుస్థితి. రాష్ట్రంలోని ఏఈవోల్లో 60 శాతం మహిళలే ఉన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఒక మండలాన్ని 30 మంది ఏఈవోలు కలిసి సర్వే చేస్తేనే రెండున్నర నెలలు పట్టినప్పుడు ప్రస్తుతం మండలంలో నలుగురు కలిసి ఎలా చేస్తారన్న ప్రశ్నను తెరపైకి తెస్తున్నారు.

ఇతర రాష్ట్రాల్లో భిన్న మార్గాల్లో..

ఆయా రాష్ట్రాల్లో వ్యవసాయ శాఖ సూపర్‌వైజర్‌గా మాత్రమే పనిచేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇందుకోసం గ్రామ సహాయకులను నియమించారు. వారికి కేంద్ర నిధుల నుంచి గౌరవభృతి చెల్లిస్తున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం టాటా కన్సల్టెన్సీలకు సర్వే అప్పగించింది. కర్ణాటక, కేరళ, ఒడిశా, పశ్చిమబంగా రాష్ట్రాలు నోడల్ ఏజెన్సీలతో సర్వే చేయిస్తున్నాయి. తమిళనాడులో రెవెన్యూకు అప్పగించారు. మధ్యప్రదేశ్‌లో ఓ స్వచ్ఛంద సంస్థతో సర్వే చేయిస్తున్నారు. రాష్ట్రంలో యాప్ డౌన్‌లోడ్ చేయని ఏఈవోలను సెలవుగా పరిగణించాలని జిల్లా అధికారులకు ఆదేశాలు వచ్చాయి. ఇతర రాష్ట్రాల్లో సర్వే కోసం ఒక్కో ఫారమ్స్‌కు రూ.15 చెల్లిస్తుండగా, మన రాష్ట్రంలో రూ.2 చొప్పున చెల్లించారు.

విజ్ఞప్తులు చేసి.. పెన్‌డౌన్ వైపు అడుగులు

డిజిటల్ క్రాప్ బుకింగ్ సర్వే సాధ్యం కాదని, ఏపీలో మాదిరిగా సహాయకులను నియమించాలని, ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా వివిధ మార్గాల్లో సర్వే చేయించాలని కోరుతూ.. వారం రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఏఈవోలు మంత్రులు, కలెక్టర్లు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇస్తున్నారు. వ్యవసాయశాఖలో క్షేత్రస్థాయి అధికారి నుంచి మొదలు పైస్థాయి అధికారి వరకు.. కలిసి మొర పెట్టుకున్నారు. శనివారం తెలంగాణ వ్యవసాయ విస్తరణ అధికారుల సెంట్రల్ ఫోరం కార్యవర్గ సమావేశాన్ని నాంపల్లిలోని టీఎన్జీవో భవన్‌లో నిర్వహించారు. ఏఈవో రాష్ట్ర అధ్యక్షుడు డీ శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి సురేశ్‌రెడ్డి, అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు. ఏఈవోల సమస్యలపై టీఎన్జీవో కేంద్రసంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం జగదీశ్వర్, ముజీబ్ హుస్సేనీ మద్దతు ప్రకటించారు. ఈ పరిస్థితులన్నింటినీ పరిగణలోకి తీసుకున్న ఏఈవోల సంఘం.. రెండు రోజుల సమయం ఇచ్చి.. ఈ వ్యవహారంపై ప్రభుత్వం స్పందించకపోతే పెన్‌డౌన్ సమ్మెకు వెళ్లాలని నిర్ణయించుకుంది. సోమవారం ప్రభుత్వ ప్రధానకార్యదర్శిని కలిసి మరోసారి విజ్ఞప్తి చేస్తామని, ప్రభుత్వం స్పందించకపోతే పెన్‌డౌన్ సమ్మె ఒక్కటే తమ ముందున్న మార్గం అని నిర్ణయానికి వచ్చినట్టు తెలిపారు.

కాలమ్-5 సవరించాలి: సీపీఎం

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గాల ఓటర్ల జాబితాలో కాలమ్ నంబర్–5ను సవరించాలనిక కోరుతూ రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ (సీఈవో)ను శనివారం బీఆర్కేభవన్‌లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డీజీ నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు బాబూరావు వినతిపత్రం అందజేశారు. వరంగల్–ఖమ్మం–నల్లగొండ, కరీంనగర్–మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్ శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గాలకు అక్టోబర్ 1 నుంచి ఓటర్ల నమోదు ప్రారంభమవుతున్నదని గుర్తుచేశారు. ఓటర్ల జాబితాలోని కాలమ్ నంబర్–5లో విద్యాసంస్థ పేరు, మండలం, జిల్లా తదితర పూర్తి పోస్టల్ అడ్రస్‌ను ప్రచురించాలని సూచించారు.



మెట్రో డీలక్స్ బస్సుల్లో సిబ్బందికి నో ఎంట్రీ

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): కొత్తగా ప్రవేశపెట్టిన మెట్రో డీలక్స్ బస్సుల్లో ఆర్టీసీ సిబ్బంది ప్రయాణించవద్దని టీజీఎస్ ఆర్టీసీ ఆదేశించింది. 'స్టాఫ్ నాట్ అలోడ్' అనే స్టిక్కర్లు అంటించింది. 'మహిళలు, పాత్రికేయులకు, బడి పిల్లలకు, ఎస్కార్ట్ పోలీసులకు, స్వాతంత్ర సమరయోధులకు, ఎయిడ్స్, డయాలసిస్ పేషంట్లకు, పోలీస్ అమరవీరుల సతీమణులకు, ఎస్కార్ట్, ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నది. అనేక మందికి 50 శాతం రాయితీలు ఆర్టీసీ యాజమాన్యం కల్పిస్తున్నది. సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు మాత్రం ఉచిత రవాణా సౌకర్యం లేకపోవడం దురదృష్టకరం' అని ఆర్టీసీ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన మెట్రో డీలక్స్ సర్వీసుల్లో ఆర్టీసీ సిబ్బందికి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించకపోవడం సరికాదని నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కమల్‌రెడ్డి మండిపడ్డారు. ఈ అంశంపై ఆర్టీసీ పునః పరిశీలించాలని సూచించారు.

కామారెడ్డి డిక్లరేషన్ అమలుచేయాలి

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి
- బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్
- కల్వకుర్తిలో బీసీల మహాధర్నా



కల్వకుర్తిలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్. చిత్రంలో పల్లె రవికుమార్, నాయకులు

కల్వకుర్తి రూరల్, సెప్టెంబర్ 28 : అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో ఇచ్చిన డిక్లరేషన్ ప్రకారం.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో కొమ్ము శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో ఆర్‌ఎస్ ప్రవీణ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకు కోసం వాడుకుంటున్నారని, వారు రాజకీయ సాధికారతతోనే అభివృద్ధి సాధించగలుగుతారని తెలిపారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ తెలంగాణ చివరి ఓసీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డియేనని అన్నారు. రాబోయే కాలంలో బీసీలదే హవా కొనసాగనున్నదని చెప్పారు. బీసీలకు రిజర్వేషన్ అమలు చేసేలా తాను కాంగ్రెస్ అధిష్ఠానంతో మాట్లాడుతానని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పల్లె రవికుమార్‌గౌడ్, ఉప్పల వెంకటేశ్, జంగయ్య, రవికుమార్ ఉష, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయకుంటే తిరగబడుతాం

- ఎమ్మెల్యే మందుల సామేల్‌కు రైతుల హెచ్చరిక

అడ్డగూడూరు, సెప్టెంబర్ 28: రూ.2 లక్షల రుణమాఫీ చేయకుంటే తిరగబడుతామని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌ను రైతులు హెచ్చరించారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరులో విండో కార్యాలయంలో నిర్వహించిన పీఏసీఎస్ సర్వసభ్య సమావేశానికి హాజరైన తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్.. సీఎం రేవంత్‌రెడ్డి పాలన ఎలా ఉందని రైతులను అడిగారు. మండల కేంద్రానికి చెందిన రైతు బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రూ.2 లక్షలపై ఉన్న రైతులు ఆ డబ్బులను బ్యాంకులకు చెల్లిస్తేనే రుణమాఫీ అవుతుందని ఎమ్మెల్యే తెలిపారు. వెంటనే అక్కడున్న రైతులు రూ.2 లక్షల పైన ఉన్న డబ్బులు అప్పుడే కట్టామని తెలుపడంతో కొంచెం సమయం పడుతుంది చెప్పారు. విండో చైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి రూ.1.50 కోట్లు వస్తే తమ సంఘం పరిధిలోని రైతులందరికీ మాఫీ వర్తిస్తుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. వెంటనే డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్ చేసి అడ్డగూడూరు సింగిల్ విండోకు రూ.1.50 కోట్లు మంజూరు చేయాలని కోరారు. దీంతో ఆయన వచ్చే నెల 3 తర్వాత మంజూరు చేస్తానని సమాధానమిచ్చారు.

అసంపూర్తిగా రుణమాఫీ

- పార్టీ ఫిరాయింపులను ఎలా ప్రోత్సహిస్తారు?
- ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో ఇచ్చిన రైతు రుణమాఫీని అసంపూర్తిగా చేసిందని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కౌన్సిల్ అభిప్రాయపడింది. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మొదటి సమావేశంలో పలు అంశాలపై చర్చించి తీర్మానం ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ హామీలను సంపూర్ణంగా అమలు చేయాలని కోరుతూ అక్టోబర్ 21న అజాద్ హింద్ దివస్ పార్టీ తరఫున కార్యాచరణ చేపట్టాలని తీర్మానించినట్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి చెప్పారు. గతంలో పార్టీ ఫిరాయింపులను తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రోత్సహించడం రాహుల్‌గాంధీ ఆశయాలకు, ఇండియా బ్లాక్ మౌలిక సూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయని రాష్ట్ర కౌన్సిల్ అభిప్రాయపడింది.

రోడ్లకు రాజకీయ గ్రహణం!

- నిధులు లేక చేతులెత్తేసిన రాష్ట్ర సర్కారు
- మీకిస్తే మాకేంటి అనే ధోరణిలో కేంద్రం
- ఇరుకు రోడ్లతో ప్రజలకు తీవ్ర అవస్థలు
- అప్‌గ్రేడ్ చేసేందుకు కేంద్రం ససేమిరా
- ఏండ్లుగా పెండింగులోనే ప్రతిపాదనలు



హైదరాబాద్, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని రోడ్లకు రాజకీయ గ్రహణం పట్టుకున్నది. పెరిగిన ట్రాఫిక్ అవసరాలకు తగ్గట్టుగా రోడ్లను అప్‌గ్రేడ్ చేయకపోవడంతో ఇరుకు రోడ్లతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను రాజకీయ కోణంలో ఆలోచిస్తుండటమే ఇందుకు కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాలకు అనుసంధానంగా కొనసాగుతున్న 16 రోడ్లు కాలక్రమంలో ట్రాఫిక్ పెరగడం వల్ల ఇరుకు రోడ్లుగా మారిపోయాయి. ఇందులో ప్రధానంగా పారిశ్రామికవాడలు, పర్యాటక స్థలాలు, అంతర్రాష్ట్ర రోడ్లు, జిల్లా కేంద్రాలను అనుసంధానం చేసే రోడ్లు ఉన్నాయి. ప్రస్తుతం వీటిలో కొన్ని సింగిల్ రోడ్లుగా, మరికొన్ని డబుల్ రోడ్లుగా ఉన్నాయి. సుమారు 1,617 కిలోమీటర్ల పొడవున ఉన్న ఈ రోడ్లపై నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. గత కేసీఆర్ సర్కారు ఈ రోడ్లను అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రణాళికలు రచించి కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించింది. రాష్ట్ర అవసరాలను దృష్టిలో ఉంచుకొని వీటిని వెంటనే నాలుగు లేన్ల రోడ్లుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరింది. కేంద్రం నుంచి స్పందన రాలేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోనే వీటిని అప్‌గ్రేడ్ చేయాలని భావించారు. ఈలోగా రాష్ట్రంలో ఎన్నికలు జరగడం, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. గత తొమ్మిది నెలల్లో ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మూడు సార్లు కేంద్రమంత్రి గడ్కరీని కలిసి విజ్ఞప్తి చేసినా సానుకూల ఫలితం రాలేదు. కనీసం దశలవారీగానైనా మంజూరు చేయాలని కోరినా ఇంతవరకు ఒక్క రోడ్డుకు కూడా మోక్షం లభించలేదు.

నిధులు లేవని వీరు.. మీకిస్తే మాకేంటి అని వారు..

రాష్ట్రాల్లో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా రోడ్ నెట్‌వర్క్‌ను అప్‌గ్రేడ్ చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉన్నది. ప్రాధాన్యాలకు అనుగుణంగా వాటిని జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయాలి. కేంద్రంలోని బీజేపీ సర్కారు రాజకీయ కోణంలో ఆలోచిస్తూ తెలంగాణ ప్రతిపాదనలను పట్టించుకోవడంలేదనే విమర్శలున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లోపించిందనే వాదనలూ లేకపోలేదు. తెలంగాణకు మేలు చేస్తే తమకు ఒనగూరే ప్రయోజనం ఏమిటి? మేలు చేయకుంటే వచ్చే నష్టం ఏమిటి? ఒకవేళ తెలంగాణలో రోడ్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసినా ఆ క్రెడిట్ రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుంది కదా... అనే ధోరణితో కేంద్రం ఉన్నట్టు అధికారవర్గాలు కూడా అభిప్రాయపడుతున్నాయి. మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వం కూడా రోడ్ల అభివృద్ధికి సొంత నిధులు వెచ్చించకుండా సాధ్యమైనంత మేరకు కేంద్రం నుంచి నిధులు, ప్రాజక్టులు రాబట్టాలనే ప్రణాళికలతో ముందుకు సాగుతున్నది.

అప్‌గ్రేడ్ చేయడానికి ప్రతిపాదిత రోడ్ల వివరాలు

- జగిత్యాల-కాటారం (130 కి.మీ.)
- దిండి-నల్లగొండ (100 కి.మీ.)
- భువనగిరి-చిట్యాల (44 కి.మీ)
- చౌటుప్పల్ -సంగారెడ్డి (182 కి.మీ)
- మరికల్ -రామసముద్రం (63 కి.మీ.)
- వనపర్తి-మంత్రాలయం (110 కి.మీ.)
- మన్నెగూడ-బీదర్ (134 కి.మీ.)
- కరీంనగర్-పిట్లం (165 కి.మీ.)
- ఎర్రవెల్లి క్రాస్‌రోడ్-రాయచూర్ (67 కి.మీ)
- కొత్తపల్లి-దుద్దెడ (75 కి.మీ.)
- సారపాక -ఏటూరునాగారం (93 కి.మీ.)
- దుద్దెడ-రాయగిరి క్రాస్‌రోడ్ (63 కి.మీ.)
- జగ్గయ్యపేట-కొత్తగూడెం (100 కి.మీ.)
- సిరిసిల్ల-కోరుట్ల (65 కి.మీ.)
- భూత్పూర్-సిరిగిరిపాడు (166 కి.మీ.)
- కరీంనగర్-రాయపట్నం(60 కి.మీ.)

'యాదాద్రి' స్వర్ణతాపడంపై రెండు కమిటీలు

- వచ్చే బ్రహ్మోత్సవాలకు పూర్తిచేయాలని ఆదేశం
- స్మార్ట్ క్రియేషన్స్ కంపెనీకి పనుల అప్పగింత

హైదరాబాద్, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ) : గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ విమాన గోపురానికి బంగారు తాపడం చేయించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపారు. స్మార్ట్ క్రియేషన్స్ కంపెనీకి పనులు అప్పగించిన ప్రభుత్వం.. వచ్చే ఏడాది జరుగనున్న బ్రహ్మోత్సవాలకు, అంటే మార్చి 2025 నాటికి పూర్తి చేయాలని సంకల్పించింది. పనుల పర్యవేక్షణతోపాటు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రభుత్వం రెండు కమిటీలను ఏర్పాటుచేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. పనులను వెంటనే ప్రారంభించి గడువులోగా పూర్తిచేయాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు.

స్వర్ణతాపడానికి 65 కోట్ల అంచనా..

గత కేసీఆర్ సర్కారు 125 కిలోల మేలిమి బంగారంతో విమానగోపురానికి స్వర్ణతాపడం చేయాలని నిర్ణయించింది. స్వయంగా కేసీఆర్ కేజీ 16 తులాల బంగారాన్ని విరాళంగా అందజేశారు. స్వర్ణతాపడానికి రూ.65 కోట్లు ఖర్చవుతుందని అప్పట్లో అంచనా వేయగా, దాతల నుంచి 10 కిలోలకు పైగా బంగారం, రూ.30 కోట్లకు పైగా నగదు సమకూరింది.

భద్రాద్రిలో భూసేకరణకు ఉత్తర్వులు..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సీతారామ చంద్రస్వామి ఆలయ అభివృద్ధి, విస్తరణ నిమిత్తం భూసేకరణకు అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులిచ్చింది. గత కేసీఆర్ ప్రభుత్వం భద్రాద్రి ఆలయ అభివృద్ధికి అప్పట్లో రూ.100కోట్లు మంజూరు చేసింది. అనంతరం ప్రభుత్వం మారడంతో పనులు ముందుకు సాగలేదు.

సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్‌లో విజిలెన్స్ తనిఖీలు!

రేషన్ డీలర్ల నియామకంలో అవినీతి జరిగిందంటూ ఆరోపణలు

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): రాజన్న సిరిసిల్ల జిల్లాలో రేషన్ డీలర్ల నియామకంలో అవినీతి అక్రమాలు జరిగాయని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు మరోసారి శనివారం తనిఖీలు చేపట్టినట్టు తెలిసింది. ఈ విషయంలో ఇప్పటికే ప్రభుత్వం విచారణకు ఆదేశించినట్టు సమాచారం. కాగా రెండు రోజుల క్రితం సివిల్ సప్లయీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సిరిసిల్లకు వచ్చి ఆర్డీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. తాజాగా, శనివారం కూడా సుమారు రెండు గంటలపాటు రికార్డులను పరిశీలించి, అధికారులను విచారించినట్టు తెలిసింది. జిల్లాలో పదేండ్ల కిందట మహిళా సంఘాలకు 17 దుకాణాలను అప్పటి ప్రభుత్వం కేటాయించింది. ఆర్థిక పరిపుష్టి సాధించడంతోపాటు పేదలకు బియ్యం పంపిణీలో పారదర్శకంగా ఉండాలన్న ఉద్దేశంతో మహిళలను రేషన్ డీలర్లుగా నియమించింది. కాంగ్రెస్ ప్రభుత్వం రావడం, స్థానిక నేతలు వాటిని రద్దు చేయించి, కొత్తగా ఖాళీ అయిన వాటితో కలుపుకొని మొత్తం 58 దుకాణాలకు నోటిఫికేషన్ వేయించేలా అధికారులపై ఒత్తిడి తెచ్చారన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో అధికారులు.. కొనసాగుతున్న డీలర్‌షిప్‌లను రద్దు చేసి ఇటీవల రాతపరీక్షలు, మౌఖిక పరీక్షలు నిర్వహించారు. రద్దు చేసిన 17 దుకాణాల్లో రెండింటిని వదిలి 15 దుకాణాలను కొత్తవారికి కేటాయించారు. రాతపరీక్షకు 830 మంది దరఖాస్తు చేసుకోగా, 765 మంది పరీక్షలు రాశారు. పరీక్షలు నిర్వహించిన అధికారులు పేపర్లమీద ఇన్విజిలేటర్ల సంతకాలు తీసుకోలేదని, మార్కుల జాబితా బోర్డుపై ప్రదర్శించకుండానే అభ్యర్థులను ఎంపిక చేశారంటూ విమర్శలు వచ్చాయి.

ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ !

హైదరాబాద్, సెప్టెంబర్28 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణ అంశంపై ఏకసభ్య జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని సర్కారు యోచిస్తున్నది. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు తీర్పును వెలువరించిన నేపథ్యంలో తగిన సిఫారసులు చేసేందుకు ప్రభుత్వం క్యాబినెట్ సబ్‌కమిటీని నియమించింది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చైర్మన్‌గా కమిటీ శనివారం సచివాలయంలో మరోసారి భేటీ అయ్యింది. పంజాబ్, హర్యానా, తమిళనాడు సర్కార్లు ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ అంశంపై చర్చించి, అదే తరహాలో రాష్ట్రంలోనూ అమలు చేయాలని నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తున్నది. 2011 జనాభా లెక్కలనే పరిగణనలోకి తీసుకోవాలని సమాలోచనలు చేసినట్టు సమాచారం. 1999 నుంచి 2004 వరకు జరిగిన ఎన్నికల్లో ఉపకులలాలకు ఏ మేరకు లబ్ధి జరిగిందనే అంశపై కూడా చర్చించినట్టు తెలిసింది. ఈ మొత్తం అంశాలపై చర్చించేందుకు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ కావాలని ఉపసంఘం నిర్ణయించినట్టు సమాచారం.



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి అశోక్

ఆసరా పింఛన్‌తో రోడ్ల మరమ్మతు

- రూ.20 చొప్పున విరాళం ఇచ్చిన వృద్ధులు
- 2 వేలు పోగేసి పనులు చేయించిన పంచాయతీ కార్యదర్శి
- రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం పోతుగల్‌లో ఘటన

చేవెళ్ల రూరల్, సెప్టెంబర్ 28: రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధి పోతుగల్ గ్రామంలోని షాద్‌నగర్–చేవెళ్ల హైవేపై ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు వృద్ధులు ముందుకొచ్చారు. గ్రామానికి చెందిన 200 మంది పింఛన్ దారులు (వృద్ధులు) రూ.20 చొప్పున రూ.2 వేలు పోగేసి పంచాయతీ కార్యదర్శి అశోక్‌కు అందజేశారు. ఈ డబ్బులతో కార్యదర్శి శనివారం గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి రోడ్డుకు మరమ్మతులు చేయించారు.

చార్జీల పెంపుపై కమిటీ

హైదరాబాద్, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ): ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్‌కు సంబంధించి మండీ లేబర్ చార్జీల పెంపుపై ప్రభుత్వం శనివారం కమిటీ వేసింది. సివిల్‌సప్లై కమిషనర్ చౌహాన్ చైర్మన్‌గా, ఎఫ్‌సీఐ చెన్నై ఈడీ, ఎఫ్‌సీఐ రీజియన్ జీఎం, రాష్ట్ర మండీ బోర్డ్ చైర్మన్, గిడ్డంగుల సంస్థ ఎండీ, కేంద్ర గిడ్డంగుల సంస్థ ఆర్‌ఎం, వ్యవసాయ శాఖ డైరెక్టర్, కార్మికశాఖ ప్రతినిధి, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ సభ్యులుగా ఉండనున్నారు.

లోక్‌అదాలత్‌లో 9.87 లక్షల కేసులు పరిష్కారం

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టుల్లో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 9,87,065 కేసులు పరిష్కారమైనట్టు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ వెల్లడించింది.

విద్యార్థినులతో హెచ్‌ఎం అసభ్య ప్రవర్తన..కేసు

వైరా రూరల్, సెప్టెంబర్ 28 : విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ హెచ్‌ఎం ఉదంతం ఖమ్మం జిల్లా వైరా మండలంలో శనివారం వెలుగులోకి వచ్చింది. పాలడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చావా శ్రీనివాసరావు కొంత కాలంగా 8, 9, 10వ తరగతి విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు వారిని బూతులు తిడుతున్నాడు. విద్యార్థినులు తల్లిదండ్రులకు చెప్పడంతో గ్రామస్థులతో కలిసి శనివారం పాఠశాల వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఆందోళన చేస్తారనే విషయాన్ని ముందుగానే పసిగట్టిన హెచ్‌ఎం శ్రీనివాసరావు పాఠశాల నుంచి తప్పించుకున్నాడు. ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు వచ్చి కార్యాలయంలో ఉపాధ్యాయులతో మాట్లాడుతుండగా ఆందోళనకారులు గదికి తాళం వేశారు. అంతటితో ఆగకుండా ఫర్నిచర్ ధ్వంసం చేశారు. దీంతో డీఈవో సోమశేఖర శర్మ, సీఐ నూనావత్ సాగర్ పాఠశాలకు చేరుకొని తల్లిదండ్రులకు నచ్చజెప్పి.. గదిలో నిర్బంధించిన ఎంఈవో, ఉపాధ్యాయులను బయటకు తీసుకొచ్చారు. హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేయగా, విచారణ చేపట్టి, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీఈవో హామీ ఇచ్చారు. ఫిర్యాదు స్వీకరించిన సీఐ సాగర్ హెచ్‌ఎంపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.